


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

కార్మిక కోడ్‌లు కార్మిక హితమైనవేనా? 06
ఢిల్లీలో వాయు కాలుష్యం... ‘స్లో పాయిజన్’గా భయానక పరిస్థితి
వయస్సు కేవలం సంఖ్య మాత్రమే.. 05

సంపుటి 09, సంచిక: 04 | ఆదివారం | 30-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## గ్లోబల్ సమ్మిట్‌లో 3వేల డ్రోన్లు

గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేలా షో

రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 9న జరగనున్న ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్’ ముగింపు సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేలా డ్రోన్ షోను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఒకేసారి 3 వేల డ్రోన్‌లతో ఆకాశంలో “తెలంగాణ రైజింగ్– కమ్... జాయిన్ ది రైజ్” అనే ఆంగ్ల అక్షరాల సమాహారం ఆవిష్కరించేలా డ్రోన్ షో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు డ్రోన్లతో ఆకాశంలో అత్యంత పొడవైన వాక్యాన్ని ప్రదర్శించిన రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ అబుదాబీ పేరుతో ఉంది. 2025 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 2,131 డ్రోన్లతో తరువాయి 2లో



## తొలి విడతకు ముగిసిన నామినేషన్లు

4,236 పంచాయతీలు, 37,440 వార్డులు

నేడు నామపత్రాల పరిశీలన



ప్రజాపక్షం/హైదరాబాద్

పంచాయతీ ఎన్నికల తొలి దశ నామినేషన్‌ల తుది గడువు శనివారంతో ముగిసింది. మొదటి దశలో 4,236 గ్రామపంచాయతీతలు, 37,440 వార్డులలో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. ఈనెల 30(ఆదివారం) నామినేషన్‌ల పరిశీలన జరపుతారు. పరిశీలన అనంతరం పోటీలో అర్హత పొందిన అభ్యర్థులను ప్రకటిస్తారు. అయితే సోమవారం అప్పీళ్ల స్వీకరణ, డిసెంబర్ 2 అప్పీళ్ల పరిష్కారం ప్రక్రియను చేపట్టనున్నారు. డిసెంబర్ 3న నామినేషన్‌ల ఉపసంహారణ గడువు తరువాయి 2లో

# పవర్‌ఫుల్‌గా అభివృద్ధి

- రాష్ట్ర జిఎస్‌డిపిని పెంచేందుకు ప్రజాప్రభుత్వం చర్యలు
- ప్రజల విద్యుత్ అవసరాలు తీర్చేందుకు పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం
- 2047 నాటికి మూడు ట్రిలియన్ల జిడిపి లక్ష్యం
- అప్పటికి 8 రెట్లు పెరగనున్న విద్యుత్ డిమాండ్
- బొగ్గుగనుల వద్దే థర్మల్ ప్రాజెక్టు నిర్మించే యోచన
- ఎవరు తక్కువకు నిర్మిస్తే వారికే ప్రాజెక్టులు
- 2014న 6,755 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ 25 నాటికి 17వేల మెగావాట్లకు చేరింది
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి



ప్రజాపక్ష/హైదరాబాద్

భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర జిఎస్‌డిపిని పెంచేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలను చేపట్టిందని, అందులో భాగంగా ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. 2047 నాటికి 3 ట్రిలియన్‌ల జిడిపి లక్ష్యాన్ని చేరాలంటే తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఏటా 13 శాతం వృద్ధి, విద్యుత్ డిమాండ్‌లో ఏటా 10 శాతం వృద్ధి జరిగి తద్వారా 2047 నాటికి పీక్ పవర్ డిమాండ్ ఎనిమిది రెట్లు పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో విశాల స్థాయిలో విద్యుత్ సామర్థ్యాన్ని పెంచడం తప్పనిసరి అని, ఇది నమ్మకమైన విద్యుత్ సరఫరా, ఆర్థిక విస్తరణకు కీలకమని, ఈ లక్ష్య సాధనకు 2025–2035 పదేళ్ల విద్యుత్ సామర్థ్య విస్తరణ ప్రణాళికను రాష్ట్రం ప్రారంభించిందని డిప్యూటీ సిఎం వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ (పునర్వినియోగ విద్యుత్), సోలార్, విండ్, హైడల్ సామర్థ్యాన్ని భారీగా పెంచి, ఫాసిల్ ఫ్యూయల్స్‌పై ఆధారాన్ని తగ్గించడం, దీర్ఘకాలంలో వ్యయాన్ని తగ్గించడం, వాతావరణ స్థిరత్వాన్ని సాధించడం లక్ష్యమని ఆయన చెప్పారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ఆర్థిక వృద్ధికి విద్యుత్ వెన్నెముక అని, పరిశ్రమలు, సేవారంగం, ఎఐ, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆధునిక వ్యవసాయం అన్ని రంగాలలో ఉపాధి, అభివృద్ధి విద్యుత్తుపైనే ఆధారపడి ఉంటాయని, ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చేసిన తరువాయి 2లో




## లేబర్ కోడ్‌ల అమలు నిలిపేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ కార్మిక సంఘాలు విజ్ఞప్తి

కార్మికశాఖమంత్రి వివేక్‌కు వినతిపత్రం సమర్పణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను అమలు చేయొద్దని కోరుతూ ఐఎన్‌టియుసి జాతీయ నాయకుడు నాగన్న గౌడ్, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు యం.డి.యూసుఫ్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి జి.అనురాధ, ఎఐయుటియుసి రాష్ట్ర అధ్యక్షుడు భరత్ కలిసి కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి తరువాయి 2లో



## ఎయిర్ బస్‌లకు సోలార్ రేడియేషన్ దెబ్బ

- దేశంలో ‘ఎ 320’ విమానాలకు అంతరాయం
- ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఇండిగో సేవల్లో జాప్యం
- ప్రపంచవ్యాప్తంగా ఆరువేల విమానాల సాఫ్ట్‌వేర్ మార్పు

**న్యూఢిల్లీ :** సోలార్ రేడియేషన్ ప్రభావం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎయిర్ బస్ ఎ 320 రకం విమానాల సేవలకు తాత్కాలికంగా అంతరాయం కలిగింది.ఇందులో భాగంగా భారత్‌లో కూడా ఇండిగో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానయాన సంస్థలకు చెందిన ఎ 320 రకం విమాలలో సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాల్సిన అవసరం వచ్చింది. ఈ మార్పుల కారణంగా దేశంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ మార్పుల ప్రక్రియ ఆదివారం సాయంత్రం నాటికి పూర్తవుతుంది. అప్పటివరకూ ఎ 320 విమాన ప్రయాణికులకు రాకపోకల్లో విమానాశ్రయాల్లో అసౌకర్యం కొనసాగుతుంది. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్, కోల్‌కతాలలో ఉన్న ఎయిర్‌లైన్స్ స్థావరాలలో ఈ సాంకేతికపరమైన మార్పుల ప్రక్రియ జరుగుతోంది. ఎయిర్ బస్ ఎ 320 రకం విమానాలలో ఉంటే సాఫ్ట్‌వేర్‌కు మార్పులు చేర్పులు అవసరమని, లేకపోతే గగనతలం మార్గమధ్యలో ప్రయాణమార్గాన్ని నిర్దేశించే సాఫ్ట్‌వేర్‌కు అంతరాయం కలిగి విమానంలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉంటాయని తరువాయి 2లో



## రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ పనులు త్వరలో పూర్తి

- సాకారం కానున్న కల
- కాజీపేటలో తయారీ యూనిట్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- వేయిస్తంభాల గుడి పునరుద్ధరణ పనుల్లో జాప్యంపై ఆగ్రహం

ప్రజాపక్షం/హనుమకొండ


కాజీపేటలో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ కల త్వరలో సాకారం కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా పర్యటనలో భాగంగా అయోధ్యపురంలో ఉన్న రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తక్కువ సమయంలో సమస్యలు అధిగమించి చాలా వేగవంతంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేస్తుందన్నారు. ఈ యూనిట్ 160 ఎకరాల్లో నిర్మాణం జరుగుతుందన్నారు. దీనికి రూ.521 కోట్ల నిధులను ఖర్చు పెడుతున్నామన్నారు. ఆధునిక పరికరాలు అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందన్నారు.నిర్మాణంలో 75 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఇక్కడ 16 కోచ్ లతో కూడిన రాక్స్ ఉత్పత్తి జరగబోతుందన్నారు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులు అన్ని రాష్ట్రాలకు సరఫరా చేసే అవకాశం ఉందన్నారు.ఉద్యోగాల విషయంలో కూడా స్థానికులకే అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. వాటర్ రీయూజ్ కోసం గ్రీన్ కాన్సెప్ట్ తో నిర్మాణం తరువాయి 2లో

## మా మధ్య ఎలాంటి విభేదాలు లేవ్

- భవిష్యత్‌లో కూడా ఉండవు
- బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో సిద్ధరామయ్య, డికె శివకుమార్
- నాయకత్వ మార్పుపై గందరగోళానికి తెర!



**బెంగళూరు :** కర్నాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై కొనసాగుతున్న గందరగోళానికి తెరపడింది. పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు సిఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ ముఖ్యమంత్రి నివాసం కావేరీలో శనివారం బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఇద్దరూ రెట్టె విరిచారు. వారి అల్పాహార సమావేశం కర్ణాటకలోని ఇద్దరు బలమైన వ్యక్తుల మధ్య అధికార పోరును తగ్గించినట్లుగా భావిస్తున్నారు. అల్పాహారం తర్వాత సిఎం సిద్ధ, డికె విలేకరుల సమావేశంలో మ్రాట్లాడారు. తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవని, భవిష్యత్తులో కూడా ఉండబోవని, ఐక్యంగా ఉంటామని చెప్పారు. పార్టీ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. 2.5 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్న అంశంపై ప్రతిష్టంభనను ముగించడానికి కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశం మేరకు సిఎం ఈ అల్పాహార సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం మధ్య అధికార పోరు కొనసాగితే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని ప్రతిపక్ష బిజెపి హెచ్చరించింది. విలేకరుల సమావేశంలో సిద్ధరామయ్య మాట్లాడుతూ ‘కొన్ని అవాంఛిత గందరగోళం సృష్టించబడినందున నేను శివకుమార్‌తో అల్పాహార సమావేశం నిర్వహించాను. అది మీడియా ద్వారా సృష్టించబడింది’ అని అన్నారు. ‘మా మధ్య విభేదాలు లేవు. నేటికీ ఎలాంటి విభేదాలు లేవు, భవిష్యత్తులో కూడా అలాంటివి ఉండవు. ఇప్పటి నుండి అలాంటివి ఉండకుండా చూసుకుంటాను’ అని ఆయన అన్నారు. తాము ఐక్యంగా ఉన్నామని, కలిసేకట్టుగానే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పారు. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేరని సిద్ధరామయ్య తరువాయి 2లో



## ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.707.30 కోట్లు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్


రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు సంబంధించిన రూ.707.30 కోట్లు విడుదల చేస్తూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సిఎం ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు నవంబర్ నెలకు సంబంధించి రూ.707.30 కోట్ల పెండింగ్ బిల్లులను శనివారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలో భాగంగా ప్రతినెల రూ.700 కోట్లకుపైగా నిధులను విడుదల చేస్తున్నది. అందులో భాగంగా ఈనెల రూ.707.30 కోట్లను ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఆర్థిక శాఖ విడుదల చేసింది. నవంబర్‌తో వరుసగా నాలుగు నెలలుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తూ వస్తోంది. ఇందులో గ్రాట్యుటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్స్, అడ్వాన్స్ లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయని అధికార యాంత్రాంగం తెలియజేసింది.

# రుణ హత్యలు..

పుట్టుకొస్తున్న ప్రైవేటు రుణ యాప్‌లు

వడ్డీల పేరుతో నిలువుదోపిడీ

సామాన్యుల ప్రాణాలతో చెలగాటం



ప్రజాపక్షం /మంచిర్యాల

‘స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు, చిటికెలో రుణం మీ ఖాతాలో పడుతుంది’ అంటూ ఊరించే ప్రకటనల వెనుక మరణ మృదంగం మోగుతోంది. అవసరాలకు అప్పు తీసుకోవడం సహజమే అయినా, ప్రస్తుతం పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కొన్ని ప్రైవేట్ రుణ యాప్‌లు, సంస్థలు సామాన్యుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. సిబిల్ స్కోర్ ఆధారంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుని, వడ్డీల పేరుతో నిలువు దోపిడీ చేస్తూ, చెల్లించలేని పక్షంలో మానసికంగా వేధించి ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. ఇవి కేవలం ఆత్మహత్యలు కావు, వ్యవస్థీకృత రుణ హత్యలు.

**వ్యక్తిగత గోప్యత గాలికి**

ఒక సామాన్యుడి ఫోన్ నంబర్, ఆధార్, పాన్ కార్డు వివరాలు ఈ ప్రైవేట్ సంస్థలకు ఎలా చేరుతున్నాయన్నది అతిపెద్ద ప్రశ్న. బ్యాంకింగ్ వ్యవస్థలో అత్యంత రహస్యంగా ఉండాల్సిన సమాచారం మార్కెట్లో సరుకులా మారుతోంది. వినియోగదారుడు తరువాయి 12లో

తుఫాన్ బీభత్సం

## శ్రీలంకలో అత్యవసర పరిస్థితి

123 మంది మృతి.. మరో 130 మంది గల్లంతు

రెండులక్షల మందిపై ప్రభావం

ద్వీప దేశానికి భారత్ సాయం



**కొలంబో:** దిత్వా తుఫాను, వరదలు, కొండచరియల విధ్వంసంతో అతలాకుతలమైన శ్రీలంకలో పరిస్థితులు చక్కబడేవరకూ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. భారతదేశం సహాయాన్ని పంపింది. ఆ దేశంలో సహాయ కార్యక్రమాల నిమిత్తం 80 మంది ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలను పంపింది. ప్రకృతి విలయం కారణంగా ద్వీపదేశం ఒతటా తీవ్రమైన పరిస్థితులు నెలకున్నాయని అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే శనివారం చెప్పారు.శ్రీలంక ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ విభాగం ఒక ప్రకటన చేస్తూ ఇప్పటివరకూ దేశంలో 123 మంది మరణించారనీ, మరో 130 మంది జాడ తెలియడంలేదని శనివారం ఉదయం ప్రకటించింది. 61,000 తరువాయి 12లో

దిత్వా ధాటికి

## వణికిన తమిళనాడు



**చెన్నై :** దిత్వా తుఫాన్ తమిళనాడును వణికిస్తోంది. చాలాప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటమే కాకుండా పెద్దఎత్తున గాలులు వీస్తున్నాయి. దీంతో సహాయక బృందాలను అప్రమత్తం చేశారు. తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ మరింత బలపడింది. దీని ప్రభావంతో తమిళనాడువ్యాప్తంగా బలమైన గాలులు వీస్తుండటమే కాకుండా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ తుఫాన్ పుదుచ్చేరి, ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతోంది. రానున్న కొన్ని రోజులపాటు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని వాతావరణ విభాగం అప్రమత్తం చేసింది. ప్రస్తుతం పుదుచ్చేరికి 300 కి.మీ, చెన్నైకి 400 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటలుగా 7 కి.మీ వేగంతో కదులుతోంది. ఆదివారం తెల్లవారుజామున తీవ్రవాయుగుండంగా తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం తరువాయి 12లో



# ప్రపంచం

WORLD NEWS

## 62 ఏళ్ళ వయసులో వివాహం చేసుకున్న ఆస్ట్రేలియా ప్రధాని




**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బెనీస్ వివాహం చేసుకున్నారు. పదవిలో ఉండగా వివాహం చేసుకున్న మొట్టమొదటి ప్రధానమంత్రిగా ఆయన రికార్డు సృష్టించారు. ఆయన వయసు 62 సంవత్సరాలు. ఈ ఏడాదిలో ఆస్ట్రేలియా పార్లమెంటు చివరి సమావేశం పూర్తయిన తర్వాత శనివారం మధ్యాహ్నం కాన్‌బెర్రా నగరంలోని తన అధికారిక నివాసంలో తన భాగస్వామి జోడీ హేడాన్‌ను పెళ్ళాడారు. అభిమానుల కోలాహలం మధ్య వారిద్దరూ అందరికీ అభివాదాలు చేశారు.2019 నుండి లేబర్‌పార్టీకి నాయకత్వం వహిస్తున్న అల్బెనీస్ 2016 నుండి పార్లమెంటు సభ్యుడుగా కొనసాగుతున్నారు. ‘‘ఇరువురం ప్రేమను పంచుకుంటూ మా కుటుంబ సభ్యులు, స్నేహితులమధ్య భావి జీవితాన్ని కలిసి గడపాలని మేం నిర్ణయించుకున్నాం’’ అని అల్బెనీస్ సంక్షిప్త ప్రకటనలో తెలియజేశారు.

## డ్రోన్లతో రష్యా దాడి

### ముగ్గురు మృతి

### కీవ్ రీజియన్‌లో అంధకారం

**కీవ్:** ఒకవైపు శాంతి చర్చలకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ రష్యా–ఉక్రేన్ మధ్య పరస్పర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం తెల్లవారకముందే 600 డ్రోన్లతో కీవ్ నగరంపై రష్యా దాడులు చేసింది. మరో 36 క్షిపణులను కూడా ప్రయోగించింది. ఈ దాడుల్లో ముగ్గురు మరణించారు. 13 ఏళ్ళ బాటుడు సహా 29 మంది గాయపడినట్లు కీవ్ నగర మేయర్ విటాలీ క్లిట్ష్కో చెప్పారు. నివాసిత ప్రాంతాలలో దాడులు జరిగినట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. శనివారం ఉదయం కూడా భారీ పేలుడు శబ్దాలు కీవ్ నగరాన్ని కుదిపేశాయి. ఉక్రేన్‌పై 2022లో రష్యా పూర్తిస్థాయీ దండయాత్ర ప్రారంభించిన తర్వాత కొనసాగుతున్న యుద్ధంలో వరుసగా నాలుగో ఏడాది చలికాలంవేళ పైచేయి సాధించేందుకు ఉక్రేన్ ఇంధనరంగ వ్యవస్థలపైనే రష్యా ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ఇంధన వ్యవస్థలు దెబ్బతినడంతో కీవ్ రీజియన్‌లో 6,00,000 ప్రజలు విద్యుత్ లేకుండా అంధకారంలో ఉండిపోయారు. ఒక్క కీవ్ నగరంలోనే 5,00,000 మంది ప్రజలకు విద్యుత్ సరఫరా లేదని ఉక్రేన్ ఇంధన మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ దాడులకు ఆసరాగా ఉండే మిలిటరీ, ఇండస్ట్రీ భవన సముదాయాలపై క్షిపణులు దాడులు చేసినట్లు మంత్రిత్వశాఖ తెలిపింది. 558 డ్రోన్లు, 19 క్షిపణులను కూల్చివేసినట్లు ఉక్రేన్ వైమానికదళం తెలిపింది.



# శాంతి చర్చలవేళ అవినీతి ఆరోపణలు

### జెలెన్‌స్కీ విశ్వాసపాత్రుడు యెర్మాక్ రాజీనామా



**కీవ్:** జెలెన్‌స్కీ విశ్వాసపాత్రుడు, రష్యాతో శాంతి చర్చల్లో ఉక్రేన్‌కు నాయకత్వం వహిస్తున్న తిరులేని నాయకుడు ఆండ్రీ యెర్మాక్ అవినీతి ఆరోపణల కేసులో తన పదవికి రాజీనామా చేశారు. జెలెన్‌స్కీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ హోదాలో, ఉక్రేన్ రాజకీయాల్లో బయటకు కనిపించని తిరుగులేని అధికారాలు చెలాయించే యెర్మాక్ ఇంటినీ, కార్యాలయాన్ని అవినీతి నిరోధక అధికారులు శుక్రవారం ఉదయం సోదాలు చేయడంతో ఆకస్మికంగా ఆయన రాజకీయ జీవితం ముగిసింది. ఇంధన రంగంలో ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి 100 మిలియన్ డాలర్ల అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై జెలెన్‌స్కీ మంత్రివర్గంలో ఇద్దరు మంత్రులు ఇప్పటికే రాజీనామాలు చేశారు. మరో విశ్వాపాత్రుడు కూడా రాజీనామా చేయాల్సి రావడంతో అంతర్గత రాజకీయ పరిణామాల్లో మార్పులు సంభవిస్తున్నాయి. గతవారం జెనీవాలో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతో కలిసి యెర్మాక్ ఉక్రేన్ తరపున ప్రాతినిధ్యం వహించారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందం రష్యాకే అనుకూలంగా ఉందని వాదించి ఉక్రేన్‌కు అనుకూలంగా కొన్ని రాయతీలు సంపాదించేందుకు ఆయన కృషి చేశారు. సోదాల తర్వాత యెర్మాక్ రాజీనామా చేసినట్లు జెలెన్‌స్కీ ప్రకటించారు. రష్యాతో శాంతి చర్చలకు రెండు రోజులక్రితమే యెర్మాక్‌ను బాధ్యుడుగా నియమించారు. అంతలోనే అవినీతి ఆరోపణలతో ఆయన రాజీనామా చేశారు. అనేక సంవత్సరాలుగా దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఆయన విశ్వాసపాత్రుడుగా ఉన్నారు. ఎన్నిక కాని రాజకీయనేతగా అధికార ప్రాబల్యం చెలాయిస్తున్న యెర్మాక్‌పై ప్రజల్లో ఆగ్రహం కూడా పెరుగుతోంది. ఇన్ని సంవత్సరాల సాహచర్యంలో యెర్మాక్ ఏనాడూ జెలెన్‌స్కీకి ఎక్కువ సమయం దూరంగా ఉండలేదు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లాయర్‌గా, టివి ప్రొడ్యూసర్‌గా యెర్మాక్ ఉన్న సమయంలో 2011లో మొదటిసారి జెలెన్‌స్కీతో ఆయనకు మైత్రి ఏర్పడింది. 2019లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో విజయవంతంగా ప్రచారం జరగడం, జెలెన్‌స్కీ గెలుపు తర్వాత యెర్మాక్ ఆయనకు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమితులయ్యారు. జెలెన్‌స్కీ అధికారంపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించిన సమయంలో యెర్మాక్ ఆయన తర్వాత దేశంలో శక్తిమంతమైన రెండో అతి పెద్ద నాయకుడుగా చలమాణీ అయ్యారు. విదేశీ విధాన రూపకల్పనలో, శత్రువులను దరంగా ఉంచడంతో, చివరకు యుద్ధవ్యూహాలు నిర్దేశించడంలో కూడా యెర్మాక్ కీలకపాత్ర వహించాడని బిబిసి పేర్కొంది. నాలుగు సంవత్సరాలుగా రష్యాతో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఇష్టంలేని శాంతి ఒప్పందంపై సంతకాలు చేయాలని అమెరికా నుండి తీవ్ర ఒత్తిడి వస్తున్న తరుణంలో అనూహ్యంగా జెలెన్‌స్కీ విశ్వాసపాత్రుడి నివాసంలో అవినీతి అధికారులు సోదాలు చేయడం కలకలం రేపింది. రాజధాని కీవ్‌లో దేశాధ్యక్షుడి ప్రాంగణం సమీపంలోనే యెర్మాక్ నివాసం కూడా ఉంది.

### తృతీయ ప్రపంచ దేశాల నుండి

## అమెరికాకు వలసల నిషేధం

### ప్రస్తుతం ఉన్నవారిపై గరిష్ఠస్థాయీ తనిఖీ

**వాషింగ్టన్:** వైట్‌హౌస్ సమీపంలో గడచిన బుధవారం మహిళా నేషనల్‌గార్డ్ సారా బెక్‌స్ట్రోమ్(20) కాల్పుల్లో మరణించిన తర్వాత వలస ప్రజలు అమెరికాలోకి ప్రవేశించేందుకు ఉన్న చట్టపరమైన,విధానపరమైన అన్ని మార్గాలనూ ట్రంప్ మూసివేశారు. అమెరికాలో ఆశ్రయం పొందడానికి ఉన్న అన్ని అనుమతులనూ రద్దుచేశారు. ముఖ్యంగా తృతీయ ప్రపంచ దేశాల నుండి వలసలు రాకుండా చాలా కఠిన పద్ధతుల్లో తాత్కాలిక నిషేధాలు అమలు చేయాలని ఆదేశించారు. దీంతో అమెరికా హోంలాండ్ సెక్యూరిటీ బ్రాంచ్ ‘యుఎస్‌సిఐఎస్’ (పౌరసత్వ, వలస అనుమతుల నియంత్రణ) జోసఫ్ ఎడ్లీ శనివారం ఒక ప్రకటన చేస్తూ, దేశంలో ఉన్న విదేశీయులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి నిర్ధారణ చేసుకునేంతవరకూ ఈ నిషేధ విరామం కొనసాగుతుందన్నారు. వలసలకు సంబంధించిన దరఖాస్తులను సమ్మతించడం లేదా తిరస్కరించడం లేదా నిలిపివేయడం లాంటి ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఐతే తొలుత ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులలో వలసల నిషేధానికి ప్రత్యేకించి ఏ దేశం పేరూ ప్రస్తావించలేదు. ప్రధానంగా ఆఫ్గానిస్థాన్‌పైనే ఆయన గురిపెట్టారు. ట్రంప్ ఉత్తర్వులపై ఐక్యరాజ్యసమితి స్పందిస్తూ, అమెరికా ఆశ్రయం కోరివచ్చే శరణార్థులకు తలుపులు తెరచే ఉంచాలని, ఒక న్యాయబద్ధమైన శరణార్థ నియంత్రణ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈనెల 26న జరిగిన కాల్పుల్లో నేషనల్‌గార్డ్స్‌కు చెందిన మరో మహిళ ఆండ్రూ ఊల్ఫ్ (24) ఆసుపత్రిలో చావుబ్రతుకులమధ్య ఉన్నారు. పరిస్థితుల్లో ట్రంప్ శరవేగంగా స్పందించి వలసల ప్రవేశాలపై నిషేధ ఉత్తర్వులు ప్రకటించారు. తనకుముందు దేశాధ్యక్షుడు జో బైడెన్ జారీ చేసిన వలస విధాన ఉత్తర్వులు (ఆటోపెన్) అన్నీ ఇకమీదట చెల్లబోవని శుక్రవారంనాడు ట్రంప్ ప్రకటించారు. బైడెన్ వలస విధానాలకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులను ఆయన స్వయంగా చదివి అర్థం చేసుకుని వాటిపై సంతకం చేయలేదని, ఆటోపెన్ (రబ్బరుస్టాంప్ సంతకం) ద్వారా ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయనీ, అందువల్ల ఈ ఉత్తర్వులు చెల్లుబాటు కాబోవని ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ ఉత్తర్వుల నేపథ్యంలో బయట నుండి వలస వచ్చిన ప్రతి వ్యక్తినీ క్షుణ్ణంగా గరష్ఠస్థాయిలో తనిఖీ చేసేవరకూ ఈ నిషేధం అమలులో ఉంటుందని జోసఫ్ ఎడ్లీ ప్రకటించారు.

### రాబోయే 15 రోజుల్లో

## బంగ్లాదేశ్ ఎన్నికల షెడ్యూల్ విడుదల



**ఢాకా:** రాబోయే 15 రోజుల్లో బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటిస్తారు. నిర్ణీత ప్రకారం 2026 ఫిబ్రవరిలో ఆ దేశంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తామని తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు మహ్మద్ యూనస్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ఎఎంఎం నసీజ్ ఉద్దీన్ శనివారం ఒక ప్రకటన చేస్తూ, డిసెంబరు రెండోవారంలో సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడుతుందన్నారు. ఢాకాలోని షేర్ ఎ బంగ్లా నగర్ ప్రభుత్వ బాలికల స్కూలులో నిర్వహించిన నమూనా ఓటింగ్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆదర్శవంతమైన ఎన్నికల ప్రక్రియను సజావుగా, సక్రమంగా నిర్వహిచడంకోసమే ఈ నమూనా ఓటింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఫిబ్రవరినెలకు ముందుగానే దేశంలో రిఫరెండం జరుగుతుందని వివరణ ఇచ్చారు. గత ఏడాది ప్రధాన ఎన్నికల అధికారిగా బాధ్యతలు తీసుకున్న నసీర్ ఉద్దీన్‌కు ఒక్కసారి కూడా చిన్నపాటి పంచాయతీ ఎన్నికలను నిర్వహించిన అనుభవం కూడా లేదు. ఇప్పుడు ఏకంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన సార్వత్రిక ఎన్నికల బాధ్యతలకు నియమితులయ్యారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక తిరుగుబాటు,షేక్ హసీనా అజ్ఞాతవాసం, ఆమెకు మరణ శిక్ష విధించడం వంటి పరిణామాల నేపథ్యంలో యావత్ ప్రపంచం బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలవైపే చూస్తున్నది.

**చికిత్సకోసం లండన్‌కు ఖలీదాజియా?**

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి, బిఎన్‌పి అధ్యక్షురాలు ఖలీదాజియా (80) అనేక వ్యాధులతో బాధపడుతున్నారు. ఆమెను లండన్‌లోని ఆసుపత్రికి ప్రత్యేక విమానంలో తరలించేందుకు ఆమె కుమారుడు, కోడలు సన్నాహాలు చేస్తున్నారు. మెరుగైన చికిత్స చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పార్టీ తాత్కాలిక అధ్యక్షుడు తారిక్ రెహ్మాన్ సలహాదారుడు మెహ్ది అమిన్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. మోడ్రన్ మెడికల్ టెక్నాలజీతో కూడిన ఒక ప్రత్యేకమైన అంబులెన్స్ విమానంలో ఆమెను లండన్ తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే లండన్‌లో ఉన్న ఆసుపత్రి వర్గాలతో ఆమె కుమారుడు సంభాషణలు చేశారు. ప్రస్తుతం ఆమె తీవ్ర ఆస్మాతో స్థానిక ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

## దిగ్విజయంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

### వారంలోనే 43.32 లక్షలు పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వేగంగా సాగుతోంది. ఈ నెల 19 నుంచి 25 వరకు జరిగిన పంపిణీ డ్రైవ్‌లో కేవలం వారం రోజుల్లోనే 43,32,828 చీరలను మహిళలకు అందజేయడం విశేషం. సెర్ప్‌కు సంబంధించిన 46,22,098 మంది మహిళా సభ్యులలో 77.89శాతం మంది ఇప్పటికే చీరలు పొందగా, పంపిణీ ప్రక్రియను అధికారులు నిరంతరంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఎస్‌హెచ్‌జి సభ్యులు కాని మహిళలను కూడా వంచితులుగా మిగిలిపోకుండా, వెంటనే కొత్త సభ్యత్వం ఇచ్చి చీరలు అందజేయడం ప్రత్యేకతగా నిలిచింది. మొత్తం మీద రెండు లక్షల వరకు మహిళలకు కొత్త సభ్యత్వాలు ఇచ్చి, వారికి చీరలు అందజేశారు. స్థానిక ఎన్నికల నిబంధనల కారణంగా ఈ నెల 25 నుంచి చీరల పంపిణీని తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం గోదాముల్లో సుమారు 16 లక్షల చీరలు అందుబాటులో ఉన్నాయి. అలాగే సిరిసిల్ల నేతన్నలు నూతనంగా తయారు చేస్తున్న చీరలను తయారీ పూర్తయ్యాన వెంటనే జిల్లా కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే చీరల పంపిణీ మళ్లీ ప్రారంభం కానుంది.

## 3వేల డ్రోన్లు (మొదటి పేజీ తరువాయి)

‘హ్యాపీ న్యూ ఇయర్’ అనే వాక్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డును అందుకుంది. అంతకు మించిన సంఖ్యలో డ్రోన్లను ఉపయోగించి గ్లోబల్ సమ్మిట్ ముగింపు వేడుకలలో అద్భుతమైన డ్రోన్ షో నిర్వహించనుంది. డ్రోన్ షోతో తెలంగాణ రైజింగ్ నినాదాన్ని గగనతలంలో ప్రదర్శించి ప్రపంచ రికార్డు అధిగమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ అధికార వర్గాలు తెలియజేశాయి.

## ముగిసిన నామినేషన్లు (మొదటి పేజీ తరువాయి)

ముగుస్తుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను అధికారులు వెల్లడించనున్నారు. డిసెంబర్ 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచి ఎన్నిక ఉంటుందని అధికారులు వివరించారు. ఇదిలా ఉంటే ఆదివారం నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు రెండవ తేదీ వరకు రెండవ దశ ఎన్నికల నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. రెండవ దశలో 193 మండలాల్లో 4,333 పంచాయతీలు, 38,350 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది.

## నిలిపేయండి (మొదటి పేజీ తరువాయి)

మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు యం.డి.యూసుఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 29 చట్టాల స్థానంలో 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి, నవంబర్ 21వ తేదీ నుండి అమలు చేస్తున్నామని ప్రకటించడం దారుణమన్నారు. 4 కోడ్‌లను 2019, 2020 సంవత్సరంలోనే తెచ్చినప్పటికీ దేశంలో నిర్వహిస్తున్న కార్మిక పోరాటాలకు భయపడి అమలు చేయకుండా ఆపటం జరిగిందన్నారు. బిహార్ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో గెలిచామని, ప్రజలు తమ విధానాలకు మద్దతు ఇస్తున్నారని మోదీ ప్రభుత్వం భ్రమపడుతున్నారని ఎద్దేవా చేశారు. నూతన కోడ్‌ల వల్ల కార్మికవర్గానికి నియామక పత్రాలు ఇస్తారని, అందరికి వేతనాలు పెరుగుతాయని, జాతీయ కనీస వేతనం నిర్ణయం జరుగుతుందని, 40 సంవత్సరాలు దాటిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, గిగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామని, ఓవర్ టైం వేతనానికి రెట్టింపు చెల్లిస్తామని, అలాగే మహిళలకు రాత్రి పూట డ్యూటీ చేసుకునే అవకాశం కల్పించామని, కాలపరిమితితో కూడుకున్న ఉద్యోగాలు చేసుకునే విధంగా, కాలపరిమితి ఉద్యోగాలు చేసే వారికి సంవత్సరం పూర్తి అయితే గ్రాట్యుటీ చెల్లిస్తామని కోడ్‌లలో ఉన్నట్లు మీడియా ద్వారా కేంద్ర ప్రభుత్వం బాగా ప్రచారం చేయిస్తుందని దుయ్యబట్టారు. కార్పొరేట్‌ల చేతిలో ఉన్న మీడియా మరింత ఉత్సాహంగా కార్మికులకు నష్టం జరిగే అంశాలను చెప్పకుండా యాజమాన్యాలకు అనుకూలంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్పందించిన కార్మిఖ శాఖమంత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో, కార్మిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేయించి ఈ సమస్యపై నిర్ణయం తీసుకుందామని హామీ ఇచ్చారని తెలిపారు.

## సోలార్ రేడియేషన్ దెబ్బ (మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఎయిర్‌బస్ ప్రకటించడంతో భారత విమాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలంటే కొన్ని గంటల సమయం పడుతుంది గనుక విమానాల రాకపోకలకు 60 నుండి 90నిమిషాలసేపు అంతరాయం కలగవచ్చునని డిజిసిఎ (డైరెక్టొరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఎవియేషన్) గణాంకాలు వెల్లడించాయి. మొత్తం 338 ఎ 320 రకం విమానాలు దేశంలో ఉన్నాయి. వీటిల్లో శనివారం ఉదయం 10 సమయం నాటికి 189 విమానాలకు అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయినట్లు గణాంకాలు వెల్లడించాయి. కాగా ఇండిగో సంస్థకు చెందిన 200 విమానాలు ఈ సాఫ్ట్‌వేర్ సాకేంతిక సమస్య ఎదుర్కొంటుండగా, 143 విమానాలలో సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడేషన్ పూర్తయింది. ఎయిర్ ఇండియాకు సంబంధించి 113 ఎయిర్‌క్రాఫ్ట్‌లపై ప్రభావం పడింది. వీటిల్లో ఇప్పటి వరకూ 42 విమానాల సాంకేతికతను అప్‌గ్రేడేషన్ చేశారు.

ఇక ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థకు చెందిన 25 విమానాలపై సోలార్ రేడియేషన్ ప్రభావం పడే అవకాశం ఉన్నందువల్ల వాటిల్లో కూడా మార్పులు చేస్తున్నారు. శనివారం ఉదయం పది గంటల సమయానికి వీటిల్లో నాలుగు విమానాల అప్‌గ్రేడేషన్ కార్యక్రమం పూర్తయింది.

**ప్రపంచవ్యాప్తంగా ఆరువేల విమానాల సాఫ్ట్‌వేర్ మార్పు**

కొన్ని గంటలపాటు జాప్యం, ఆటంకాల తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఎయిర్ బస్ విమానాల రాకపోకల్లో శనివారం తిరిగి సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. సూర్యుడి నుండి వచ్చే సోలార్ కిరాణాల ప్రభావం కారణంగా ఎయిర్ బస్‌లలో సాంకేతిక పరికరాలు తీవ్రంగా ప్రభావితమై విమానాలు దారి తప్పే ప్రమాదం ఉన్నందువల్ల వీటి రాకపోకలను నిలిపివేశారు. వీటిల్లో ఎక్కువగా యూరోపియన్ దేశాలకు చెందిన ఎయిర్ బస్‌లే ఉన్నాయి. దీనివల్ల విమానాల జాప్యం, అంతరాయం కలుగుతుందని బ్రిటన్‌కు చెందిన ఎవియేషన్ రెగ్యులేటర్ తొలుత ప్రకటించింది. మొత్తంగా చూసినప్పుడు విమానాశ్రయాలపై దీని ప్రభావం చాలా తక్కువగానే ఉంది. ఈ అప్‌గ్రేడేషన్ ప్రక్రియకు కేవలం మూడు గంటలు సమయం పట్టింది. సోలార్ రేడియేషన్ కారణంగా ఎయిర్ బస్‌లకు ఉంటే కంట్రోల్ కంప్యూటర్లు తీవ్ర ప్రభావానికి గురవుతాయి. అందువల్ల వాటిని అప్‌గ్రేడ్ చేశారు.

అక్టోబరు నెలాఖరును మెక్సికో–అమెరికా మధ్య ప్రయాణిస్తున్న ఎయిర్ బస్ ఎ 320 విమానం ఆకస్మికంగా వేగం తగ్గిపోయి కిందికి దిగిపోవడం ప్రారంభించింది.

దీంతో పైలట్లు అప్రమత్తమైన సమీపంలో ఉన్న సురక్షిత ప్రదేశంలో విమానాన్ని దించేశారు. ఆనాడే ఎయిర్ బస్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సోలార్ రేడియేషన్ ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. ఇక ముందు జాగ్రత్త చర్యగా ఎయిర్‌బస్‌కు చెందిన అన్ని విమానాలనూ సాంకేతికంగా అప్‌గ్రేడ్ చేశా రు.

## త్వరలో పూర్తి (మొదటి పేజీ తరువాయి)

జరుగుతుందన్నారు. గూడ్స్ రైళ్లే రైల్వేశాఖకు ప్రధాన ఆదాయం అని అన్నారు. ఏకకాలంలో 40 రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయడం చరిత్ర అని అన్నారు. ఈ నిర్మాణం దేశ రైల్వే నెట్వర్క్ అభివృద్ధి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణలో 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ జరిగిందన్నారు. రైల్వే ద్వారా ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాయన్నారు. తెలంగాణలో రైల్వే రూపు రేఖలు మారబోతున్నాయన్నారు.

దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు పూర్తి చేస్తున్నామన్నారు. తొలుత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వరంగల్ నగరంలోని ప్రఖ్యాత భద్రకాళి అమ్మవారిని, వేయిస్తంభాల గుడి రుద్రేశ్వర స్వామిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జోగులాంబ ఆలయంను పునరుద్ధరిస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీమ్‌లో భద్రాచలం రాముల వారి ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చిన, పర్యవేక్షించి పనులు చేపట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. రామప్ప ఆలయంను కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

**అధికారులపై కేంద్ర మంత్రి ఆగ్రహం**

వేయిస్తంభాల గుడిని సందర్శించిన సందర్భంగా గుడి పునరుద్ధరణ పనులను పరిశీలించిన అనంతరం ఆర్కియాలజీ అధికారుల పై మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణ మండపం పనుల నిర్లక్ష్యం పై అధికారులను మంత్రి నిలదీశారు. ఆరు నెలల కాలం నుండి ఏం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా పనులు జరగకపోవడం పై మొట్టికాయలు వేశారు. సిబ్బంది పనితీరును ప్రశ్నించి వివరాలు ఇవ్వాలని కోరారు.

**భూ నిర్వాసితులతో మాట్లాడిన కేంద్రమంత్రి..**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని అయోధ్య పురం రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ భూ నిర్వాసితులు కలిశారు. కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రిని భూ నిర్వాసితులు కోరా రు. కొంతమంది భూ నిర్వాసితులకు పరిహారం రాలేదనే విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రైతులు తీసుకవచ్చారు. పరిహారాన్ని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ కేంద్ర మంత్రి వారికి హామీ ఇచ్చారు. భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలపై రైల్వే అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## విభేదాలు లేవ్

(మొదటి పేజీ తరువాయి)

నొక్కి చెప్పారు. తాము అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొంటామని, బిజెపి, జెడి(ఎస్)లను ఎలా ఎదుర్కోవాలో వ్యూహాన్ని రూపొందించామన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని వారు చెబుతున్నారరని, వాయిదా తీర్మానం తీసుకువస్తే దానిని పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి అధికారంలోకి తీసుకువచ్చారని శివకుమార్ అన్నారు. అందువల్ల వారి అంచనాలకు అనుగుణంగా కాంగ్రెస్ ఉండాలన్నారు. సిఎంతో విభేదాలను తోసిపుచ్చుతూ తమ మధ్య వర్గ విభేదాలు లేవన్నారు. తాము కలిసి వెళ్తూ, అందరినీ కలుపుకుని ముందుకెళ్తామన్నారు. పార్టీ హైకమాండ్‌కు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. 2028 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కోవడానికి వ్యూహాన్ని చర్చించానని, బెళగావిలో జరగనున్న కర్ణాటక శాసనసభ శీతాకాల సమావేశాల్లో బిజెపి అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తే వాటిని ఎలా ఎదుర్కోవాలో చర్చించానని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ అన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ నాయకత్వంలో పోటీ చేస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు. ‘దేశంలో పార్టీ చాలా క్లిష్ట దశలో ఉంది. కర్ణాటక పునరుద్ధరణలో (దాని పునరుద్ధరణలో) ప్రధాన పాత్ర పోషిస్తుందనే నమ్మకం మాకు ఇంకా ఉంది. 2028లో (2023 ఎన్నికల విజయం) మేము పునరావృతం చేస్తాము’ అని ఆయన అన్నారు. కాగా, అల్పాహార సమావేశం తర్వాత సోషల్ మీడియా పోస్ట్‌లో, ఇద్దరు నాయకులు ఉత్పాదక చర్చ జరిపినట్లు శివకుమార్ అన్నారు. ఐదేళ్ల పాటు పూర్తి కాలం ముఖ్యమంత్రిగా కొనసాగడానికి తనకు ఆదేశం లభించిందని సిద్ధరామయ్య చెబుతుండగా, రెండున్నర సంవత్సరాల తర్వాత రొటేషన్ ప్రాతిపదికన తనను ముఖ్యమంత్రిగా నియమిస్తామని తనకు హామీ ఇచ్చారని శివకుమార్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న నవంబర్ 20 తర్వాత నాయకత్వ మార్పు అంశం తీవ్రమైంది. శుక్రవారం కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకుని ఇద్దరు నాయకులను ఒకరితో ఒకరు మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని కోరింది. దీని ప్రకారం, సిద్ధరామయ్య తన డిప్యూటీని అల్పాహార సమావేశానికి ఇంటికి రమ్మని ఆహ్వానించారు. అల్పాహారం సమయంలో ఆసక్తిగా వీక్షించిన సమావేశంలో ఇడ్లీ, వడ, సాంబార్, చట్నీ, ఉప్పిట్టు (ఉప్మా) మెనూలో ఉన్నాయని సిఎంఒ వర్గాలు తెలిపాయి.

## ‘పవర్‌ఫుల్’గా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

దేశాలతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించేందుకు బలమైన పునాదులు వేస్తున్నట్లు చెప్పారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకు వెళుతున్న దశలో అందుకు అనుగుణంగా విద్యుత్తు ప్రణాళికలను తయారు చేశామన్నారు. ఉత్పత్తి రంగాలు పెద్ద ఎత్తున అభివృద్ధి చెందితేనే వాటి ద్వారా ఉత్పత్తి భారీ స్థాయిలో పెరిగి రాష్ట్ర జిఎస్‌డిపికి ఉపయోగపడతాయని, తద్వారా రాష్ట్ర ఎకానమీ ఆశించిన స్థాయిలో పెరుగుతుందన్నారు. ఉత్పత్తి రంగాలైన తయారీ, వ్యవసాయ, సేవల రంగాలకు అవసరమైన నాణ్యమైన విద్యుత్ ను అందించడమే ప్రధానాంశంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా తెలంగాణ అభివృద్ధి చెందాలని ఆశిస్తున్నామని, వివిధ దేశాలలో తలసరి విద్యుత్ వినియోగానికి అనుగుణంగా తెలంగాణలో కూడా తలసరి విద్యుత్ వినియోగం పెంచే విధంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు.

భారతదేశంలో అత్యధిక విద్యుత్ డిమాండ్ పెరుగుదల గల రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి గత దశాబ్దంలో సగటు వార్షిక వృద్ధిరేటు (సిఎజిఆర్) సుమారు 9.77 శాతమని, తదుపరి దశాబ్దంలో పీక్ డిమాండ్ రెండింతలు అవుతుందని అంచనా వేసినట్లు డిప్యూటీ సిఎం చెప్పారు. తెలంగాణలో గ్రిడ్ కుప్పకూలితే రోజుకు రూ.1,5002,000 కోట్ల నష్టం వాటిల్లుతుందని, ఆస్పత్రులు, రక్షణ, రవాణా, టెలికామ్, డేటా సెంటర్లు అన్నీ తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా, అలాగే గ్రిడ్ నమ్మకాన్ని రక్షించడానికి 5,0006,000 MW థర్మల్ సామర్థ్యాన్ని రాష్ట్రం తప్పనిసరిగా పెంచాలని, అందుకే రామగుండం థర్మల్ ప్రతిపాదన వ్యూహాత్మకంగా చాలా కీలకమన్నారు.

‘‘తెలంగాణ రాష్ట్రం 2014లో విద్యుత్ డిమాండ్ 6,755 మెగావాట్లు ఉండేది. 2025 నాటికి 17,162 మెగావాట్లకు పెరిగింది. 202526 నాటికి 18,825 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉంది. అదే 2035 నాటికి 48,827 మెగావాట్లకు పెరుగుతుందనే అంచనాలున్నాయి. 2025 నుంచి ప్రతి ఏటా 8.50 శాతం పెరుగుదలతో 2047 నాటికి ప్రతి ఏటా 10 శాతం మేర గ్రోత్ రేట్ ఉండవచ్చనే అంచనాలు ఉన్నాయి. భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ అవసరాలు ఈ విధంగా ఉండగా, ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 20,754 మెగావాట్లుగా ఉంది. 2047 లక్ష్యానికి చేరుకునేందుకు విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలి. విద్యుత్ వినియోగంలో 2030 నాటికి 50 శాతం గ్రీన్ ఎనర్జీనే ఉండాలని పారిస్ ఒప్పందం చెబుతోంది. 2070 నాటికి పూర్తిగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించాలనే అందులో స్పష్టంగా ఉంది. గత పదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యుత్తు పాలసీ తీసుకురాలేకపోవడం వల్ల సోలార్, థర్మల్, విండ్, పంప్డ్ స్టోరేజీలలో రాష్ట్రం వెనుకబడి ఉంది’’ అని డిప్యూటీ సిఎం వివరించారు. సిఈఎ ప్రకారం 202930 నాటికి రాష్ట్రం మైనస్ 243 మిలియన్ యూనిట్లకు వెళుతుందని చెప్పారు.

202930 నాటికి విద్యుత్ స్టోరేజీ 7366 మెగావాట్లు అవసరమని, సోలార్ పవర్ కొనుగోలు చేయాలంటే 25 ఏళ్ల అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందని, ఇప్పటికైనా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని చెప్పారు. విద్యుత్‌ను బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్రంలో 12 ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజ్ పాయింట్లకు అవకాశం ఉందని, పంప్డ్ స్టోరేజ్‌కు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రమని, రాష్ట్రానికి కావాల్సిన వాటర్, ఎనర్జీ పుష్కలంగా ఉన్నాయని, ప్రపంచంతో పోటీపడే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తున్నదన్నారు. యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ సమీపంలో బొగ్గు గనులు లేనందు వల్ల వందల కిలోమీటర్ల నుంచి బొగ్గు తీసుకురావాల్సి వస్తోందని, ఈ కారణం వల్ల విద్యుత్ ఉత్పత్తిపై భారం పడుతోందని డిప్యూటీ సిఎం చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బొగ్గు గనుల వద్దనే థర్మల్ ప్రాజెక్టును నిర్మించాలని ఆలోచిస్తుందని, ఎన్‌టిపిసి లేదా జెన్‌కో ఎవరు తక్కువ ధరకు నిర్మిస్తే వారికే ఇస్తామని ఆయన చెప్పారు. విండ్ ఎనర్జీని కూడా దశలవారీగా విస్తరిస్తామని, 120 మీటర్ల హబ్ హైట్ వద్ద తెలంగాణకు సుమారు 25 గిగావాట్ల విండ్ పొటెన్షియల్ ఉందని, దీనిని భవిష్యత్తు ఎనర్జీ మిక్స్‌లో పూర్తిగా వినియోగించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బిసి స్టడీ సర్కిల్స్ ద్వారా ఐఇఎల్‌టిఎస్ శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని బిసి, ఇతర విద్యార్థులకు విదేశాలలో వున్న అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలతో పాటు అంతర్జాతీయ స్కాలర్‌షిప్ పొందడం లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, శిక్షణా కార్యక్రమాలను తెలంగాణ బిసి స్టడీ సర్కిల్ ప్రారంభించడం జరుగుతుందని బిసి స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 12 బిసి స్టడీ సర్కిల్స్ నందు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు (ఐఇఎల్‌టిఎస్) శిక్షణ తరగతులు ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు. ఆసక్తి వున్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు డిసెంబర్ 1వ తేదీ నుండి డిసెంబర్ 21 తేదీ వరకు టిజిబిసిస్టడీ సర్కిల్ వెబ్‌సైట్ www.tgbcstudycircl e.cgg.go v.in ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, సమాచారం కోసం ఫోన్ 040 24071178 ద్వారా తెలుసుకోవచ్చని డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## ఎన్నికలు వాయిదా వేయాలి


### 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే : ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు వాయిదా వేసి, 42శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో మొండి వైఖరితో ముందు కెళ్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి డా.బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు వేలాది మంది బిసిలు, మేధావులు, బిసి సంఘాల ప్రతినిధులు తిరుగుబాటు ప్రదర్శన నిర్వహించారు. బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వ వైఖరిని నిరసించారు. ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడు తూ డెడికేటెడ్ కమిషన్ నివేదికలలో ప్రామాణిక పద్ధతులు పా టించలేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని బిసి కమిషన్ త ప్పుపట్టినప్పటికీ ప్రభుత్వం ఎన్నికలకెళ్లడం నియంతృత్వ, ఫ్యూడల్ భావజాలానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభు త్వం బిసిల ఆత్మగౌరవానికి, మనోభవావాలకు భంగం కలిగి స్తూ ప్రజావ్యతిరేక విధానాలను పాల్పడుతున్నదని మండిపడ్డారు. ఇదే విధానాలను కొనసాగిస్తే, శ్రీలంక, నేపాల బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ఏం జరిగిందో రేవంత్ ప్రభుత్వం గమనం లో ఉంచుకోవాలన్నారు. బిసి కమిషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామని గొప్పలు చెప్పుకొనే రాష్ట్ర ప్రభుత్వం మెజారి టీ బిసి వర్గాల ప్రయోజనాలను కాలరాయడమేమిటని ప్ర శ్నించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కో–ఆర్డినేటర్ డా. ర్యాగ రుషి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తిని అపహాస్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బిసి సంఘం నేతలు కొండా దేవయ్య, ఆనంద్‌గౌడ్, జిల్లపల్లి అంజి, మోదీ రాందేవ్, సి.రాజేందర్, అనంతయ్య, భీంరాజ్, లింగయ్య యాదవ్, రాజు నేత, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, సర్పంచ్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## 'వలపు వల'లో డాక్టర్..

### రూ.14 కోట్లు టోకరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ క్రిమినల్స్ విసిరిన వలపుల వలలో హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్ చిక్కుకున్నాడు. ఏకంగా రూ.14 కోట్లు పోగోట్టుకున్న వైనం కూకట్‌పల్లిలో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఎర్రగడ్డకు చెందిన డాక్టర్‌కు ఫేస్‌బుక్‌లో మహిళ పేరుతో నుండి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఫ్రెండ్ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేసిన అనంతరం తాను 'వీడో' అని పరిచయం చేసుకుని మాటలు కలిపింది. తాను పనిచేస్తున్న సిఎన్‌సి కంపెనీలో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని డాక్టర్‌ను నమ్మించింది. దీంతో డాక్టర్ ఆమె మాటలు నమ్మి సెప్టెంబర్ నుండి పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. ఒక్కసారి వచ్చిన లాభాల్లో 86000 విత్‌డ్రా చేసుకున్నాడు. దీంతో నమ్మకం కుదరడంతో విడతలవారీగా తనకున్న ఆస్తులను కుదువ పెట్టి ఏకంగా రూ.14 కోట్లు పెట్టుబడులు పెట్టాడు. డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా పెద్ద మొత్తంలో పన్నులు కట్టాలని సైబర్ నేరస్తులు అడిగారు. దీంతో మోసపోయానని గ్రహించిన డాక్టర్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశాడు. రూ.కోట్లను సైబర్ నేరగాళ్లు వివిధ మ్యూల్ అకౌంట్లోకి మళ్ళించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు దర్యాప్తు చేయగా కేవలం రూ.కోటి 20 లక్షల రూపాయలను మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లో సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని టిజిసిఎస్‌బి చీఫ్ శిఖాగోయల్ తెలిపారు. ఇలాంటి ఫ్రాడ్స్ అన్ని చైనా నుండి ఆపరేటింగ్ చేస్తుంటారని, చైనాలో ఉద్యోగాలు ఇస్తామని పిలిపించి ఇండియన్స్ తోనే ఇలాంటి ఫ్రాడ్ చేస్తున్నారన్నారు. అత్యాశ వల్ల చాలామంది మోసపోతున్నారు.. సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ తెలాపారు.

## పోరాటాలతోనే హక్కులు సాధ్యం


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/ వేములవాడ :** వేములవాడ పట్టణంలోని బింగి మహేష్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎఐటియుసి జాతీయ కౌన్సిల్ సమావేశాలకు శనివారం ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ, అడిగితే హక్కులు రావని, పోరాటం చేస్తేనే హక్కుల సాధించవచ్చని అది ఎఐటియుసితోనే సాధ్యమవుతుందన్నారు. బీడీ కార్మికులకు దేశవ్యాప్తంగా ఒకే వేతనం చెల్లించాలని, కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలని, బీడీ కార్మికులకు నెలలో 26 రోజుల పని కల్పించాలని, బీడీ పరిశ్రమపై రకరకాల అంశాలను తొలగించి జిఎస్‌టి పన్నులు తగ్గించాలన్నిరు. బీడీ కార్మికుల కూలీ డబ్బులను బ్యాంకు ఖాతా ద్వారా కాకుండా గతంలో మాదిరిగా కంపెనీ ద్వారా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2014లోని కటప్ తేదీ ఎత్తివేసి 2016 జీవనభృతిని రూ.4వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బీడి ఫెడరేషన్ అధ్యక్షులు కార్బెరి ఉరుగ్వే, ఆల్ ఇండియా బీడీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథం, ఎఐటిసి ఆల్ ఇండియా బీడీ ఇన్‌చార్జి వాయిదా నిజాం, గౌరవ అధ్యక్షులు ఎండి మౌలానా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి యూసుఫ్, రాష్ట్ర ఇంచార్జ్ విశాల్, కోశాధికారి ఎం.డి ముక్రం, రాష్ట్ర నాయకులు కడారి రాములు, జిల్లా ఇన్‌చార్జ్ టేకుల సమ్మయ్య, మంద సుదర్శన్, కేవీ ఆర్ సూర్య, అధ్య వేణు, బీడీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

### పిసిసి చీఫ్ మహేష్‌కు మార్‌గౌడ్‌కు పత్రాలు అందజేసిన కంటోన్మెంట్ ఎంఎల్‌ఎ శ్రీగణేష్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తూ బిజెపి ఎలక్షన్ కమిషన్‌తో కుమ్మక్కై ఓట్ చోరీకి పాల్పడడాన్ని వ్యతిరేకిస్తున్నామని కంటోన్మెంట్ ఎంఎల్‌ఎ శ్రీగణేష్ అన్నారు. ఎఐసిసి, టిపిసిసి ఇచ్చిన ఆదేశాల మేరకు కంటోన్మెంట్ నియోజకవర్గంలో గడప గడపకు తిరిగి 30 వేల పైచిలుకు సంతకాలను సేకరించామని, సంబంధిత పత్రాలను శనివారం గాంధీ భవన్‌లో టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బొమ్మ మహేష్ కు మార్ గౌడ్‌కి అందజేయడం జరిగిందన్నారు. ఇం త భారీ స్థాయిలో సంతకాల సేకరణ చేసినందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులను మహేష్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.



## రాజ్యాంగ విలువలను నిలబెట్టడంలో మీదే కీలక పాత్ర

### ట్రైనీ ఐపిఎస్‌లకు సూచించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగ విలువను నిలబెట్టడంలో మీదే కీలక పాత్ర అని ఐపిఎస్ ప్రొబెషనర్లకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్‌తో పాటు శిక్షణ పొందుతున్న 77వ ఆర్ఆర్ బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ ప్రొబెషనర్లు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ వారిని అభినందించారు. అంకితభావం, న్యాయంగా విధులు నిర్వహించాలని వారికి గవర్నర్ సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. బాధితులకు అండగా ఉండే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు.

## ఐ బొమ్మ అంటే 'ఇంటర్నెట్ బొమ్మ'

### రవికి రెండో విడత కస్టడీ పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐ బొమ్మ రవికి రెండో విడతలో మూడవ రోజు కస్టడీ విచారణ శనివారంతో ముగిసింది. ఐ బొమ్మ రవిని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి నాంపల్లి కోర్టుకు పోలీసులు తరలించారు. ఐ బొమ్మ పేరును.. రవి ఇంటి పేరు ఇమ్మంది అని.. అందువల్ల ఐ బొమ్మ అని పెట్టాడని అంతా అనుకున్నారు. కానీ.. ఈ ప్రచారంలో నిజం లేదని తేలిపోయింది. ఐ బొమ్మ అంటే ఇమ్మంది బొమ్మ కాదు.. ఇంటర్నెట్ బొమ్మ అనే అర్థంతో పేరు పెట్టినట్లు విచారణలో రవి తేటతెల్లం చేశాడు. సినిమాను ఒక్కో ఏరియాలో ఒక్కోలా పిలుస్తారు. తెలంగాణలో సైన్మా అని.. ఆంధ్రాలో కొన్ని ఏరియాల్లో ఆట అని.. విశాఖ ఏరియాలో సినిమాను బొమ్మ అని పిలుస్తుంటారు. ఇమ్మంది రవి సొంతూరు విశాఖపట్నం. విశాఖ ప్రాంతంలో సినిమాను బొమ్మ అని అంటుంటారు. ఇంటర్నెట్‌లో చూపించే బొమ్మ అనే ఆలోచనతో ఐ బొమ్మ అని రవి తన పైరసీ వెబ్ సైట్‌కు పేరు పెట్టాడట. రెండో వెబ్ సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నాడు. డొమైన్‌లో టెక్నికల్ సమస్య వల్ల ఎల్ అక్షరం తీసుకోలేదు. దీంతో దాని బదులు ఇంకో పి అక్షరం పెట్టి బప్పం అని రిజిస్టర్ చే శాడు. ఇలా ఐ బొమ్మ, బప్పం (iBOMMA, BAPPAM TV) పేర్లు రవి పెట్టాడు. బషీర్‌బాగ్‌లోని సిసిఎస్ కార్యాలయంలో ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి కస్టడీ విచారణలో పలు కీలక సమాచారం వెల్లడించా డు. రవి నెట్‌వర్క్, ఆర్థిక లావాదేవీలు, ఐపి మాస్కింగ్ విధానాలపై వివరా లు సేకరించారు. విదేశీ సర్వర్ల వినియోగం, యాడ్‌బుల్ యాప్ నిర్వహణ గురించి ఆరా తీశారు. అనధికార వెబ్సైట్ల నిర్వహణ, పైరసీ వీడియోలు అప్ లోడ్ చేసే టీమ్లు, వారి పాత్రపై కూడా పోలీసులు కూపీ లాగినట్లు సమాచారం. ఈ మూడు రోజుల విచారణలో సైబర్ క్రైమ్ టీంకు పలు కీలక సమాచారం లభించినట్లు తెలిసింది.

## తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం లేదు

### రాయ్‌పూర్ సమావేశంలో డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో మావోయిస్టుల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని, ఇప్పటికే తమ వద్ద సీనియర్ మావోయిస్టు నేతలు, వారి అనుచరులు లొంగిపోయారని రాయ్‌పూర్‌లో కొనసాగుతున్న 60వ అఖిల భారత డిజిపి ఐజిపి వార్షిక సమావేశంలో డిజిపి శివధర్‌రెడ్డి వెల్లడించినట్లు తెలిసింది. ఈ నెల 28 నుంచి 30తేదీ వరకు రాయ్‌పూర్‌లో డిజిపిఐజిపిల వార్షిక సమావేశాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ సమావేశాలను మొదటి రోజు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రారంభించారు. ఈమావేశంలో తెలంగాణా పోలీసింగ్ విధానాల్లో సమగ్రమైన మార్పులు, ఎప్పటికప్పుడు నియామకాలు, ట్రైనింగ్‌లు, సైబర్, ఫోరెన్సిక్ టూల్స్ వినియోగం, అంతర్‌రాష్ట్రాల ఏజెన్సీల ఇంటెలిజెన్స్ షేరింగ్, ఉగ్రవాదం, నక్సలిజం తదితర పలు అంశాలపై తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి ఈ సమావేశాల్లో కూలంకుశంగా వివరించారు. ఇక కగార్ ఆపరేషన్ మార్చి 31తో పూర్తి కానుండడంతో రానున్న కాలంలో తీసుకోవాల్సిన పరిస్థితులు, చర్యలపై కూడా ఆయన వివరించినట్లు సమాచారం. దీంతో పాటు తెలంగాణలో లొంగిపోయిన ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులకు కేంద్ర పథకంలో భాగంగా వారికి ఉపాధికల్పన చర్యలు చేపట్టాలని ఆయా రాష్ట్రాల డిజిపిలకు సూచించారు. ఈ మేరకు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టుల జాబితాను వారికి అందించినట్లు తెలిసింది. వారిపై ఉన్న రివార్డులను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే లొంగిపోయిన కీలక మావోయిస్టు నేతలందరికి ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున డబ్బును అందజేశామని శివధర్‌రెడ్డి తెలిపారు.ఈ సమావేశాల్లో తెలంగాణ నుంచి సీనియర్ ఐపిఎస్ అధికారులు మహేష్ భగవత్, ఎం.రమేష్, సుమతి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచస్థాయికి వ్యవసాయం

### తెలంగాణ వ్యవసాయ – 2047 అగ్రిచాప్టర్ పునాది
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో విజన్ డాక్యుమెంట్ ద్వారా తెలంగాణ వ్యవసాయ – 2047 అగ్రిచాప్టర్ భవిష్యత్తు వ్యవసాయ రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేలా పునాది వేయనుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నేపథ్యంలో 2047 నాటికి తెలంగాణ వ్యవసాయం ఎలా ఉండాలి, దానికోసం ఏ విధమైన వ్యూహాలు, విధానాలు, మౌలిక సదుపాయాలు అవసరం, ఏ రంగాలు అత్యంత కీలకం అవుతాయి వంటి అంశాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో శనివారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ – 2047 అగ్రిచాప్టర్ నివేదికలో రైతు కేంద్రీకృత ప్రణాళికలు, రైతు ఆదాయం పెంపు, ఉత్పాదకతలో నాణ్యతా ప్రాముఖ్యత, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలను ప్రధానంగా చేర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పలు కీలక సూచనలు చేస్తూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చిదిద్దే లక్ష్యంతో వ్యవసాయరంగం సరిసమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో వ్యవసాయ పరిశోధన, విస్తరణ కార్యకలాపాలకు అపార అవకాశాలున్నాయని, వాటిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. పంటల ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యకరణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక, నీటి వినియోగ సామర్థ్య పెంపు వంటి ఆ ధునిక పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో చోటుచేసుకుంటున్న కొత్త సాంకేతికతలను త్వరగా అన్వయించగలిగితే తెలంగాణ వ్యవసాయ రంగం మరింత శక్తివంతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చి న ప్రాధాన్యత దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతుల సంక్షేమాన్ని అత్యున్నత లక్ష్యంగా పెట్టుకున్న ప్ర జా ప్రభుత్వం బడ్జెట్‌లో సింహభాగాన్ని వ్యవసాయ రంగానికి కేటాయించిందని, రైతుల ఆర్థిక భద్రత కోసం దేశం లో ఎక్కడా లేని విధంగా రుణమాఫీని అమలు చేయడంతో పాటు రైతుభరోసా పథకం ద్వారా ఎకరానికి రూ. 12 వేల పెట్టుబడి సహాయం అందించి, రైతు కుటుంబాలకు ధైర్యం, స్థిరత్వం, పెట్టుబడి సామర్థ్యం అందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వంనుంచి పరిమిత మద్దతు మాత్రమే లభించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసి, రైతు పక్షపాత ప్రభుత్వమనే నమ్మకాన్ని మరింత బలపరిచిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, వ్యవసాయ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వ్యవసాయ వర్సిటీ వైస్ ఛాన్సలర్ జానయ్య, ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్సలర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.



## ఏడాది తరువాత 'చలో శ్రీశైలం'



### సాగర్‌లో నెలకొన్న పర్యాటకుల సందడి

**ప్రజాపక్షం/నందికొండ :** ఏడాది తర్వాత రిజర్వాయర్ నిండుకుండలా మారి రిజర్వాయర్ నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో నాగార్జునసాగర్ నుండి శ్రీశైలంకు లాంచి యాత్రను శనివారం ప్రారంభించారు. దట్టమైన నల్లమల అడవుల నడుమ కృష్ణవేణి తరంగాలపై లాంచీలో ప్రయాణం ఒక మధురమైన దివ్య మైన మధురానుభూతిని కలిగిస్తుంది నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నదిలో 6 గంటల పాటు సాగే సుధీర్ఘ లాంచీ ప్రయాణం ఆనందాన్ని ఆహ్లాదాన్ని పంచిస్తోంది అనడంలో ఎటువంటి సందేహం లేదు తెలంగాణ పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చిన ఈ యాత్ర శనివారం సాగర్ నుండి ప్రారంభమైంది ఇది పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకోవడంతో సాగర్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. మొదటి రోజు ప్రారంభమైన ఈ యాత్రను పర్యాటకులు వినియోగించుకున్నారు లాంచి ప్రయాణానికి ముందు మొదటగా తెలంగాణ పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ మానవి,మేనేజర్ హరి నాయక్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక ఉద్యోగ సంఘ నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి లాంచి ప్రయాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మానవి మాట్లాడుతూ ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి లాంచీ బయలుదేరి శ్రీశైలానికి సాయంత్రం 3 గంటలకు చేరుకుంటుందని మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరి నాగార్జునసాగర్ కు సాయంత్రం 3 గం టలకు చేరుకుంటుందని అన్నారు . ఒక వైపు ప్రయాణా నికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600,వెళ్లి రావడానికి అప్ అండ్ డౌన్ పెద్దలకు రూ.3,250, చిన్న పిల్లలకు రూ.2,600 టికెట్ ధర నిర్ణయించామని . ప్రయాణికులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నామని లాంచీ దిగిన తర్వా త అక్కడ రవాణా, రాత్రి బస, వసతికి అయ్యే ఖర్చు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని అన్నారు డిమాండును బట్టి సోమవారం నుంచి శుక్రవారం లోపు 50 మందికి టికెట్లు బుక్ అయితే ట్రిప్ వేయనున్నట్లు వారన్నారు . శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ కు కూడా వన్ వే బుకింగ్ ఉందని తెలిపారు. లాంచీ ప్రయాణ వివరాలు, టికెట్ బుకింగ్ సమాచారం తెలుసుకునేందుకు 9848540371, 9848125872 సంప్రదిం చాలని ఆన్ లైన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

## దేవాదాయ శాఖలో కొత్త పోస్టుల భర్తీ ఆపాలి

- తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి
- కార్యాలయానికి తరలివచ్చి గోడు వెల్లబోసుకున్న వందలాది మంది ఉద్యోగులు
- కమిషనర్‌కు ఉద్యోగుల జెఎసి నేతల విజ్ఞాపన లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులు, పరిచారకులు, ముఖ్య అర్చకులతో పాటు ఇతరత్రా ధార్మిక సిబ్బందికి సంబంధించి వెలువడిన డైరెక్ట్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ దేవాదాయ అర్చక, ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) డిమాండ్ చేసింది. అలాగే దశాబ్దకాలానికి పైగా దేవాలయాల్లో సేవలందిస్తున్న అర్చక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఇచ్చిన 121 జిఒలో నవరణ చేయాలని, కారుణ్య నియామక ఉద్యోగులకు గ్రాంట్‌ఇన్‌ఎయిడ్‌లో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ జెఎసి నేతలు శనివారం బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది ఉద్యోగులు తమ గోడును కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో జెఎసి నేతలు ..కరణం మహేష్ శర్మ, గంగు ఉపేంద్ర శర్మ, పరుశురాం రవీంద్ర చార్యులు, కాందూరి కృష్ణమాచారి, చింతపట్ల బద్రీనాథ్ చార్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఈ నోటిఫికేషన్ పూర్తిగా అన్యాయమైందని, దశాబ్ద కాలంగా చాలీచాలని జీతంతో, అపార కష్టాలతో దేవాలయాల్లో సేవలందిస్తున్న వేలాది అర్చక ఉద్యోగుల సేవలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోకుండా జారీ చేశారన్నారు. దశాబ్దకాలంగా పనిచేస్తున్న అర్చకులు, పరిచారకులకు న్యాయం చేయాలని వారు కోరారు. రాష్ట్రంలోని అనేక దేవాలయాల్లో 1015 ఏళ్లుగా తాత్కాలికంగా పనిచేస్తూ. రూ.1500రూ.6000 మధ్య అల్ప వేతనాలతో సేవలందిస్తూ, పండుగలు, జాతరలు, నిత్యపూజల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ, ఇప్పటికీ పదోన్నతులు, రెగ్యులరైజేషన్, గ్రాంట్ ఇన్‌ఎయిడ్ లాంటి ప్రయోజనాలు పొందలేదని గుర్తు చేశారు. వీరి సమస్యలను పక్కన పెట్టి కొత్తగా ఉద్యోగాలను భర్తీ చేయడం మానవీయంగా, పరిపాలనా రీత్యా, ధార్మిక రీత్యా కూడా సరైనది కాదని అన్నారు. .జిఒ 121 ను తక్షణ సవరణ చేసి అర్చకులకు రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. ఈ జిఒలో గతంలో పనిచేసిన అనుభవాన్ని లెక్కించడం లేదన్నారు. తాత్కాలిక, అనధికారిక అర్చక ఉద్యోగుల సేవలను గుర్తించే నిబంధనలు లేకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అలాగే కారుణ్య నియామక ఉద్యోగులకు గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ ద్వారా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తమ సమస్యలపై మంత్రి కొండాసురేఖ, కమిషనర్ హరీష్‌లకు విన్నవించామని వారు సానుకూలత వ్యక్త పరిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెఎసి నేతలు కరణం మహేష్ శర్మ, బండారి జగపతి, సురేష్, చంద్రశేఖర్, ప్రపుజ్జయ శర్మ, ప్రసాదు, గణేష్‌గౌడ్, రాము, సర్వేష్, అనురాధ, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
SoR కాని వస్తువుల కొటేషన్ అంశాల ప్రచురణ
"జిహెచ్‌ఎంసి, సిఆర్‌జెడ్, ఫలక్‌నుమా సర్కిల్-10 లోని బహదూర్‌పురా X రోడ్స్, కిషన్ బాగ్ X రోడ్స్, జూ పార్క్, తాడ్‌బన్ X రోడ్స్, ఇంజిన్ బౌలి X రోడ్స్, చాంద్రాయన్ గుట్ట X రోడ్ పక్కన, ఫరూక్ నగర్ X రోడ్ వద్ద ఫ్యాబ్రికేషన్ హైలైటింగ్ సర్కిల్ (ప్లాజా రకం) ద్వారా జంక్షన్ బ్యూటిఫికేషన్‌తో పాటు శిల్పాలను సరఫరా చేయడం మరియు అందించడం" పనులకు సంబంధించిన వస్తువులకు కొటేషన్ రేట్లు ఆహ్వానించడమైనవి మరియు కొటేషన్‌లు చేయవలసిన వస్తువుల వివరాలను జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్ "https://www.ghmc.gov.in"లో అప్‌లోడ్ చేయడమైనది. దయచేసి వెబ్‌సైట్‌ను చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎం), సిఐఆర్-10, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11517-PP/CL/ADVT/1/2025-26, Date: 29-11-2025

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
'e' NIT No. 11/J1/IT/GHMC/2025-26/1st Recall, తేది: 28.11.2025
పని పేరు: జిహెచ్‌ఎంసి (మొదటి రీకాల్) (1) సంవత్సరం రేటు ఒప్పందంతో మల్టీఫంక్షన్ ప్రింటర్లు, ప్రింటర్లు, ప్లాటర్లు మరియు కాపీయర్ యంత్రాల కోసం విడిభాగాల సరఫరా మరియు సంస్థాపన, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 01.12.2025న ఉ.11:00 గం.ల నుండి, ఆఖరి తేది: 08.12.2025న సా.04:00 గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఓ/ఓ అడిషనల్ కమిషనర్ (ఐటి), 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ బిల్డింగ్, జిహెచ్‌ఎంసి, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ - 500063. ఫోన్: 6309999458. deeit-ghmc@gov.in
సం/- అడిషనల్ కమిషనర్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 11539-PP/CL/ADVT/1/2025-26, Date: 29-11-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## దివ్యాంగుల సమస్యలపై సజ్జనార్‌కు వినతి



**హైదరాబాద్:** దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్‌కు డిజేబుల్ ఉమెన్స్ సొసైటీ అధ్యక్షురాలు తాళ్ల మాధవి వినతి పత్రాన్ని అందించారు. సజ్జనార్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన మాధవి, విద్యాంగుల పరిస్థితిని వివరిం చారు. తమ వంటి దివ్యాంగుల కోసం ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, కోర్టు, బస్టాండు లేదా మరే ఇతర కార్యాలయాల్లో వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచా లని కోరారు. కొంత మంది వివిధ కార్యాలయాలు, సంస్థ లకు స్వయంగా వెళ్లగలిగినా, 'వీళ్లు ఎందుకు వచ్చారు' అన్న రీతిలో కొందరు ప్రవర్తించడం సరికాదని మాధవి అన్నారు. విద్యాంగులను కూడా గౌరవంగా చూడాలని కోరారు. తమ వినతి పత్రం పట్ల సజ్జనార్ సానుకూలంగా స్పందించారని మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. 'యాక్సెబిలిటీ సమస్యలు' త్వరతగిగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు.



## 86 మంది రౌడీషీటర్ల బైండోవర్..!

### పాతబస్తీ రౌడీ గ్యాంగ్‌లపై సజ్జనార్ ఉక్కుపాదం..!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ లో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, ముఠా తగాదాలతో అశాంతి రేపుతున్న అసాంఘిక శక్తులపై నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనర్ కఠిన చర్యలు తీసుకున్నారు. పది ప్రధాన ముఠాలకు చెందిన 86 మంది రౌడీషీటర్లను ఆయన టిజిఐసిసికి పిలిపించి.. అదనపు జిల్లా మెజిస్ట్రేట్ (ఎగ్జిక్యూటివ్) హోదాలో ప్రత్యేక కోర్టు నిర్వహించారు. నగరంలోని సౌత్, సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ పరిధిల్లో ఆధిపత్య పోరు కోసం ఘర్షణ పడుతున్న వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడుతూ, ప్రత్యర్థి ముఠాలపై దాడులకు తెగబడుతున్న వారిని పోలీస్ కమిషనర్ విచారించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 126 కింద 86 మందిని కమిషనర్ బైండోవర్ చేశారు. రాబోయే ఏడాది కాలం పాటు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడబోమని, సత్ప్రవర్తనతో ఉంటామని వారి చేత సెక్యూరిటీ బాండ్లు రాయించుకున్నారు. బాండ్ రాసిచ్చిన కాలపరిమితిలోపు ఎవరైనా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బాండ్‌ను రద్దు చేయడంతో పాటు, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విచారణలో స్పెషల్ బ్రాంచ్ డిసిపికె.అపూర్వారావు, సంబంధిత ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



## విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలి : ఎంఎల్‌ఎ కాలేరు

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని అంబర్‌పేట ఎంఎల్‌ఎ కాలేరు వెంకటేశ్ అన్నారు. విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలని సూచించారు. అంబర్‌పేట పటేల్‌నగర్‌లో ఉన్న సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ 40వ వార్షికోత్సవం తరంగ్ పేరిట శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ కాలేరు వెంకటేశ్ హాజరై, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, న్యూ ఎర కళాశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమానికి ప్రారంభించారు. ఎంఎల్‌ఎ కాలేరు మాట్లాడుతూ పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలన్నారు. విద్యార్థులు విద్యతోపాటు ఆయా రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ జె.రాజశేఖర్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## సైన్స్ అద్భుత శక్తి : ఐజి శ్రీనివాస్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** సైన్స్‌లో అద్భుతమైన శక్తి దాగి ఉన్నదని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్ అన్నారు. ఎనర్జీ సైన్స్ అవగాహన సదస్సు సుప్రభ ట్రస్టు, బ్లోసమ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఐజి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం మాట్లాడారు. సైన్స్‌లో అనేక ఔషధ గుణాలున్నాయన్నారు. సైన్స్‌పై యువత మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. బ్లోసమ్ వ్యవస్థాపకులు జయేశ్ కుమార్ మహేంద్ర మాట్లాడుతూ పిరమిడ్ థెరపీతో దీర్ఘకాలిక సమస్యలను దూరం చేయొచ్చన్నారు. సైన్స్‌పై మరిన్ని అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హరీశ్, పిజి కేశవులు, తులసి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## హిల్ట్ పాలసీపై మంత్రులకు..

## లై డిటెక్టర్ టెస్ట్‌తో నిజాలు బయటకు

### బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రూ.6.30 లక్షల కోట్ల విలువ గల ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే జి.ఓ ద్వారా కొల్లగొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ హిల్ట్ పాలసీపై ప్రభుత్వానికి పారదర్శకత లేదని విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బహిరంగ చర్చకు రవాలని సవాల్ విసిరారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు ఈ దుష్ట చతుష్టయానికి లై డిటెక్టర్ టెస్టులు చేస్తే నిజాలు బయటపడుతాయన్నారు. బిజెపికి అవగాహన లేదన్న మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలను తిరస్కరించిన ఆయన, చర్చకు రావాలని అనేకసార్లు సవాల్ విసిరినా, ప్రభుత్వం నుంచి ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఇండస్ట్రియల్ ఏరియాల్లో గతంలో ఇచ్చిన భూములను మాయ చేస్తూ, వేల కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.5 వేల కోట్లకు ఇవ్వడం వెనక భారీ స్కామ్ ఉందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో చర్చకు అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడం అప్రజాస్వామికమని మహేశ్వర్ రెడ్డి అన్నారు.

## పోక్సో కేసు నమోదు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మైనర్ బాలికను వేదిస్తూ, అకారణంగా దాడి చేసిన ఇద్దరు యువకులను పట్టుకుని వారిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు సత్తుపల్లి పోలీసులు. పోలీసులు తెలిపిన వివరాల ప్ర కారం పఠాన్ షకీర్, షేక్ లాల్ మౌలా అలియాస్ షరీఫ్ అనే ఇద్దరు వ్య క్తులు మైనర్ బాలికను ప్రేమించమని వెంటాడుతూ, వేధిస్తూ బెదిరించడ మే కాకుండా, దాడి చేయడంతో మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రదీప్ బాలిక ఫిర్యాదుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులైన చెందిన పఠాన్ షకీర్, షేక్ లాల్ మౌల అలియాస్ షరీఫ్‌లను సత్తుపల్లి కోర్టులో హాజరుపరచినట్లు సిఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు.

# వడి వడిగా విలీన ప్రక్రియ

### సుదీర్ఘంగా కొనసాగుతున్న కసరత్తు
### విభాగాల వారీగా వివరాల సేకరణ
### ఒకటి రెండు రోజుల్లో విలీనంపై ఉత్తర్వులు వెలువడే అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ బల్దియాలో శివారు ప్రాంతాల విలీన ప్రక్రియపై అధికార యంత్రాంగం వడివడిగా చర్యలు చేపట్టింది. గత మూడు రోజులుగా జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగం విలీన ప్రక్రియపై జూబ్లీహిల్స్‌లోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)లో సుదీర్ఘ కసరత్తు చేస్తోంది. అలాగే శనివారం జిహెచ్‌ఎంసికి చెందిన (ఆరోగ్యంపారిశుద్ధ్యం) విభాగం అధికారులు శివారు ప్రాంతాల్లోని మున్సిపల్ సంస్థల కార్యాలయాలను సందర్శించారు. అక్కడ ఎంత మేరకు చెత్త ఉత్పత్తి అవుతుంది. తరలింపు ప్రక్రియ, పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బంది తదితర అంశాలను ఆరా తీసినట్లు తెలిసింది. ఒక్కో విభాగం నుంచి ఇలా వివరాలు అధికార యంత్రాంగం సేకరిసోతంది. సమగ్ర సమాచారం సేకరించిన అనంతరం జోన్‌లు, సర్కిళ్ల స్వరూపం రూపొందించనున్నారు. ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఆర్డినెన్స్ ద్వారా ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారికంగా శివారు ప్రాంతాలు జిహెచ్‌ఎంసిలో విలీనం కానున్నాయి. విలీనం అయిన వెంటనే ప్రస్తుత కమిషనర్‌ను కొనసాగిస్తునే జిహెచ్‌ఎంసికి ముఖ్య కార్యదర్శి హోదా ఉన్న సీనియర్ అధికారిని చీఫ్ కమిషనర్‌గా నియమించే అవకాశం ఉందని అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వం నుంచి విలీన ఉత్తర్వులు అందిన వెంటనే శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు సంబంధించిన ఫైళ్లను జిహెచ్‌ఎంసిలోని సమీపంలోని జోన్‌లు, సర్కిళ్లకు అప్పగిస్తారు. బ్యాంక్‌లను స్తంభింప చేస్తారు. పౌర సేవలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటారు. 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌లను తాత్కాలికంగా సర్కిళ్లుగా మార్పు చేసి పాలన అందించేందుకు చర్యలు చేపట్టారు. పూర్తి స్వరూపం వచ్చే వరకు విలీనమైన మున్సిపల్ సంస్థలను సర్కిళ్లుగా మార్చి పాలన అందించనున్నారు. పూర్తి స్థాయిలో జోన్‌లు, సర్కిళ్ల విభజన పూర్తయితే 12 జోన్‌లుగా, 60 సర్కిళ్లు ఏర్పడే అవకాశం ఉందని ఒక సీనియర్ అధికారి చెప్పారు.

**హాట్‌టాపింగ్ విలీన ప్రక్రియ..**

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) గ్రోత్ కారిడార్ వరకు విస్తరించాలన్న ప్రభుత్వ నిర్ణయం రాష్ట్ర రాజకీయాలు, పాలనా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లను జిహెచ్‌ఎంసిలో విలీనం కావడం ఖాయమవడంతో హైదరాబాద్ భవిష్యత్తు స్వరూపం ఏమిటటనే అంశంపై ఉత్కంఠత నెలకొంది. ఒకే కార్పొరేషన్‌గా కొనసాగించాలనే యోచనలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిర్ణయంతో జిహెచ్‌ఎంసి విస్తీర్ణం ప్రస్తుతం ఉన్న 625 చదరపు కిలోమీటర్ల నుంచి ఏకంగా 2,735 చదరపు కిలోమీటర్లకు పైగా పెరగనుంది. ఈ స్థాయిలో విస్తరించిన స్థానిక సంస్థ దేశంలోనే హైదరాబాద్ తొలిది కానుంది. ఓఆర్ఆర్ పరిధి వరకు ఒకే మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ్యత ఏర్పడుతుంది ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాలు నెలకొల్పి కార్యాకలాపాలు నిర్వహిస్తున్నాయి.

**అంతర్జాతీయ స్థాయి నగర గుర్తింపే లక్ష్యంగా..**

దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పెద్ద నగరాల సరసన భాగ్యనగరాన్ని నిలబెట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ప్రపంచ స్థాయి నగరాలైన మాస్కో (2,500 చ.కి.మీ), టోక్యో (2,200 చ.కి.మీ) మాదిరిగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ ప్రణాళికగా కనిపిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ వాటర్ బోర్డ్, హైడ్రా వంటి సంస్థలు ఓఆర్ఆర్ వరకు తమ సేవలను అందిస్తున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబాయి, ఐటీ క్యాపిటల్స్‌గా పేరుపొందిన బెంగళూరు, చెన్నై, నగరాలతో పాటు కోల్‌కతా తదితర మెట్రో పాలిటన్ నగరాలను వెనక్కి నెట్టి, అగ్రభాగంలో నిలవనుంది. గత మూడు దశబ్దాలుగా హైదరాబాద్ నగరం నలువైపుల శరవేగంతో విస్తరిస్తోంది. ఇతర మెట్రో నగరాలతో పోల్చితే జీవన వ్యయం తక్కువగా ఉండటంతో పాటు ఎక్కడి వారికైన భాషా సమస్య లేకపోవడంతో విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు వ్యాపార కార్యాకలాపాలు నెలకొల్పుకునేందుకు అవకాశం ఏర్పడింది. అంతేకాకుండా సమశీతోష్ణస్థితి వాతావరణం ఉండటంతో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు హైదరాబాద్‌లో స్థిరపడేందుకు ఇష్టపడుతున్నారు. ఇప్పటికే ఐటి, ఫార్మా రంగాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిన విషయం తెలిసిందే. ఒక వైపుర చారిత్రక నేపథ్యం మరోవైపు అత్యాధునిక హైటెక్ నగరంగా హైదరాబాద్ విలసిల్లుతోంది.

చిన్న మున్సిపాలిటీ నుంచి మెగా సిటీ వరకు విస్తరణ..

చిన్న మున్సిపాలిటీ నుంచి మెగా సిటీ వరకు ప్రయాణం హైదరాబాద్ విస్తరణ కొనసాగుతూ వస్తోంది. 1880లలో చాదర్‌ఘాట్ మున్సిపాలిటీ, హైదరాబాద్ మున్సిపాలిటీ పేరుతో ప్రారంభమైన పట్టణ పాలన, 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా మారింది. 2007లో 12 మున్సిపాలిటీలు, 8 గ్రామపంచాయతీల విలీనంతో జిహెచ్‌ఎంసి ఏర్పాటు అయింది. ప్రస్తుతం ఆరు జోన్‌లు, 30 సర్కిళ్లు, 150 డివిజన్‌లతో గ్రేటర్ హైదరాబాద్ పాలన కొనసాగుతోంది.

**విస్తరణ ఎందుకు? లక్ష్యాలేంటి?**

నగరంలో పెరుగుతున్న వలసలు, నిర్మాణ రంగం వృద్ధి నేపథ్యంలో, చిన్నచిన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు సరైన నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిని అధిగమించేందుకు, హైదరాబాద్ విస్తరణలో సరైన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సమగ్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌ను రూపొందించవచ్చునని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. నిధుల కొరతతో మౌలిక వసతులను కల్పించలేని చిన్న స్థానిక సంస్థలకు, జిహెచ్‌ఎంసిలో విలీనం ద్వారా నిధుల లభ్యత పెరిగి అభివృద్ధి వేగవంతం అవుతుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఉద్యోగులకు సైతం ఒకే స్థాయిలో వేతనాలు, సదుపాయాలు లభిస్తాయి.

**ఎందుకు జిహెచ్‌ఎంసి విస్తరణ ?**

- దేశంలోనే అతి పెద్ద అర్బన్ లోకల్ బాడీగా హైదరాబాద్ రూపుదిద్దుకోనుంది.
- ప్రణాళికాబద్ధ నగర అభివృద్ధి అవసరం.
- అతి వేగంగా పెరుగుతున్న నిర్మాణ రంగం, వలసల ఒత్తిడి.
- వాటర్ బోర్డ్, హైడ్రా వంటి సంస్థల పరిపాలన ఇప్పటికే ఓఆర్ఆర్ సేవలు అందిస్తున్నాయి.

నిపుణుల సూచనలు..

- అర్బన్ ప్లానింగ్, రవాణా, మౌలిక వసతుల నిపుణులతో చర్చించి శాస్త్రీయమైన ప్రణాళిక అవసరం.
- రాజకీయంగా కాకుండా ప్రణాళికాబద్ధంగా చేయాలి.
- లేకపోతే భవిష్యత్లో పరిపాలనా సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## గ్రౌండ్‌లో పనిచేస్తేనే గుర్తింపు

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యూత్ కాంగ్రెస్ నాయకులు గ్రౌండ్‌లో పని చేస్తేనే మంచి గుర్తింపుతో పాటు ప్రజల నాడీ తెలుస్తుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో నేడు ఉన్నత స్థానాల్లో ఉన్న అనేక మంది నాయకులు గతంలో (ఎన్ఎస్‌యుఐ) యూత్ కాంగ్రెస్ లలో పని చెసిన వారే ఉన్నారని, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ లలో పని చేస్తే కాంగ్రెస్‌లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సర్పంచ్ లెవెల్స్ లో యూత్ కాంగ్రెస్ చాలా వాటిల్లో పోటీ చేయాలని, ఎంపిపి, జడ్పిటిసిలలో కూడా పోటీలో ఉండాలని పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్ లో పని చేసిన నాయకులకు కార్పోరేషన్ చైర్మన్ లు, డిసిసి అధ్యక్షులుగా అవకాశాలు వచ్చాయని, కేవలం కాంగ్రెస్ పార్టీలోనే ఇలాంటివి అవకాశాలు ఉంటాయని చెప్పారు. 'మీరు పార్టీకి భవిష్యత్, పార్టీలో మీలాంటి వారు ఉంటేనే ఒక నాణ్యమైన నాయకత్వం వస్తుంది' అని అన్నారు. జంప్ పాలిటిక్స్ చేస్తే కొంత కాలం బాగుంటుంది. కానీ, లాంగ్ పాలిటిక్స్ లో సాధ్యం కాదన్నారు. రాహుల్ గాంధీ ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ లు అంటే చాలా ఇష్టపడుతారని, మీరు భవిష్యత్ లో మరింత మంచి అవకాశాలు సాధించాలంటే కష్టపడి మంచి భవిష్యత్ నిర్మించుకోవాలని సూచించారు. ప్రజల్లో నిత్యం మమేకమై ఉంటూ యూత్ కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేయాలని మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## అధికారంలో ఉంటే ఒక రోజు.. లేకుంటే 10 రోజుల దీక్ష

### ఉద్దేశం ఏమిటో చెప్పాలి
### 'దీక్ష దివస్'పై మంత్రి సీతక్క ఫైర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజు మాత్రమే దీక్ష చేస్తూ, ఇప్పుడు 10 రోజులపాటు నిర్వహించడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటో బిఆర్ఎస్ నేతలు ముందుగా చెప్పాలని మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తీవ్రంగా విమర్శించారు. కెసిఆర్ చేపట్టిన నిరాహార దీక్షల నిష్పత్తి నిమ్మరసంకే తెలిసిందని ఆమె ఎద్దేవా చేశారు. ఇందిరా పార్కులో కరోనా చికిత్సను ఆరోగ్య శ్రీలో చేర్చాలంటూ జరిగిన నిరాహార దీక్ష కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన తర్వాత సీతక్క మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలలో విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు. సోషల్ మీడియాను సేవా వేదికగా వాడాల్సిన నాయకులు, దాన్ని తప్పుదారి పట్టించే పనులకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బిఆర్ఎస్ పాలన కారణంగా యువత ఉద్యోగాల కోసం, రైతులు అప్పుల బాధతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభయహస్తం పథకం నిధుల నుండి రూ.1500 కోట్లను, రూ.3000 కోట్ల వడ్డీ కూడా బిఆర్ఎస్ పాలకులు దోచుకున్నారని ఆమె ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ భర్తీ, రేషన్ కార్డులు, నాణ్యమైన చీరల పంపిణీ, పంట రుణమాఫీ, బోనస్ వంటి పలు కార్యక్రమాలు తమ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. బిసి రిజర్వేషన్ పెంపు కోసం స్థానిక ఎన్నికలను వాయిదా వేయాల్సి వచ్చిందని, అవసరమైన ప్రక్రియ పూర్తయినా బిజెపి, బిఆర్ఎస్ కుట్రల వల్ల ఆలస్యం జరిగిందన్నారు. ప్రధాని మోదీ నిజంగా బిసి అయితే రిజర్వేషన్ పెంపుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. పార్టీ తరపున బిసిలకు 42 శాతం సీట్ల కేటాయిస్తున్నామని చెప్పారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

### టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత అధికార పార్టీ రెండేళ్లు గడచిన ఎటువంటి చర్యలు తీసుకోక పోవటాన్ని నిరసిస్తూ డిసెంబర్ 3 నుంచి నిరసన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) మహబూబ్‌నగర్ తృతీయ మహాసభలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మహాసభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అనేక సందర్భాల్లో గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడేషన్ కార్డులను రెన్యువల్ చేస్తున్నారన్న విషయంతో పాటు హెల్త్ కార్డులు పనిచేయడం లేదన్న వాస్తవాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోతుందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు త్వరలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో జర్నలిస్టులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అక్రిడేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు అర్హులైన జర్నలిస్టులందరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే వరకు ప్రభుత్వంలో పోరాటం చేస్తామని టియుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు వ్యవహరించిన తీరు వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలలోని జర్నలిస్టు సంఘాలు బలహీన పడ్డాయని ఒక్కొక్క జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులను సమన్వయపరుస్తూ సంఘాన్ని బలోపేతం చేశామని రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మూడో మహాసభలకు కన్వీనర్ విజయరాజు అధ్యక్షత వహించగా యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు మల్యాల బాలస్వామి, ప్రశాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిరియాల కర్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ ముదిరాజ్, లక్ష్మ ణ్ యాదవ్, సురేందర్ రెడ్డి, ఆనంద్ కుమార్ గౌడ్, ముజాబ్, వివిధ దిన పత్రికలు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రతినిధులు వివిధ మండలాల విలేకరులు పాల్గొన్నారు.

## ఘర్షణ పడటం భారతీయ స్వభావం కాదు

### మోహన్ భగవత్



**ముంబయి:** భారతీయ స్వభావంలో 'ఘర్షణ'కు తావు లేదని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవడమే మన సంప్రదాయంలో, మన ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధానాధిపతి మోహన్ భగవత్ అన్నారు. ఎల్లప్పుడూ ఉమ్మడి సామరస్యాన్ని మాత్రమే భారత సంప్రదాయం ఉద్ఘాటించి చెప్పిందన్నారు. వివాదాల్లో మునిగి తేలడం, కలహం, తగవులాట భారతీయ స్వభాంలో లేదని, దేశ సంప్రదాయం ఎల్లప్పుడే సౌభ్రాతృత్వాన్ని, సమష్టి సామరస్యాన్నే చాటి చెప్పిందని అన్నారు. నాగపూర్‌లో జరిగిన నేషనల్ బుక్ ఫెస్టివల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ,జాతీయత భావనకు పాశ్చాత్య ప్రపంచం చెప్పే భాష్యంతో భారతదేశ దృక్పథం విభేదిస్తుందని అన్నారు. ''మనకు ఎవ్వరితోననూ వాగ్వాదం ఉండదు, కలహం, తగవులాట,ఘర్షణ ఏదైనాగానీ మనం వాటికి దూరంగా ఉంటాం, ఘర్షణ పడటం మన దేశ నైజంలోనే లేదు, కలసి ఉండటం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవడమే మన సంప్రదాయం'' అన్నారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయని, ఘర్షణలో మునిగితేలుతున్నాయన్నారు.

''ఒకసారి ఒక అభిప్రాయం ఏర్పడితే, దానికి భిన్నమైన ఆలోచనను సమ్మతించరు. ఇతరుల ఆలోచనలను లోనికి చొరబడనీయకుండా వారు మనసు తలుపులు మూసేసుకుంటారు, దానిని ఒక జాతీయవాదంగా పిలవడం ప్రారంభిస్తారు'' అని వ్యాఖ్యానించారు. పాశ్చాత్యదేశాలు చెప్పే భాష్యాలకు భారత జాతీయత భిన్నంగా ఉంటుందన్నారు. ''జాతీయత గురించి వారు మన ఆలోచనలను అర్థం చేసుకోరు, దానిని ఒక జాతీయవాదంగా పిలవడం ప్రారంభిస్తారు, 'దేశం' అనే మనకున్న భావన పాశ్చాత్యుల జాతీయ భావనకు భిన్నం, ఒక జాతి కావచ్చు, పురాతనకాలం నుండి మనకున్న రాజ్యభావన కావచ్చు, మరొకటి కావచ్చు భారతీయులమధ్య భిన్నమైన అభిప్రాయం ఉండదు, నాటి నుండి నేటివరకూ మనకు ఒకే భావన ఉంది'' అని ఆయన ఉద్ఘాటించారు.

## దొరకని ఎస్ఐ రివాల్వర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంబర్‌పేట ఎస్ఐ భానుప్రకాశ్‌కు చెందిన 9 ఎంఎం సర్వీస్ రివాల్వర్ అదృశ్యం కేసు పోలీసులకు పెను సవాల్‌గా మారింది. రివాల్వర్ ఉదంతం బయటపడి వారం రోజులు గడుస్తున్నా దాని ఆచూకీ తెలియక ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. బెట్టింగ్ వ్యసనానికి బానిసైన ఆయన, అప్పులు తీర్చేందుకు తన తుపాకీని అమ్ముకున్నాడనే అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు విచారణలో భానుప్రకాశ్ పొంతనలేని సమాధానాలు ఇస్తూ పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడు. మొదట తన డ్రాలో రివాల్వర్ కనిపించడం లేదని చెప్పిన భానుప్రకాశ్, ఆ తర్వాత విజయవాడలోని ఓ లాడ్జిలో మర్చిపోయినట్లు కథ అల్లాడు. దీంతో హైదరాబాద్ పోలీసులు విజయవాడ వెళ్లి లాడ్జి సిబ్బందిని, యజమానిని విచారించి, సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ తుపాకీకి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో ఆయన చెబుతున్న మాటల్లో నిజం లేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. భానుప్రకాశ్ తీవ్రమైన బెట్టింగ్ వ్యసనపరుడని, శిక్షణలో ఉన్నప్పటి నుంచే ఈ అలవాటు ఉందని ఆయన సహచరులు చెబుతున్నారు. తోటి సిబ్బంది, ఇతరుల వద్ద సుమారు రూ.60 లక్షల వరకు అప్పులు చేసినట్లు సమాచారం. ఈ అప్పుల కోసమే తుపాకీని మొదట రూ.5 లక్షలకు కుదువపెట్టి, ఆ తర్వాత రాయలసీమకు చెందిన ఓ గ్యాంగ్‌కు అమ్మేశాడనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంలో పోలీసులకు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన క్లూ లభించలేదు. గతంలో ఓ బంగారం రికవరీ కేసులో సస్పెండ అయినప్పుడు నిబంధనల ప్రకారం సర్వీస్ రివాల్వర్‌ను డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాల్సి ఉన్నా, ఆయన తన వద్దే ఉంచుకోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అవుతున్నారు. ఈ గన్ మిస్సింగ్ వ్యవహారంపై సిపి సజ్జనార్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. కేసును త్వరగా ఛేదించాలని టాస్క్‌ఫోర్స్‌పై ఒత్తిడి తెస్తున్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## అన్మోల్ ఎన్ఐఎ కస్టడీ మరో ఏడు రోజులు పొడిగింపు!



**న్యూఢిల్లీ:** పేరుమోసిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ ఎన్ఐఎ కస్టడీని మరో ఏడు రోజులు పొడిగించారు. ఈ నెల 19న విధించిన 11 రోజుల కస్టడీ గడువు నేటితో ముగియడంతో.. మరో ఏడు రోజులు కస్టడీ పొడిగించారు. అంటే డిసెంబర్ 5 వరకు అన్మోల్ కస్టడీ కొనసాగనుంది. అయితే భద్రతాకారణాల రీత్యా అన్మోల్‌ను ఎన్ఐఎ కోర్టుకు తీసుకెళ్లలేదు. అన్మోల్ చంపేస్తామంటూ బెదిరింపులు రావడంతో జడ్జి స్వయంగా ఎన్ఐఎ హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లాడు. అక్కడ విచారణ జరిపి ఎన్ఐఎ అధికారుల మేరకు అన్మోల్ కస్టడీని పొడిగించారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్య కేసులో, సల్మాన్ ఖాన్ ఇంటిపై కాల్పుల కేసులో అన్మోల్ నిందితుడిగా ఉన్నారు.

## వయస్సు కేవలం సంఖ్య మాత్రమే..

ఎన్నికల్లో పోటీచేస్తున్న 90 ఏళ్ల వృద్ధుడు



**న్యూఢిల్లీ:** కేరళ స్థానిక సంస్థల ఎన్నికలలో 90 ఏళ్ల వృద్ధుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నాడు. ఈ వయస్సులో అతడు వార్డు సభ్యుడిగా పోటీచేయడం చర్చనీయాంశమైంది. ఈ వయస్సులో పోటీ ఎందుకు అని ప్రశ్నిస్తే.. వయస్సు అనేది కేవలం సంఖ్య మాత్రమేనని, వయస్సు దేనికీ అడ్డంకి కాదని వ్యాఖ్యానించారు. వివరాల్లోకి వెళ్తే.. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అయిన నారాయణన్ నాయర్ వయస్సు 90 ఏళ్లు. ఆయన అశమన్నూర్ పంచాయతీలో రెండో వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. తెల్ల చొక్కా, ధోతీ ధరించిన నారాయణన్ నాయర్ వణుకుతున్న స్వరంతోనే ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు కార్యకర్తలు, మద్దతుదారులతో ఆర్భాటంగా ప్రచారాలు నిర్వహిస్తుండగా.. నారాయణన్ నాయర్ మాత్రం ఒంటరిగా జనం దగ్గరకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఈ వయసులో ఎన్నికల్లో పోటీకి దిగడంపై ప్రశ్నించగా.. వయసు దేనికీ అడ్డుకాదన్నారు. అది కేవలం సంఖ్య మాత్రమే అని చెప్పారు. తాను తన వార్డు అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని, అందుకే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తాననే నమ్మకం తనకు ఉందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కాగా, కేరళలో రెండు దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 9, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 13న ఫలితాలు వెలువడనున్నాయి.

## ఖర్గేతో రాహుల్ భేటీ

బిహార్ నాయకులు కూడా..



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమయ్యారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైన బిహార్ రాజకీయ పరిస్థితుల గురించి చర్చించినట్లు తెలిసింది. ఖర్గే నివాసానికి కారులో వెళ్లి బిహార్ నాయకులతో సమావేశమయ్యారని వర్గాలు తెలిపాయి. బిహార్ పార్టీ ఇన్‌చార్జి కృష్ణ అల్లవారు, రాష్ట్ర పార్టీ చీఫ్ రాజేష్ రామ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బిహార్ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను తెలుసుకోవడానికి గాంధీ, ఖర్గే గతంలో ఇందిరా భవన్‌లో బిహార్ నాయకులను, పోటీ చేస్తున్న అభ్యర్థులందరినీ బృందాలుగా కలిశారు. ఎన్‌డిఎ మహిళలకు రూ. 10,000 ప్రోత్సాహక పథకం, అంతర్గత కలహాలు, బిహార్ కాంగ్రెస్‌లోని విభేదాలు, పార్టీ టిక్కెట్ల పంపిణీ ఆలస్యంగా జరగడం వంటివి ఎన్నికల్లో ఓటమికి కొన్ని రణాలుగా అభ్యర్థులు పేర్కొన్నట్లు తెలిసింది.

# ఢిల్లీలో వాయు కాలుష్యం...

# ‘స్లో పాయిజన్’గా భయానక పరిస్థితి

కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ధ్వజం

ప్రభుత్వం తక్షణమే ఎంపీ స్థాయి కమిటీ వేసి గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ‘స్లో పాయిజన్’గా మారుతోందని పోల్చింది. ప్రభుత్వం దీనిని జాతీయ సమస్యగా పరిగణించి అన్ని భాగస్వామ్యపక్షాలతో తప్పనిసరిగా చర్చించి చాలని, ఎంపీ స్థాయి కమిటీని ఏర్పాటుచేసి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బిజెపిఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లను విమర్శిస్తూ ప్రభుత్వాలు ప్రజాకర్షక రాజకీయాలలో మునిగిపోవడానికి చాలా సమయం దొరుకుతుందని, కానీ వారు ఉచితాలకు డబ్బు ఎక్కువ ఖర్చు చేస్తే ప్రాథమిక సౌకర్యాలకు నిధులు ఇంకెక్కడ ఉంటాయని ధ్వజమెత్తింది. శనివారం ఇక్కడి ఎఐసిసి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు సందీప్ దీక్షిత్ మాట్లాడుతూ ఢిల్లీలో కాలుష్య గాలి అన్ని పరిమితులను దాటి ప్రస్తుతం ‘స్లో పాయిజన్’ భయానక పరిస్థితికి చేరుకుందన్నారు. ఢిల్లీలోని కలుషిత గాలి సాధారణ వ్యక్తి జీవితకాలం 6నుండి 7సంవత్సరాలకు తగ్గిస్తున్నదని డాక్టర్లు కూడా చెబుతున్నారని, అనారోగ్యంతో ఉన్న వారు మరింత ప్రమాదకరస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన చెప్పారు. వాయు కాలుష్యానికి అనేక కారణాలు ఉన్నాయని, కానీ పౌరులుగా మేం ప్రభుత్వాలను తప్పకుండా ప్రశ్నిస్తామని, వారి చర్యలకు వారిని జవాబుదారీగా చేస్తామని దీక్షిత్ చెప్పారు. దీపావళి సందర్భంగా పంటకోతలు, పటాకులు కాల్చడం వల్ల వాయు కాలుష్యం చాలా తక్కువని, శీతాకాలంలో కొంత కాలుష్యం కనిపిస్తుంది కానీ ఇవి ఏ మాత్రం ప్రధాన కారణాలు కావన్నారు. వాయుకాలుష్యానికి ప్రధాన కారణం వాహన కాలుష్యమని దీక్షిత్ తెలిపారు. దీనివల్ల వచ్చే కాలుష్యం దాదాపు 35శాతంగా ఉండి ఏడాది పొడవునా కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఢిల్లీ, పంజాబ్‌లోని బిజెపిఆప్ ప్రభుత్వాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల సగటు వ్యక్తి బాధపడుతున్నాడని దీక్షిత్ వెల్లడించారు. ప్రభుత్వాల మోసం కారణంగా ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించాలని, అలా చేయని పక్షంలో వారికి ప్రభుత్వం అని పిలువబడే హక్కు ఉండదన్నారు. ‘నేను చెప్పేది ఒక్కటే. ప్రజలను తప్పుదారి పట్టించడం ఆపండి. ఎందుకంటే కాలుష్యం కారణంగా ఢిల్లీ నగరం ఇకపై నివాసయోగ్యంగా లేదు’ అని దీక్షిత్ తెలియజేశారు. ఢిల్లీ అభివృద్ధి చెందుతున్నప్పుడు సగటు ట్రాఫిక్ వేగం 35నుండి 40 కిలోమీటర్లు ఉండేదన్నారు. కానీ, నేడు ప్రభుత్వం వైఫల్యం కారణంగా ట్రాఫిక్ వేగం మందగించిందన్నారు. రోడ్డు మౌలిక సదుపాయాలు పేలవంగా ఉన్నాయని, ఫలితంగా వాహన కాలుష్యస్థాయిలు రెండున్నర రెట్లు పెరిగాయని దీక్షిత్ ఆరోపించారు. ఢిల్లీలో ప్రజా రవాణా కుప్పకూలిందన్నారు. ఫలితంగా నేడు బస్సులో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిందని, వాహనాల సంఖ్య మాత్రం పెరిగిందన్నారు. ఢిల్లీలో కొత్త మెట్రో రైలు మార్గాలను ఎందుకు నిర్మించడం లేదనే ప్రశ్న కూడా తలెత్తుతుందని కాంగ్రెస్ నేత దీక్షిత్ అన్నారు.2004 2005లో అప్పటి ప్రభుత్వం అనేక వాయు కాలుష్య పరిశ్రమలను తొలగించిందని, ఈ ప్రభుత్వం ఇలాంటి చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు. ఢిల్లీలో చెత్త కుప్పలు పేరుకుపోయాయని, వివిధ ప్రదేశాలలో చెత్తను తగులబెడుతున్నారని, ఇది వాయు కాలుష్యానికి కారణమవుతోందన్నారు. గతంలో ఢిల్లీలో చాలా చోట్ల చెత్త బుట్టలను ఏర్పాటు చేసేవారని, అక్కడ వ్యర్థాలను విడివిడిగా ఉంచేవారని, ఇప్పుడు అలాంటి చర్యలు కనుమరుగు అయ్యాయని దీక్షిత్ ఆరోపించారు. వాయు కాలుష్యాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషిచేయాలని తాను నమ్ముతున్నానని, ప్రభుత్వం ఈ విషయాన్ని ప్రజలతో చర్చించి, బలమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై చర్చించాలని రాహుల్‌గాంధీ ప్రభుత్వాన్ని కూడా అభ్యర్థించారని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ఎంపీ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావాలని దీక్షిత్ డిమాండ్ చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కూడా ప్రజలను ఒక చోటకు చేర్చి దీనిని ప్రజా ఉద్యమంగా చేయాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ శుక్రవారం దేశ రాజధానిలో వాయు కాలుష్యం అంశంపై సభలో వివరణాత్మక చర్చను డిమాండ్ చేశారని, ఈ ఆరోగ్య అత్యవసర పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనాన్ని కాంగ్రెస్ నేతనేత ప్రశ్నించారు.

## స్వల్పంగా మెరుగుపడిన ఢిల్లీ గాలి నాణ్యత

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో కృశించిన గాలి నాణ్యత మార్పు లేకుండా కొనసాగుతున్నప్పటికీ శనివారం గాలిలో కాలుష్యం స్థాయి మాత్రం గణనీయంగా తగ్గి స్వల్ప మెరుగుదల కనిపించింది. శనివారం గాలి నాణ్యతా సూచీ (ఎక్యూఐ) 305 పాయింట్ల వద్ద స్థిరంగా కొనసాగింది. గాలి దిశ వేగం అనుకూలంగా కొనసాగింది. పొరుగు రాష్ట్రాల నుండి పంట వ్యర్థాలను కాల్చివేయడం వల్ల వస్తున్న కాలుష్యం గాలి దిశలో మార్పులవల్ల కొంత తగ్గింది. రాబోయే కొద్దిరోజులపాటు ఢిల్లీ వాతావరణంలో ఉన్న ‘‘వెరీ పూర్ జోన్’’ లో గాలి నాణ్యత మార్పు లేకుండా స్థిరంగా కొనసాగే అవకాశం ఉందని ‘‘స్కైమెట్’’ (వాతావరణ మార్పులు చెప్పే ప్రైవేటు విభాగం) ఉపాధ్యక్షుడు మహేశ్ పలవత్ చెప్పారు. ఇదిలాఉండగా, ఢిల్లీలో పీల్చడానికి ఎంతమాత్రం ఉపయోగపడని గాలి సగటు నాణ్యత వరుసగా శనివారం 6వ రోజు కూడా ‘‘వెరీ పూర్’’ కేటగిరీలోనే కొనసాగింది. దేశ రాజధానిలో గాలి నాణ్యత శనివారం నాటికి 305 వద్ద కస్థిరపడింది. శుక్రవారం ఈ నాణ్యత 369గా నమోదైంది. అంతకుముందు గురువారం 377, బుధవారం 327, మంగళవారం 352 సోమవారం 382 గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ప్రకటించింది. సిపిసిబి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం గాలి సగటు నాణ్యత 0–50 గా నమోదైతే ‘‘గుడ్’’ అని నిర్ధారిస్తారు. 51–100 మధ్య ఈ నాణ్యత నమోదైతే ‘‘సంతృప్తికరం’’ అని నిర్ధారిస్తారు. 101–200 మధ్య గాలి నాణ్యత ఉంటే ‘‘హద్దుల్లోనే ఉంది’’ అని పరిగణిస్తారు. ఈ నాణ్యత 201–300 మధ్యగా ఉంటే ‘‘క్షీణత’’గా పరిగణిస్తారు. 301–400 మధ్య నమోదైతే ‘‘నాణ్యత బాగా క్షీణించింది’’ అని ప్రకటిస్తారు. ఇదే కాలుష్య కారకాలు గాలిలో 401–500 మధ్య ఉన్నట్లు గుర్తిస్తే పరిస్థితి ‘‘తీవ్రరూపం’’ దాల్చిందని ప్రకటిస్తారు.

## మా ఇంటికి వెళ్లనీయండి

మణిపూర్ హింసాకాండ బాధితుల ఆందోళన.. భద్రతా దళాలతో ఘర్షణ



**ఇంఫాల్:** మణిపూర్‌లోని ఇంఫాల్ తూర్పు జిల్లాలో శనివారం వందలాది మంది నిరాశ్రయులైన ప్రజలు తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని డిమాండ్ చేస్తూ భద్రతా దళాలతో ఘర్షణ పడ్డారు. మే 2023లో జాతి హింస చెలరేగిన తర్వాత వారంతా వివిధ సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా సరిహద్దున ఉన్న గ్వాల్తాబిలోని తమ ఇళ్ల వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా యాయింగ్‌గాంగ్‌పోక్పి వద్ద భద్రతా దళాలు అడ్డుకున్నాయి. పరిస్థితి తీవ్రతరం కావడంతో, ఆందోళనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు అనేక రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించాయి. ఆందోళనకారులలో ఒకరైన ఎస్ ఇబెమ్చా దేవి మాట్లాడుతూ ‘ప్రభుత్వం ప్రకారం, రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించబడ్డాయి. అయితే, తమను తమ ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు అనుమతించడం లేదని నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ నియంత్రణలో ఉందని ఒక అధికారి తెలిపారు. నవంబర్ 21న సంగై ఫెస్టివల్ ప్రారంభమైనప్పటి నుండి అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తులు, భద్రతా దళాల మధ్య ఇటువంటి ఘర్షణలు చాలాసార్లు జరిగాయి.

## భారతీయుల జిఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు దుర్వినియోగం

మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో మయన్మార్ జాతీయులు ఉపయోగించినట్లు ఇడి వెల్లడి



**న్యూఢిల్లీ:** సరిహద్దుల మధ్య జరిగే మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాపై దర్యాప్తులో మయన్మార్ జాతీయులు భారతీయుల జిఎస్‌టి ధ్రువీకరణ పత్రాలను దుర్వినియోగం చేశారని తేలిందని ఇడి తెలిపింది. మిజోరాం మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో మనీలాండరింగ్ కేసు నమోదు అయిన తర్వాత, ఈనెల 27న భారత–మయన్మార్ సరిహద్దులో ఫెడరల్ దర్యాప్తు సంస్థ తొలిసారిగా సోదాలు నిర్వహించింది. మిజోరాంలోని ఐజ్వాల్, చాంఫాయి (భారత–మయన్మార్ సరిహద్దులో), అశోంలోని శ్రీభూమి (కరీమ్‌గంజ్), గుజరాత్ అహ్మదాబాద్‌లోని ప్రదేశాలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) నిబంధనల కింద దాడులు జరిగాయి. భారతదేశం తూర్పు వైపున మయన్మార్‌తో 1,643 కి.మీ. పొడవైన సరిహద్దును పంచుకుంటుంది. సోదాల సమయంలో సేకరించిన ఆధారాలు, మనీలాండరింగ్‌తో పాటు సరిహద్దుల మధ్య మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణాకు భారతీయులు మనీలాండరింగ్‌కు వీలు కల్పించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. మెథాంఫెటమైన్ మాత్రల తయారీకి అవసరమైన ముడి పదార్థాల కొనుగోలును సులభతరం చేయడానికి మయన్మార్ జాతీయులు భారతీయ పౌరులకు చెందిన జిఎస్‌టి ఆధారాలను దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో తేలిందని ఇడి తెలిపింది. మయన్మార్ జాతీయుల తరపున భారతీయులు సూడోఎఫెడ్రిన్ మాత్రలు, కెఫిన్ అన్‌హైడ్రస్‌లను సేకరించారని, ఇది సరిహద్దుల మధ్య మాదకద్రవ్యాల ఉత్పత్తి, అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను ప్రారంభించిందని, ఈ ప్రక్రియలో మనీలాండరింగ్ చేశారని ఆధారాలు సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ పథకం మాదకద్రవ్యాల తయారీ సరఫరా గొలుసుకు మద్దతు నిలిచిందని, ముఖ్యంగా మిజోరాం వంటి ‘పోరస్’ ఇండో–మయన్మార్ సరిహద్దు ప్రాంతాలను ప్రభావితం చేసిందని, బహుళ భారతీయ రాష్ట్రాలలో ఆర్థిక, స్మగ్లింగ్ సంబంధాలు, ఈ కార్యకలాపాల ద్వారా మనీలాండరింగ్ ఉన్నాయని ఏజెన్సీ తెలిపింది. దాడుల సమయంలో ఏజెన్సీ 21 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. ఆరుగురి నుండి రూ. 1.41 కోట్ల విలువైన 4.72 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకోవడంపై మిజోరాం పోలీసుల ఎఫ్ఐఆర్ నోదు చేశారు.

## ఐఎల్ ఇగ్నైటింగ్ మైండ్స్ కేస్ స్టడీ పూర్తి



**న్యూఢిల్లీ:** ఐసిఐసిఐ లంబార్డ్–ఐఐటి బాంబేలు కలిసి ఐఎల్ ఇగ్నైటింగ్ మైండ్స్ 2025 కేస్ స్టడీ పోటీని విజయవంతంగా పూర్తి చేశాయి. దేశవ్యాప్తంగా 500కు పైగా ప్రముఖ విద్యాసంస్థల నుంచి 4,000కుపైగా విద్యార్థుల నమోదు పొందిన ఈ ‘సీజన్ 3’ కేస్ స్టడీ ఇప్పటివరకు నిర్వహించిన మూడు సీజన్లలో అతి పెద్ద ఎడిషన్‌గా నిలిచింది. ఈ ఏడాది పోటీ థీమ్‌గా మన దేశంలో ‘చిన్న, సూక్ష్మ ఇన్సూరెన్స్’ వృద్ధి అవకాశాలను ఎంచుకున్నారు. దేశంలో 6.3 కోట్లకుపైగా ఉన్న చిన్న–మధ్య తరహా వ్యాపారాల్లో ఇన్సూరెన్స్ ప్రవేశం తక్కువగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకొని, విద్యార్థులు నూతన ఉత్పత్తి రూపకల్పన, డిజిటల్ టూల్స్, డిస్ట్రిబ్యూషన్ మార్గాలు, అవగాహన వ్యూహాలు రూపొందించేలా ఈ పోటీని రూపొందించారు. ఐఐఎం కలకత్తా, ఐఐఎం లక్నో, ఎన్ఎంఐఎంఎస్ వంటి ప్రముఖ సంస్థలతో నిర్వహించిన గత ఎడిషన్ల అనుభవాన్ని కొనసాగిస్తూ, ఐఐటి బాంబేతో కలిసి ఈ సీజన్‌నుఐసిఐసిఐ లంబార్డ్ మరింత విస్తృత స్థాయిలో నిర్వహించింది. ముంబయిలోని ఐసిఐసిఐ లంబార్డ్ కార్యాలయంలో నిర్వహించిన ఫైనల్ ఈవెంట్‌లో విద్యార్థులు తమ ప్రతిపాదనలు కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్‌కు సమర్పించారు. ‘మూడో సీజన్‌లో వచ్చిన ఆలోచనల లోతు, ప్రదర్శన, పాల్గొన్న విద్యార్థుల సృజనాత్మకత అద్భుతంగా ఉంది. భారత భవిష్యత్తు బాధ్యతతో ఆలోచించే యువ మేధావుల చేతుల్లో ఉందని మళ్లీ నిరూపితమైంది’ అని ఐసిఐసిఐ లంబార్డ్ మార్కెటింగ్ హెడ్ షీనా కపూర్ అన్నారు.

## అసెంబ్లీలో మహాఘట్బంధన్

ప్రతిపక్షనేతగా తేజస్వీ యాదవ్



**పాట్నా:** బిహార్‌లోని ప్రతిపక్ష మహాఘట్బంధన్ శాసనసభ్యులు శనివారం రాష్ట్ర శాసనసభలో సంకీర్ణ నాయకుడిగా ఆర్‌జెడికి చెందిన తేజస్వీ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ప్రారంభమయ్యే ఐదు రోజుల శాసనసభ సమావేశానికి ముందు యాదవ్ ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమయంలో 243 మంది సభ్యుల అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేస్తారు. సమావేశం తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌జెడి ఎమ్మెల్యే భాయ్ వీరేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభలో మహాఘట్బంధన్ నాయకుడిగా తేజస్వీ యాదవ్ ఎన్నికయ్యారని, వాస్తవానికి, ఆయన అసెంబ్లీలో తమ పార్టీకి నాయకుడిగా కూడా ఉంటారన్నారు. పార్టీ రాష్ట్ర యూనిట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ సమీర్ కుమార్ సింగ్ మాట్లాడుతూ తేజస్వీ యాదవ్‌పై నిర్ణయం ఏకగ్రీవంగా జరిగిందని, తకు తగినంత సంఖ్యాబలం ఉన్నందున ఆయన ప్రతిపక్ష నాయకుడిగా కూడా ఉంటారని చెప్పారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్బంధన్ పరాజయం చెందిన విషయం తెలిసిందే. అధికార ఎన్‌డిఎ 202 సీట్లను గెలుచుకుని అధికారాన్ని నిలుపుకుంది. కాగా, సమావేశంలో శాసనసభ ఉభయ సభల సభ్యులు ఎన్నికలు జరిగిన విధానంపై ఆందోళన వ్యక్తం చేశారు. సర్‌ను మొదట బిహార్‌లో నిర్వహించారని, ఇది ప్రశ్నార్థకమైన ప్రక్రియగా మిగిలిపోయిందని, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రంలో చాలా రాజకీయ ఘర్షణ ఉండటంలో ఆశ్చర్యం లేదని సింగ్ అన్నారు. ప్రజలకు సంబంధించినఅన్ని సమస్యలపై తాము సభలో స్వరాన్ని లేవనెత్తుతూనే ఉంటామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలపై వెనక్కి తగ్గడానికి ప్రయత్నిస్తే తాము బిజెపి నేతృత్వంలోని సంకీర్ణాన్ని ఎదుర్కొంటామన్నారు.

## ఎర్రకోట నిందితులకు 10 రోజులు కస్టడీ

అల్ ఫలాహ వర్సిటీలో రూ.18 లక్షలు స్వాధీనం

**న్యూఢిల్లీ :** ఎర్రకోట పేలుడు కేసులో అరెస్టైన ముగ్గురు వైద్యులు, మత ప్రచారకుడికి ఢిల్లీ కోర్టు 10 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఈ ఆత్మాహుతి పేలుడుకు పాల్పడిన వ్యక్తితో సంబంధాలున్న వైద్యులు ముజమ్మిల్ గనై, అదీల్ రథెర్, షహీనా సయీద్‌లను; ఇర్ఫాన్ అహ్మన్ వగాయ్ అనే మత ప్రబోధకుడిని ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి అంజు బజాజ్ చంద్నా ముందు హాజరుపరిచారు. దీనిపై విచారణ చేపట్టిన జడ్జీ వారిని 10 రోజుల జ్యూడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ దిల్లీలోని న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. అంతకుముందు డాక్టర్లు ముజమ్మిల్ గనై, అదీల్ రాథర్, షాహీనా సయీద్‌తో పాటు మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేయ్‌ను జమ్ముకశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత వీరిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కస్టడీలోకి తీసుకుంది. ఆ నలుగురు కూడా ఎర్రకోట పేలుడు కుట్రలో ప్రముఖ పాత్ర పోషించినట్టు కేంద్ర ఏజెన్సీ పేర్కొంది. ఇప్పటివరకు ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎన్ఐఎ తెలిపింది. ‘ఆత్మాహుతి బాంబు దాడికి సంబంధించి వివిధ ఆధారాల కోసం ఏజెన్సీ అన్వేషణ కొనసాగిస్తోంది. ఈ దారుణ దాడిలో పాల్గొన్న ఇతరులను గుర్తించడానికి సంబంధిత పోలీసు దళాలతో సమన్వయంతో రాష్ట్రాల్లో సోదాలు నిర్వహిస్తోంది.‘ అని ఎన్ఐఎ ఒక ప్రకటనలో తెలిపింది.అల్ ఫలాహ వర్సిటీలో రూ.18

**లక్షలు స్వాధీనం!**

మరోవైపు ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు కేసులో తవ్వేకొద్దీ విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో కీలక నిందితురాలైన షాహీన్ షహీద్ గదిలో 18 లక్షల రూపాయల నగదు లభ్యమైనట్లు జాతీయ మీడియా వర్గాలు తెలిపాయి. కేసు దర్యాప్తులో భాగంగా అల్ ఫలా యునివర్సిటీలో జాతీయ దర్యాప్తు షాహీన్ సమక్షంలో ఆమె నివసించిన రూమ్ నెంబర్ 22తో పాటు క్యాబిన్, ఆమె బోధించిన తరగతి గదులను పరిశీలించారు. ఈ క్రమంలోనే ఓ ప్లాస్టిక్ కవర్‌లో దాచిన 18 లక్షల రూపాయల నగదును అధికారులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. ఈ నగదు మొత్తాన్ని వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కార్యకలాపాల కోసమే దాచినట్లుగా తెలుస్తోందని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎన్ఐఎ అధికారులు ఈ నిధుల మూలాల కోసం అన్వేషణ మొదలుపెట్టారు.

## సాధువుల వసతి గృహాల కోసం చెట్లు నరుకుతారా?

ప్రభుత్వ తీరుపై సాయాజీ షిండే ఫైర్!



**ముంబయి :** మహారాష్ట్రలోని పంచవటి, తపోవనంలో గల వేలాది చెట్లను నరికివేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై ప్రముఖ నటుడు సాయాజీ షిండే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను నరికివేసి నాసిక్ ప్రజలను ఎగతాళి చేయవద్దని కుంభమేళా మంత్రి గిరీష్ మహాజన్‌ను ఉద్దేశించి అన్నారు. రానున్న కుంభమేళా నాటికి పంచవటి, తపోవనాల్లో సాధువుల కోసం వసతి గృహాలు నిర్మించాలని మహారాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. అక్కడి మొత్తం 35 ఎకరాల స్థలంలో సాధువు కోసం వసతి గృహాలు (కాంక్రీట్ నిర్మాణాలను) చేపట్టాలని సంకల్పించింది. ఇందుకోసం ఆ ప్రాంతాల్లోని 1825 చెట్లను నరికివేయాలని నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. దీనితో పర్యావరణవేత్తలు ఈ దారుణానికి వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించారు. గత 8 రోజులుగా ఇది కొనసాగుతోంది. అందులో భాగంగా నేడు (నవంబర్ 29) పర్యావరణవేత్త, నటుడు సాయాజీ షిండో తపోవనాన్ని సందర్శించి, చెట్లను నరికివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ‘తపోవనంలోని చెట్లను నరకకూడదు. సన్యాసులు వచ్చినా, వెళ్ళినా ఫర్వాలేదు. దీనిపై నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. కానీ చెట్లను నరికివేస్తే, నాసిక్ ప్రజలు బాధపడతారు. ఇక్కడ ఒక్క చెట్టు కూడా నరికివేయకూడదు. ఈ చెట్లన్నింటిని కాపాడాలి. ఈ ప్రభుత్వం మనదా లేక బ్రిటిష్ పాలన కొనసాగుతోందా? మన జాతీయ వృక్షం మర్రి చెట్టు. కానీ భారత ప్రభుత్వం ఈ చెట్టునే ఎక్కువగా నరికివేసింది. ఈ పెద్ద చెట్లు ఎక్కువ ఆక్సిజన్ ఇస్తాయి. ఐదు వందల నుంచి ఆరు వందల రకాల జీవులు, పక్షులు మర్రి చెట్టుపై నివసిస్తాయి. అలాంటి చెట్లను నరికివేస్తే క్షమించేది లేదు. మన తల్లిదండ్రులపై దాడి చేస్తే, మనం మౌనంగా ఉండము కదా!’ అని సాయాజీ షిండే పేర్కొన్నారు.

**నాకు మీతో ఎలాంటి శత్రుత్వం లేదు**

ఈ పనుల కోసం ప్రభుత్వం రూ.220 కోట్ల విలువైన టెండర్‌లను పిలిచింది. దీనిపై సాయాజీ షిండే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇక్కడ పచ్చని చెట్లను చంపడం ఒక జోక్ లాగా ఉందా? చెట్లు ముందు వచ్చాయి, ప్రజలు తరువాత వచ్చారు. ఈ చెట్లు జీవించాలి, వాటిని నరికివేయవద్దు' అని ఆయన అన్నారు. మంత్రి గిరీశ్ మహాజన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, ‘నాకు మీతో ఎలాంటి శత్రుత్వం లేదు. ఒకవేళ ఇప్పుడు ఏర్పడ్డా ఎటువంటి సమస్య లేదు. కుంభమేళా 12 సంవత్సరాల తర్వాత వస్తుంది. ఈ విషయంలో మీరు నాకు ఎప్పుడు కాల్ చేసినా, నేను హాజరవుతాను. చెట్లను కాపాడటానికి నాసిక్ వాసులు ఐక్యతను ప్రదర్శించారు, నేను దానిని సమర్థిస్తున్నాను‘ అని సాయాజీ షిండే అన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి నోట్‌పై..

డిసెంబరు 16కు ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు వాయిదా

**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన చార్జిషీట్ నోట్‌ను రిగణనలోకి తీసుకుని శనివారం ఢిల్లీ కోర్టు తన ఉత్తర్వులను వాయిదా వేసింది. ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే డిసెంబరు 16కు తన ఉత్తర్వులను వాయిదా వేశారు. కాగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, దివంగత పార్టీ నాయకులు మోతీలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండేజ్‌తో పాటు సుమన్ దూబే, సామ్ పిట్రోడా, ఒక ప్రైవేట్ కంపెనీ యంగ్ ఇండియన్‌పై కుట్ర, మనీలాండరింగ్ నిందితులుగా ఆరోపణలు చేసింది. నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్)కు చెందిన సుమారు రూ.2,000కోట్ల విలువైన ఆస్తులను వారు సంపాదించారని ఆరోపించింది. ఆరోపణలపై మరో అడుగు ముందుకు వేస్తూ యంగ్ ఇండియన్‌లో గాంధీ కుటుంబం ప్రధానంగా 76శాతం షేర్లను కలిగి ఉందని, రూ.90కోట్ల రుణానికి బదులుగా అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను మోసపూరితంగా ఆక్రమించిందన్నారు. ఈ చార్జిషీట్‌లో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సామ్ పిట్రోడా, దూబే, సునీల్ భండారీ, యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్లు ఉన్నాయి.





## శతాబ్దాల విరామం తర్వాత..



ఇథియోపియాలోని అఫార్ ప్రాంతంలో 'హైలీ గబ్బీ' అనే ప్రాచీన అగ్నిపర్వతం 12,000 సంవత్సరాల అనంతరం ఈనెల చివరి వారంలో బద్దలైంది. భూమిపై ఇప్పటివరకూ జరిగిన అత్యంత బలమైన భౌగోళిక సంఘటనల్లో ఒకటిగా నిలిచింది. ఊహించని శబ్దంతో జరిగిన ఈ విస్ఫోటనం కారణంగా చుట్టుపక్కల గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ అగ్నిపాతం వల్ల ఏర్పడిన భస్మ మేఘం సముద్ర గాలులతో ఎగిసిపోతూ, రెడ్ సీ రూపంలో యెమెన్, ఒమాన్, పాకిస్తాన్, భారత్ ప్రాంతాలకు కూడా చేరింది. పరిశోధనల ప్రకారం, ఈ అగ్నిపర్వతం విరజిమ్మిన బూడిద సుమారు 14 నుంచి 16 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిసింది. అమెరికా అంతరిక్ష నౌక ఈ భస్మాన్ని రోదసి నుంచి గుర్తించింది. దట్టమైన బూడిద ఆవరించడంతో భారత్, పాకిస్తాన్, యెమెన్, ఒమాన్ తదితర దేశాల్లోని కొన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో తదితర సంస్థలు ముందు జాగ్రత్త చర్యగా కొన్ని రూట్లలో సర్వీసులను ఉపసంహరించుకున్నాయి. కాగా, శతాబ్దాలు నిద్రావస్థలో ఉన్న అగ్నిపర్వతం ఒక్కసారిగా విస్ఫోటనం చెందడంతో వాతావరణం, వ్యవసాయం, పశుగ్రాస నష్టం, నీటి కాలుష్యం లాంటి సమస్యలు తలెత్తాయి. స్థానికంగా వేలాది జంతువులు ప్రమాదంలో పడ్డాయి. ఈ 'హైలీ గబ్బీ' అగ్నిపర్వతం తూర్పు ఆఫ్రికన్ పర్వత ప్రాంతాల్లో ఉంది. భూమి పొరల్లో నిరంతరం జరిగే అలజడుల కారణంగా ఇక్కడ తరచు భూకంపాలు, ప్రకంపనలు వస్తుంటాయి. అయితే, ఇక్కడి అగ్నిపర్వతాల నుంచి లావా చిమ్ముకురావడం చాలా అరుదు. మొత్తంమీద ఈ అరుదైన అగ్నిపాతం, భూమి శక్తి ఎంత శక్తిమంతంగా, ఎంతటి అనూహ్యంగా ఉందో మనకు గుర్తుచేస్తుంది. ఈ సంఘటన ప్రాంతీయంగా, ప్రపంచస్థాయిలో వాతావరణంపై, ప్రజల జీవనపరంపరపై ప్రభావం చూపుతోంది.

## పగలే చీకటి!





'పగలే వెన్నెల.. జగమే ఊయల' అన్నాడు ఓ సినీ గేయరచయిత డాక్టర్ సి. నారాయణ రెడ్డి. అలాస్కాలోని యుట్కియావిక్ (పాత పేరు బ్యారో) గురించి తెలిస్తే, పగలే చీకటి అనేవాడేమో. ఎందుకంటే, అక్కడ ప్రతి సంవత్సరం నవంబర్ చివరి నుంచి జనవరి చివరి వరకూ 'పోలార్ నైట్' అనే ప్రకృతి రహస్యం ఆవిష్కృతమవుతుంది. సూర్యుడు పూర్తిగా అస్తమిస్తాడు. అంటే, సుమారు సుమారు రెండున్నర నెలలు అక్కడ సూర్యుడు కనిపించడు. మధ్యాహ్న సమయంలో చాలా తక్కువ స్థాయిలో 'మసక వెలుతు రు' మాత్రమే ఉంటుంది. అయితే, సూర్య కాంతి లేకపోయినా, పట్టణవాసులు కృత్రిమ లైట్లు ఉపయోగిస్తూ, మధ్యాహ్న ట్విలైట్ సమయంలో బహిరంగ కార్యకలాపాలు నిర్వహిస్తూ, రోజులు గడిపేస్తారు. పక్షులు, జంతువులు కూడా తమ వేటను, విశ్రాంతిని ఈ దీర్ఘ చీకటి కాలానికి అనుగుణంగా మార్చుకుంటాయి. పోలార్ నైట్ కాలంలో స్థానికుల జీవన సరళి, సహనశీలతలను పరిశోధకులు పరిశీలిస్తారు. ఈ ప్రాంతం ఉత్తర ధ్రువానికి బాగా దగ్గరగా ఉన్నందువల్ల, భూ ఏటవాలు ఏటా 65 రోజుల పాటు సూర్యుడు కనిపించడు. వసంతం వచ్చేసరికి, దీని ప్రత్యామ్నాయంగా సూర్యుడు రెండు నెలలు అస్తమించకుండా ఉంటాడు. ప్రకృతిలో ఇదే విధంగా, దక్షిణ ధ్రువంలోని పట్టణాలు అర్ధ సంవత్సరంపాటు ఇలాంటి అంధకారాన్ని ఎదుర్కొంటాయి.

## చైనాలో 10జి నెట్‌వర్క్



మన దేశం ఇంకా 5జి నెట్‌వర్క్‌తోనే రోజులు వెళ్లదీస్తున్నది. ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని ప్రకటనలే తప్ప, శాస్త్ర, సాంకేతిక అంశాల్లో ఇప్పటికీ చాలా వెనుకబడే ఉన్నాం. 2030 వరకు దేశంలో 6జి అడుగుపెట్టవచ్చని అంచనా. అయితే, చైనా ఏకంగా 10జిని ఆరంభించింది. ఈ ఘనత సాధించిన తొలి దేశంగా గుర్తింపు సంపాదించింది. ఇది ప్రపంచ టెక్నాలజీలో ఓ కొత్త దశ. ఈ ఇంటర్నెట్ వ్యవస్థ ద్వారా, వినియోగదారులు ఒక 4కె సినిమా (20జిబి)ని 20 సెకన్లలో డౌన్‌లోడ్ చేయగుతారంటే, ఆ వేగాన్ని ఊహించుకోవచ్చు. అత్యంత వేగవంతమైన 10 గిగాబైట్ (9,834 ఎంబిపిఎస్) వేగం కారణంగా వల్ల 4కె సినిమాలు, 8కె వీడియో స్ట్రీమింగ్, భారీ ఫైల్ డౌన్‌లోడ్లు సెకన్లలో జరుగుతాయి. ఆన్‌లైన్ గేమింగ్ నుంచి వీడియో కాల్స్ వరకూ ప్రతిదీ క్షణాల్లోనే సాధ్యమవుతుంది. కృత్రిమ మేధస్సు (ఎఐ) ఎక్కువగా వినియోగించే స్మార్ట్ సిటీలకు, అతిపెద్ద డేటా ఉన్న ఫైల్స్‌కు అవసరం ఉంటుంది. అలాంటి ప్రాంతాల్లో 10జి సేవలు అత్యంత కీలకంగా మారతాయి. ప్రస్తుతం ఎన్నో దేశాలు 5జి నెట్‌వర్క్‌ను పెంచడానికి ప్రయత్నిస్తున్నా, చైనా ప్రస్తుతం 50జి పిఒఎన్ (పాసివ్ ఆప్టికల్ నెట్‌వర్క్) టెక్నాలజీ ఆధారంగా వైర్డ్ నెట్‌వర్క్‌లో 10జికి దూసుకెళ్లింది. ప్రస్తుత 10జి బ్రాడ్‌బ్యాండ్‌తో ప్రపంచ ఇంటర్నెట్ ప్రమాణాలను పెంచుతోంది. దీనితో ప్రపంచ దేశాలు తమ నెట్‌వర్క్ మార్పును వేగవంతం చేయక తప్పదు. ఈ తాజా ఆవిష్కరణతో, ఇంటర్నెట్ వేగం, టెక్నాలజీ ఉపయోగాలు పూర్తిగా కొత్త దశలోకి వెళ్లాయి. నిజంగా, ఇది డిజిటల్ జీవనంలో విప్లవాత్మక మలుపు.

## చట్టానికి సవాలు..



ఐవాలో బెంజిమిన్ ష్రైబర్ అనే ఖైదీ అమెరికన్ చట్టాలకు విసిరిన సవాలుపై ఇప్పటికీ చర్చ జరుగుతునే ఉంది. 1952 నవంబర్ 20న జన్మించిన ష్రైబర్‌ది నేరపూరిత జీవితం. 1996 ఏప్రిల్ 27న అతను జాన్ డేల్ టెర్రీ అనే వ్యక్తిని హత్య చేశాడు. నేరం రుజువు కావడంతో, కోర్టు అతనికి జీవిత ఖైదు శిక్ష విధించింది. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నందున 2015 లో అతనిని ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతు న్న సమయంలో గుండె ఆగిపోవడంతో అతను మరణించాడనే అంతా అనుకున్నారు. కానీ, వైద్యుల నిరంతర ప్రయత్నం వల్ల గుండె మళ్లీ కొట్టుకోవడం ప్రారంభమైంది. ఈ విధంగా ఒకటికాదు... రెండు కాదు.. ఏకంగా ఐదు సార్లు ష్రైబర్ 'చచ్చి బతికాడు'. కోలుకున్న తర్వాత, తనను విడుదల చేయాలని కోరుతూ ఐవా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. 'గుండె ఆగిపోయినప్పుడు నేను మరణించినట్టే లెక్క. కాబట్టి నా జీవిత శిక్ష పూర్తయింది. ఇది నాకు కొత్త జీవితం.. అందుకే పాత శిక్ష ఇప్పుడు వర్తించదు' అంటూ 2018లో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ పిటిషన్‌ను ఐవా కోర్టు 2019లో కొట్టివేసింది. 'ష్రైబర్ బతికే ఉన్నాడు కాబట్టి, శిక్ష కొనసాగించాల్సిందే. జీవితాంతం అంటే నిజంగా మరణించే వరకూ అని అర్థం. కాబట్టి విడుదల చేసే ప్రసక్తి లేదు' అని స్పష్టం చేసింది. 2023 ఏప్రిల్ 17 ష్రైబర్ మరణించాడు. అయితే, అతను లేవనెత్తిన వాదన ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉంది. ఒక వ్యక్తి మృతి చెందినట్టు వైద్యులు చేసిన ప్రకటనకు విలువలేకపోతే, వారిచ్చే ధ్రువీకరణ పత్రాలు ఎలా చెల్లుబాటు అవుతాయనే ప్రశ్న మళ్లీమళ్లీ తెరపైకి వస్తునే ఉంది. చట్టాలను మార్చాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తునే ఉంది.

## కాలమే పరిష్కారం



అమెరికాలోని యోమింగ్ రాష్ట్రంలోని అత్యధిక ప్రాంతంతోపాటు, మోంటానా, ఇడాహోలకు కూడా వ్యాపించిన ఎల్లో స్టోల్ నేషనల్ పార్క్‌లో అంతరించిపోయిందనుకున్న 'సిల్వర్ ఫాక్స్' (బూడిద నక్కలు)తిరిగి దర్శనమిచ్చాయి. తద్వారా ప్రకృతి సమతుల్యతను అందించింది. దుప్పుల సంఖ్య పెరుగుతున్నది. తాజాగా ఆస్పెన్ చెట్లు ఎలాంటి మానవ ప్రయత్నాలు లేకుండానే తిరిగి పెరుగుతున్నాయి. ఎంతో అందంగా కనిపించే ఈ చెట్లు దశాబ్దాల క్రితమే పూర్తిగా అంతరించిపోయాయని అనుకున్నారు. కానీ, వాటంతట అవే మళ్లీ జీవం పోసుకోవడాన్ని చూస్తుంటే, ప్రకృతికి సంబంధించిన ఎన్నో ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్తుందని అనిపిస్తున్నది. చరిత్ర పునరావృతమవుతుందనే నానుడిని ప్రకృతి విషయంలోనూ అన్వయించుకోవచ్చని నిరూపిస్తున్నది. ఒకజాతి తిరిగి రావడం మొత్తం జీవవ్యవస్థను మార్చిన ప్రకృతి శక్తికి ఉదాహరణ.

— బిఎస్ఎస్ మైత్రేయి

---

## స్థానిక సంస్థల ఎన్నికలు
## మహారాష్ట్రకు సుప్రీంకోర్టు పచ్చజెండా

మహారాష్ట్రలో స్థానిక సంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్‌పై వివాదంతో 2022 నుంచి నిలిచిపోయి ఉన్న ఎన్నికలకు సుప్రీంకోర్టు శుక్రవారం పచ్చజెండా ఊపింది. "పునాది స్థాయిలో సంస్థలను పునరుద్ధరించాలి. స్థానిక సంస్థలు ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులు లేకుండా ఉన్నాయి. వాటన్నిటినీ బ్యూరోక్రాట్లు(అధికారులు) నడుపుతున్నారు. ఎన్నికలు జరపటాన్ని మేము అనుమతిస్తాం" అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నవంబర్‌లో ఇంతకుముందు విచారణలో చెప్పారు. శుక్రవారం తాత్కాలిక ఉత్తర్వు జారీ చేస్తూ రిజర్వేషన్‌లపై ఉన్న 50శాతం రిజర్వేషన్‌లు అతిక్రమిస్తే ఎన్నికలు రద్దు చేయటానికి కూడా వెనుకాడం అని హెచ్చరించారు. జె.కె. బంతియా కమిషన్ నివేదిక ప్రకారం ఒబిసిలకు 27శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల అనేక పంచాయతీరాజ్, మున్సిపల్ సంస్థల్లో రిజర్వేషన్‌లు 50శాతం దాటటంపై తన ముందుకువచ్చిన పిటిషన్‌లను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్య బాగ్చీ బెంచి విచారించింది. డిసెంబర్ 2న పోలింగ్ జరిగే 246 మున్సిపాలిటీల్లో 40లో, 42 నగర పంచాయతీల్లో 17లో రిజర్వేషన్‌లు 50శాతం దాటుతున్నట్లు మహారాష్ట్ర ఎన్నికల కమిషన్ నివేదించింది. 'ఈ సంస్థలకు ప్రకటించిన షెడ్యూలు ప్రకారం పోలింగ్ జరుపుకోండి. అయితే రిజర్వేషన్‌లు 50శాతం దాటిన సంస్థల ఫలితాలు ప్రస్తుతం విచారణలో ఉన్న కేసు తుది ఫలితానికి లోబడి ఉంటాయి' అని బెంచి షరతు విధించింది. తదుపరి విచారణను వచ్చే జనవరి 21వ తేదీకి వాయిదా వేస్తూ, కేసును త్రిసభ్య ధర్మాసనం ముందుంచాలని ఆదేశించింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లకు 50 శాతం పరిమితి విషయంలో ఉన్న అస్పష్టతను రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలా అనే అంశాన్నిపరిశీలిస్తామని లోగడ విచారణలో బెంచి వ్యాఖ్యానించి ఉంది. "సర్వీసు జూరిస్ ప్రుడెన్స్‌ను ఎన్నికలకు వర్తింపజేయవచ్చునా అని కోర్టు తనను తాను ప్రశ్నించుకుంది.

ప్రజాపక్షం
30-11-2025, ఆదివారం

అదే సరైన మార్గం. ఎందుకంటే, చైతన్యవంతులవుతున్న ఒబిసి కులాలవారు తమ జనాభా ప్రకారం రాజకీయ పదవుల్లో న్యాయమైన వాటా కోరుతున్నారు; మండల్ కమిషన్ విద్య అడ్మిషన్‌లు, ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్ సిఫారసు చేసింది. అంతకు ముందు 1992లో 9 మంది జడ్జీలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇందిరా సాహ్నీ x యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 50శాతం సీలింగ్ విధించింది. సహేతుకమైన కారణాలను జనాభా గణాంకాలు, ఆర్థిక స్థితిగతుల డేటాతో రుజువు చేస్తే 50 శాతం దాటవచ్చని మరో సందర్భంలో సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది. ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్ యేతర కేటగిరికి (అగ్రవర్ణాలని అర్థం)విద్య అడ్మిషన్‌లలో మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా కలుగజేసిన 10శాతం రిజర్వేషన్ – దానితో మొత్తం రిజర్వేషన్‌లు 60 శాతానికి చేరినప్పటికీ – చెల్లుబాటును ఇదే సుప్రీంకోర్టు సమర్థించిం ది. అయితే రిజర్వేషన్‌ల పై సీలింగ్ విద్య, ఉద్యోగాలకే తప్ప రాజకీయ పరిపాలనా పదవులకు కాదని కొందరు వాదిస్తున్నారు. మండల్ కూడా దేశంలో ఒబిసిల జనాభా 50శాతం పైగా ఉన్నప్పటికీ, 50శాతం సీలింగ్ దృష్ట్యా తాను విద్య, ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్ సిఫారసు చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా వుండగా, 60 శాతంపైగా ఒబిసి రిజర్వేషన్‌లున్న తమిళనాడు చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ సవరణద్వారా 10వ షెడ్యూలులో పెట్టి రక్షణ కల్పించినందున, తమకూ అటువంటి రక్షణ కోరుతున్నవి తెలంగాణ వంటి రాష్ట్రాలు. అందువల్ల రాజ్యాంగ బెంచి ద్వారా ఈ వివాదాని కి తుది పరిష్కారం చూపటం సరైన చర్య అవుతుంది. మహారాష్ట్రలో ఇంకనూ నోటిఫికేషన్ జారీచేయని 29 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 32 జిల్లా పంచాయతీలు, 336 పంచాయతీ సమితులకు కూడా వెంటనే ఎన్నికలు జరపాలని సుప్రీంకోర్టు బెంచి ఆదేశించటం గమనించదగింది.

అటువంటి తుది నిర్ణయం జరిగేలోపు, మహారాష్ట్రకు దొరికిన వెసులుబాటును వినియోగించుకోవచ్చునేమో తెలంగాణ ప్రభుత్వం ఆలోచించవచ్చును. పాత పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఎన్నికల నిర్వహణకు హైకోర్టు అనుమతించినందున, ఆ ప్రకారం గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుపుతున్నందున, మిగిలిన పంచాయతీరాజ్ దొంతర్లకు, అలాగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరపవచ్చు. ఈ విషయంలో సుప్రీంకోర్టు మహారాష్ట్ర ఉత్తర్వు ఉపయుక్తం కావచ్చు. మూడవ పరిపాలన దొంతరగా రాజ్యాంగం గుర్తింపు ఇచ్చిన స్థానిక సంస్థల్లో దీర్ఘకాలం అధికారుల పాలన కొనసాగించటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అసెంబ్లీ, పార్లమెంటు వలె ప్రతి ఐదేళ్లకు విధిగా ఎన్నికలు జరగాలని రాజ్యాంగం 73, 74 వ సవరణలు ఆదేశించినా, ఓటర్ల జాబితాల తయారీ, రిజర్వేషన్‌ల అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలు తమ అనుకూల సమయం వరకు ఎన్నికలను వాయిదా వేస్తున్న తీరే అప్రజాస్వామికం. రాష్ట్రాలు రాజ్యాంగ సవరణ స్ఫూర్తిని పాటించాలి.

---

# కార్మిక కోడ్‌లు కార్మిక హితమైనవేనా?





**కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్నట్లు నవంబర్ 21న ప్రకటించింది. వేతనాల కోడ్, 2019, సామాజిక భద్రత కోడ్ – 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్ – 2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ – 2020 అమలుపై వెలువరించిన నోటిఫికేషన్ పట్ల అనేక కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ లేబర్ కోడ్‌లు కార్మిక హితమైనవేనా?అనే అంశంపై ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ నియమిత అధ్యక్షుడు ఆర్.ముకుందన్ తో ఎ.ఎం.జిగ్నేశ్ నిర్వహించిన సంభాషణ ముఖ్యాంశాలు..**

*ప్రశ్న: ఈ కోడ్‌లు తీసుకురావాల్సిన అవసరం ఎందుకొచ్చింది? కార్మిక చట్టాలను కోడ్ రూపంలో తీసుకురావాలని తాము ఎన్నడూ డిమాండ్ చేయలేదని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, పరిశ్రమలు మాత్రం సంస్కరణల పట్ల ఆత్రుతతో ఉన్నాయి.*

**ఆర్.ముకుందన్ :** భారత ఆర్థిక వృద్ధిలో కార్మిక్ కోడ్‌లు ముఖ్య భాగం. అనేక కార్మిక చట్టాలు 1940లలో, 1950లలో రూపొందించబడినవి. వాటిని వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉంది. మౌలికంగా కార్మిక కోడ్‌లు సంప్రదాయ పరిశ్రమలో పనిచేసే కార్మికులతో పాటు నవతరం కార్మికులకూ ప్రయోజనం కలిగిస్తాది. కార్మికులను కాపాడడం, సాధికారులను చేయడం, పని ప్రదేశంలో ఉత్పాదకతకు సహకారిగా మార్చడం ప్రధానం. శరవేగంగా పారిశ్రామిక అభివృద్ధి, పని అనియతీకరణ, అధిక కాంట్రాక్ట్ కార్మికులు, ఇ–కామర్స్, లాజిస్టిక్స్‌లతో కార్మిక విపణి వైవిధ్యంగా మారింది. రాష్ట్రాలలో కార్మిక చట్టాల నిర్వచనాల అతివ్యాప్తితో , బహుళ సమ్మతులు, తనిఖీలు, విభిన్న వివరణలతో విచ్ఛిన్నమైన కార్మిక చట్టాలను సరళీకృతం చేసి, సమన్వయం చేసి ఆధునీకరించడం ద్వారా ఉద్యోగాలను సృష్టించడం సులభతరం చేశాయి. అవి సామాజిక భద్రతను నిర్ధారిస్తాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక సామరస్యాన్ని కాపాడుతాయి.

**అమర్‌జీత్ కౌర్:** భారతదేశంలోని కార్మికులు కార్మిక చట్టాల కోసం 19వ శతాబ్దం నుంచి పోరాడారు. పని గంటలు, వేతనాలు, పని ప్రదేశాల్లో భద్రత, సామాజిక భద్రత గురించి ఈ పోరాటాలు జరిగాయి. కార్మికుల పోరాటాల ఫలితంగా 20వ శతాబ్దంలో మనకు కార్మిక సంఘాల చట్టం – 1926, కార్మికుల పరిహార చట్టం – 1923, మరిన్ని ఇతర చట్టాలు వచ్చాయి. కార్మికులను వలసవాద మనస్తత్వం నుండి విముక్తి చేయాలనుకుంటున్నట్లు, అందుకే అది కార్మిక కోడ్‌లను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. భారతదేశంలోని కార్మిక సంఘాలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, సంఘటితమయ్యే చట్టబద్ధమైన హక్కును పొందాయి. కార్మిక కోడ్‌లు ఈ హక్కులను కార్మికుల నుండి లాగేసుకుంటాయి. వాస్తవానికి మనల్ని వలసరాజ్యాల యుగానికి తీసుకువెళతాయి. ఉదాహరణకు, ఈ కోడ్‌లు రెగ్యులర్ ఉద్యోగాలు వంటి అంశాలపై అధికారాలను కేంద్రీకృతం చేసి రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను రద్దు చేస్తాయి. ఈ కోడ్‌లు నిర్ణీత–కాల ఉద్యోగాలను చట్టబద్ధం చేసి, ఇష్టరీతిలో ఉద్యోగులను పెట్టుకోవడం, తొలగించే విధానాన్ని ప్రోత్సహిస్తాయి. మేము క్రమబద్ధమైన (రెగ్యులర్) ఉద్యోగాలను కోరుకుంటున్నాము. ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంలో , ఉద్యోగాలను సృష్టించడంలో ప్రభుత్వం విఫలమైంది. గౌరవప్రదమైన ఉద్యోగాలను సృష్టించే సత్తా లేకుండా పోయింది. చట్టాలను అమలు చేయడం కష్టంగా ఉందని యాజమాన్యాలు పదే పదే అంటుండగా, లేబర్ కమిషన్ ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నయా ఉదారవాద ఆర్థిక యుగంలో రెండవ లేబర్ కమిషన్ తన నివేదికను ఎ.బి.వాజ్‌పేయి ప్రభుత్వానికి సమర్పించింది. కానీ, నివేదికలో సానుకూల సూచనలను విస్మరించి, నిర్ణీత – అవధి ఉద్యోగాలు(ఫిక్స్‌డ్ టైమ్ ఎంప్లాయిమెంట్) వంటి యాజమాన్యాల హితమైన సూచనలను మాత్రమే కోడ్‌లలో పొందుపరిచారు. చివరిసారిగా 2015లో జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సి)లో కార్మిక సంఘాలను సంప్రదించకుండా ఏ చట్టాన్ని సవరించబోమని ప్రధాన మంత్రి వాగ్దానం చేశారు. అఖిల భారత స్థాయిలో ఆ విధంగా జరగలేదు. రూపకల్పన దశలో ఏ కార్మిక సంఘాన్నీ భాగస్వామిని చేయలేదు. ప్రభుత్వం ఈ కోడ్‌లను పూర్తిగా అప్రజాస్వామిక పద్ధతిలో ముందుకు తెచ్చింది.

*ప్రశ్న : లేబర్ కోడ్‌లు పెట్టుబడులను ఆకర్షిస్తాయనేది ప్రభుత్వ వాదన. పారిశ్రామిక, కార్మిక చట్టాలలో మార్పుల ద్వారాపెట్టుబడులు ఆకర్షించబడతాయా?*



**ముకుందన్:** ఇది విధాన స్థిరత్వం, ముందస్తు ఊహాగానానికి సంకేతం. నేడు మనం కేవలం భారతదేశంలోనే పోటీ పడడం లేదు. మనం ఇతర దేశాలతో కూడా పోటీ పడుతున్నాం. వియత్నాం, దక్షిణ కొరియా వంటి దేశాల నియంత్రిత వాతావరణాన్ని మన దేశంతో పోల్చుకొని మరింత మంది అంతర్జాతీయ పెట్టుబడిదారులు పోటీ పడేవిధం గా ఈ చట్టాలు ఉంటాయి. ఎలాంటి చట్టాలు అనుసరించాలి, వేటిని అమలు చేయాలి, ఎలాంటి ఖర్చులు ఎదురవుతాయి, వంటి విషయాలు తెలిసాక కంపెనీలు దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకుంటా యి. రాష్ట్రాల వ్యాప్తంగా ఒకే విధంగా ఉండ డం, డిజిటల్ ఫైలింగ్స్, వివాదాల కుదింపు, సరళత వంటి అంశాలు భారతదేశాన్ని తయారీ, సప్లయ్ చెయిన్‌లకు ఆకర్షణీయ ప్రదేశంగా మారుస్తాయి. మౌలికవనరులు, నైపుణ్యాలు, పన్నువిధానాలు వంటి అనేక ఇతర అంశాలపై పెట్టుబడులు ఆధారపడి ఉంటాయి. కానీ, అందులో కార్మికులు ముఖ్యమైన భాగం.

**అమర్‌జీత్ కౌర్ :** మన స్వంత దేశంలోనే పరిస్థితి అస్థిరంగా, కార్మికులు అసంతృప్తిగా ఉన్నప్పుడు పెట్టుబడులు ఆకర్షింపబతాయని నేను భావించడం లేదు. బీమా రంగం, ఇతర రంగాలలో ప్రభుత్వం 100 శాతం ప్రత్యక్ష విదేశ పెట్టుబడుల (ఎఫ్‌డిఐ)ను అనుమతించిన తరువాత ఎంత ఎఫ్‌డిఐ వచ్చింది? టారిఫ్ యుద్ధంతో ఇప్పటికే మనం నష్టపోవడం ప్రారంభమైంది. ఒకవేళ అమెరికా ద్వైపాక్షిక ఒప్పందంపై భారతదేశం సంతకం చేస్తే, అది నయా వలస విధానానికి మార్గం వేసినట్లు అవుతుంది.

*ప్రశ్న : ఈ కోడ్‌లతో సామాజిక భద్రతను మెరుగుపడడం లేదా విస్తరించడం సాధ్యమా? మన పరిశ్రమలు కార్మికుల కోసం లేదా కార్మికులకు సహాయపడే కార్పస్ వైపు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయి?*

**ముకుందన్ :** ప్రస్తుతం సామాజిక భద్రతా వలయం ప్లాట్‌ఫామ్, గిగ్ వర్కర్లు, చిన్న సంస్థలలోని అసంఘటిత కార్మికులు,నిర్ణీత–కాల ఉద్యోగులను చేర్చేలా విస్తరించబడుతున్నది. కొత్త కోడ్‌ల కింద 40 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రతను పొందే అవకాశం ఉంది. కంపెనీల పరిమాణంతో పాటు,ఒక రంగం నుంచి మరో రంగంలో సంసిద్ధత మారుతూ ఉంటుంది. సంఘటిత రంగ కంపెనీలు ఎక్కువ సన్నద్ధంగా ఉన్నాయి. అమలు ప్రక్రియ పరంగా మేము ఎంఎస్ఎంఇలతో చాలా దగ్గరగా పని చేస్తున్నాము.

**అమర్‌జీత్ కౌర్:** ప్రస్తుతం మన సామాజిక భద్రతా పథకాలు వాటి స్వంత పాలనా పద్ధతిలోనే వ్యాప్తి చెందే యంత్రాంగాన్ని కలిగి ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ నిధులు లేవు. ఈ పథకాలకు దోహదపడేది యజమానులు, ఉద్యోగులు మాత్రమే. ఈ సమస్యపై ప్రభుత్వం మాతో చర్చించి మా సలహాలను తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న పథకాలను సామాజిక భద్రతా కోడ్‌లో కలిపేస్తున్నారు.

భారతదేశంలో నేడు ఎంత మంది సామాజిక భద్రత పరిధిలోకి వస్తున్నారు? 7 శాతం వరకు మాత్రమే. ఈ కొత్త చట్టాలు మిగతా 93 శాతం కార్మికులను వాటి పరిధిలోకి తీసుకురాలేవు. అనియత ఆర్థికవ్యవస్థ కార్మికులలో గిగ్ కార్మికులు ఒక చిన్న భాగం మాత్రమే. అనియత ఆర్థిక వ్యవస్థలోని కార్మికులందరికీ భద్రత అవసరం. అందరికీ సామాజిక భద్రత ఒక ఎండమావిగా ఉంది. నిర్ణీత కాల ఉద్యోగం అనేది ఉద్యోగ భద్రత భావనను నిర్వీర్యం చేస్తుంది. కార్మిక సంఘాలను బలహీనపరుస్తుంది.

*ప్రశ్న : కోడ్‌లు కార్మికుడు–యజమాని సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయా?*

**ముకుందన్:** ఏదైనా సంస్కరణ పని సంబంధాలలో కొన్ని మార్పులను తెస్తుంది. కొన్ని వర్గాలు వాటిని కొంచెం భయంతో చూస్తాయి. వారి గొంతులను వినడం ముఖ్యమని నేను భావిస్తున్నాను. ప్రాథమికంగా, మనం పురోగతి సాధించాలి, మార్పులను స్వీకరించాలి. వీటిలో అన్ని షిఫ్టులలో మహిళలను నియమించడం, నిర్ణీత – కాల ఉద్యోగం, కొన్ని నియామకాలు, తొలగింపు వంటి ఆరంభాలున్నాయి. కోడ్‌లు నోటీసు వ్యవధిని పటిష్టం చేస్తాయి. అవి తొలగింపు (రిట్రెంచిమెంట్) పరిహారాన్ని మెరుగుపరుస్తాయి. కృత్రిమ మేధస్సు(ఎఐ) రాకతో అనేక పరిశ్రమలు నేడు భారీ మార్పులకు గురవుతున్నందున ఎదుర్కొంటున్నందున అవి నైపుణ్య నవీకరణకు నిధులను సృష్టిస్తాయి.

**అమర్‌జీత్ కౌర్:** కోడ్‌లు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించబోవు. పారిశ్రామిక శాంతిని తీసుకురావడానికి బదులుగా, అవి పారిశ్రామిక అశాంతిని సృష్టించే అవకాశం ఉంది. సమష్టి బేరసారాలు వంటి హక్కులకు కోడ్‌ల కింద రక్షణలేదు. యజమానులు, ఉద్యోగులు కలిసి కూర్చోవాలి, అందుకే ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ అవసరం. దీన్ని నిర్వహించాలని యాజమాన్య సంస్థలు ప్రభుత్వాన్ని కోరేందుకు ఇది సరైన సమయం.

*ప్రశ్న : కనీస వేతనాలు దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్. దీనిపై ఎస్.పి.ముఖర్జీ కమిటీ ఇంకా తన నివేదికను సమర్పించలేదు. కాబట్టి, కోడ్‌లు ప్రాథమిక కనీస వేతనాలకు సహాయపడతాయా?*

**ముకుందన్ :** వివిధ ప్రాంతాలు, వివిధ పరిశ్రమలకు సంబంధించి సూక్ష్మమైన అభిప్రాయ భేదాలు ఉన్నాయి. అందువల్ల ఆందోళన అమలు గురించి తప్ప సూత్రానికి సంబంధించి కాదు. మనం జీవన వేతనాలు(లివింగ్ వేజెస్) అని పిలిచే దానిపై ముఖ్యంగా ఆందోళన ఉంది. నా అభిప్రాయం ప్రకారం, ఇది ప్రాంతాల వారీగా జీవన వ్యయంలో వైవిధ్యాలను, అలాగే సంబంధిత ప్రాంతాలలో రంగాల వారీగా తేడాలను ప్రతిబింబించాలి. ఇవి ముఖ్యమైన సూక్ష్మ భేదాలు, అవి ఉత్పాదకతతో కూడా కొంత అనుసంధానమై ఉండాలి. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను సర్దుబాటు చేయడం ముఖ్యం. ఇందుకు ఉపయోగించే పద్ధతి స్పష్టంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలి, అప్పుడది అది వివాదాలకు దారితీయదు.

**అమర్‌జీత్ కౌర్ :** కనీస వేతన హామీలను వేతనాల కోడ్ పలుచన చేసింది. అది కనీస జీవన వేతనాన్ని నిర్ధారించే బదులు ఫ్లోర్ లెవల్ వేతనాన్ని నిర్ణయించే అధికారాన్ని కేంద్రానికి ఇచ్చింది. మన శ్రామిక శక్తిలో ఎంత భాగం దీని పరిధిలోకి వస్తుంది? దాదాపు 90 శాతం మంది శ్రామిక శక్తికి కనీస వేతనాలు అందడం లేదు. ఇప్పుడు మరింత ఎక్కువ మంది కనీస వేతన పరిధికి దూరం చేయబడతారు. ఎందుకంటే వృత్తి భద్రత, ఆరో గ్యం, పని పరిస్థితుల కోడ్ ప్రకారం, ఫ్యాక్టరీకి లైసెన్స్ పొందేందుకు పరిమితిని విద్యుత్‌తో పనిచేసే ఫ్యాక్టరీలో కార్మికుల కనీస పరిమితిని 10 నుంచి 20 మందికి, విద్యుత్ లేని వాటిలో 20 నుంచి 40 మంది కార్మికులకు పెంచారు. ఇది కనీస వేతన చట్టం పరిధి నుండి చాలామంది కార్మికులను మినహాయిస్తుంది.

*('ది హిందూ' ఆంగ్ల దినపత్రిక సౌజన్యంతో)*

---

# 'స్థానిక' ఎన్నికలు – ప్రజాస్వామ్యానికి పునాది!



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

దేశానికి పట్టుకొమ్మలు పల్లె సీమలే. గ్రామాలు అభివృద్ధి జరిగితే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుంది. ఢిల్లీకి రాజు అయినా తల్లికి కొడుకే అన్నట్లు దేశానికి రాజధాని ఢిల్లీ అయిన ప్రజాస్వామ్యానికి పునాది గ్రామమే. అలాంటి గ్రామాల్లో నేడు పరిపాలన చేసే నాయకుడి ఎన్నికలు జరుగుతున్నాయి. స్థానిక ఎన్నికలు అనేవి కేవలం ఓట్లు కాదు, అభివృద్ధి దిశలో గ్రామాలు, పట్టణాలు తీసుకునే నిర్ణయాల మూలాధారం. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తరచూ జాతి, మతం, పార్టీల భావజాలం ఆధారంగా ఓటు వేసినా, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించే నాయకుడికి ఓటు వేయడం మన దేశ ప్రజాస్వామ్యం విశిష్టత. గ్రామ పంచాయితీ నుంచి మున్సిపాలిటీ, కార్పొరేషన్ వరకు – చెత్త నిర్వహణ, తాగు నీరు,రవాణా సౌకర్యం, రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజ్, స్థానిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి నిత్యజీవిత సమస్యలకు ప్రత్యక్షంగా బాధ్యత వహించే నిర్మాణం ఇవే. కాబట్టి ప్రజల జీవితాల్లో నిజమైన మార్పులు ఈ ఎన్నికల ద్వారానే కనిపిస్తాయి. ఈ ఎన్నికలు అయిదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంటాయి. పౌరులూ కూడా తమ పాత్రను మరవకూడదు. ఓటు వేసి బాధ్యత పూర్తయిందనే భావన ప్రమాదకరం. అభివృద్ధి పనుల అమలు పర్యవేక్షణ, ప్రజా ప్రతినిధులను ప్రశ్నించడం, హక్కులు డిమాండ్ చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయి. స్థానిక ఎన్నికలు మన గడప దగ్గర ప్రజాస్వామ్యం. పార్టీ జెండా చూసి కాదు, పనులు చేసే వారిని చేసినవారిని చూసి ఓటు వేయాలి. ప్రలోభాలకు దూరంగా ఉంటూ ఓటు విలువ కాపాడాలి. గ్రామం, మన పట్టణం, మన కాలనీ అభివృద్ధి ఏదైనా అంటే మన ఓటు విలువను మనమే పెంచుకోవాలి. పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రమేయం ఉండొద్దనే ఉద్దేశంతోనే ఆయా పార్టీ గుర్తులపై కాకుండ జనరల్ సింబల్స్ పై ఎన్నికలను నిర్వహిస్తున్నారు. ప్రజలు కూడా గ్రామాల్లో రాజకీయాలను పక్కనబెట్టి అందుబాటులో ఉండే, సేవ చేయగలడన్న నమ్మకం ఉన్న వ్యక్తులకే మద్దతు ఇవ్వాలి. పార్టీ రంగువారిని కాదు, పని చేసినవారిని ఎంపిక చేసే సంస్కృతి ఏర్పడాలి. వాళ్ల పార్టీ – మన పార్టీ అన్న కోణం నుంచి బయటకు వచ్చి, మన ప్రాంతం – మన భవిష్యత్ అనే దృష్టితో ఆలోచిస్తేనే అభివృద్ధి సా ధ్యం.

ప్రజలు కూడా తమ పాత్రను గుర్తుంచుకోవాలి. ఓటేసి ఇంటికెళ్లిపోవడం పనికాదు. ఆ అభ్యర్థి ఇచ్చిన హామీలు, చేస్తా అన్నా పనులు గుర్తుపెట్టుకుని ఉండాలి. అభివృద్ధి పనుల్లో లోపాలు కనిపించినప్పుడు ప్రశ్నించాలి, వివరాలు అడగాలి, డిమాండ్ చేయాలి.

ఎన్నుకున్న తర్వాత నాయకులను అడగని ప్రజాస్వామ్యం, ఎంత శక్తివంతమైనా బలహీనంగానే మారిపోతుంది.స్థానిక ఎన్నికలు ప్రజాస్వామ్యానికి మూలాలు. మూలాలు బలపడితేనే చెట్టు బలంగా పెరుగుతుంది. కాబట్టి ఓటు వేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి ఓటు వేయాలి.యువత స్థానిక ఎన్నికల్లో పోటీకి ముందుకు రావాలి.చదువుకున్న విజ్ఞానవంతులు స్థానిక ఎన్నికల్లో గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం. పనిచేసే వారికి మాత్రమే మా ఓటు.ప్రలోభాలకు మేము దూరం అంటూ డబ్బు, మద్యంతో ఓట్లను తాకట్టు పెట్టకుండా మన ఓటును నీతితో వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఆ ఆలోచన మన గ్రామాన్ని,మన పట్టణాన్ని, మన భవిష్యత్తును రక్షిస్తుంది.

## ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/దోమ : సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ మోసాలపై దోమ మండల పరిధిలోని కెజిబివి పాఠశాలలో పరిగి డివిజన్ సబ్‌కమిటీ షీ టీం ఇన్‌ఛార్జి నర్సింలు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాఎస్ఐ వసంత్ జాదవ్, ఎఇఇ వెంకట్ మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని అన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై షీటీం నెంబర్ 181పై అవగాహన కల్పించడం జరిగింది. ఆన్‌లైన్ మోసాలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు సావిత్రి, శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్‌ను సన్మానించిన నాయకులు



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : అఖిల భారత యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, యాదవ సంఘం అధ్యక్షులు రాజబోయిన యాదగిరి యాదవ్‌లు పాల్గొని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను శాలువాతో సన్మానించి, ఫోటోలో బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడపోల్ల మల్లేష్, ఎస్సీసెల్ అధ్యక్షులు శ్రీనివాస్, పోచారం మున్సిపల్ కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ శనివారం తెలంగాణ మంత్రుల నివాసంలో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిశారు. ప్రకాశ్‌నగర్, బేగంపేట్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃఅభివృద్ధి ప్రణాళికపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బండి రమేష్, విశాల్ సూదంతో కలిసి ఆలయ అభివృద్ధి ప్రతిపాదన పత్రాన్ని మంత్రికి సమర్పించారు. ప్రణాళికను సమీక్షించిన మంత్రి కొన్ని మార్పు చేర్పులను సూచించారు. అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపునకు సంబంధించి ఎండోమెంట్స్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, ఎండోమెంట్స్ మంత్రి కొండ సురేఖతో ఈ విషయంలో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు సదాశివం, శేఖర్ గురుస్వామి, వి.చిరంజీవి, కృష్ణరావు (బాల) తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

* కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్
* రూ. 55 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటి శామీర్‌పేటలో వీరభద్ర స్వామి ఆలయం ముందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శంకుస్థాపన చేశారు. అంతకు ముందు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైనందున తోటకూర వజ్రేష్ యాదవ్‌కు కాంగ్రెస్ శ్రేణులు శాలువ కప్పి ఘన స్వాగతం పలికారు. వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తూంకుంట మున్సిపల్‌లో ఉన్న అన్ని వార్డులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నిధులను మంజూరు చేశామని చెప్పారు. శామీర్‌పేటలో రూ. 55.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటి మెంబర్ మహ్మద్ ముజుబుద్దీన్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్, శామీర్‌పేట మండల ప్రధాన కార్యదర్శి చౌట్టపల్లి నర్సింగరావు, కట్టమైసమ్మ ఆలయ చైర్మన్ మహేందర్‌యాదవ్, మూడుచింతపల్లి మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, ఎఎంసి డైరక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాపక్షం/ఉప్పల్ : నిత్యం యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా మనుషుల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గి మానసిక ప్రశాంతత ఏర్పడి శారీరకంగా కూడా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం రామంతాపూర్ అరోరా పిజి కళాశాలలో ఇండియన్ యోగ ఫడరేషన్ తెలంగాణ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అరోరా పిజి కళాశాల సెక్రటరీ డాక్టర్ నిమ్మటూరి రమేష్‌తో



కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు ఒక జీవన విధానం కూడా. గత 40 సంవత్సరాలుగా తాను కూడా రోజు యోగా సాధన చేస్తున్నానని దాని ఫలితంగానే ప్రజాప్రతినిధిగా రాష్ట్ర శాసనసభాపతి హోదా లో వచ్చే ఒత్తిడిని కూడా యోగ సాధన ద్వారానే తగ్గించుకుంటున్నానని అన్నారు. యోగ అనేది ఒక మతానికో, ప్రాంతానికో సంబంధించినది కాదని ఇది అందరిదని యోగాసనాలతో ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చడంతో అందరూ యోగాను ఆచరించవచ్చునన్నారు. గత కొన్నేళ్లుగా అమెరికా యూరప్ గల్ఫ్ దేశాల్లోని ప్రజలు కూడా యోగాసనాలు ప్రాక్టీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యోగ అసోసియేషన్ అధ్యక్షుడు రవి స్వామి ప్రధాన కార్యదర్శి బ్రిజ్ భూషణ్ పురోహిత్ కోశాధికారి నిత్యానంద్, తెలంగాణ యోగా టీచర్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దొడ్ల సత్యారెడ్డి, దత్తాత్రేయరావు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన కుటుంబాలకు బొండాడా అండ

విసి సజ్జనార్




ప్రజాపక్షం/చర్లపల్లి: దేశ రక్షణకోసం అహర్నిశలు కృషి చేసి ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలనే గొప్ప సంకల్పంతో బొండాడా గ్రూపు ముందుకు రావడం హర్షణీయమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ అన్నారు. బొండాడా గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొండాడా రాఘవేంద్రరావు జన్మదినం సందర్భంగా శనివారం సైనిక్‌పురి బ్రిగేడియర్ ఎంకె రావు మెమోరియల్ హాలులో ఎక్ ఇండియా, ఎక్ మిషన్ సహకారంతో 51 మంది సాయిధ దళాల అనువజ్ఞులు, వీరనారీలను సజ్జనార్, ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డిలు హాజరై సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఎస్ కుమార్, మాజీ లెఫ్టినెంట్ జనరల్ కెఆర్ రావు,కెఆర్‌రావు, వివి లక్ష్మి నారాయణ, మాజీ రియర్ అడ్మిరల్ శ్రీనివాస్, బొండాడా గ్రూప్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి



ప్రజాపక్షం/ఉప్పల్ : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల దొంతుల వెంకటరామిరెడ్డి అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ రామంతపూర్ లో జర్నలిస్టులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే జర్నలిస్టులకు ఎలాంటి సదుపాయాలు కలగడం లేదన్నారు.

అక్రిడేషన్ కార్డుల విడుదలపై జాప్యం చేయడం తగదన్నా రు. ఆరోగ్య స్కీం, ఇండ్లపట్టాల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. మధ్యతరగతి చెందిన కుటుంబాలకు చెందినవారే జర్నలిజంలో ఎక్కువగా ఉన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభు త్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డిసెంబర్ 3న చేపడుతున్న ధర్నా కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద సంఖ్య లో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యాజే మేడ్చల్ జిల్లా హెల్త్ కమిటీ కన్వీనర్ కొలనుపాక చంద్రమౌళి, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు పల్ల మహేందర్ రెడ్డి, జర్నలిస్టులు సురేష్ ధూపాటి, వేముల తిరుపతిరెడ్డి, మునుకుంట్ల అశోక్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సిఐ భాస్కర్‌రెడ్డి

ప్రజాపక్షం/చర్లపల్లి: విద్యార్థులు క్రమశిక్షణ, విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. కుషాయిగూడ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించిన ఖేల్ ఖూద్‌ను కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు, కుషాయిగూడ, ఉప్పల్, ఆల్విన్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, కూకట్ పల్లి, దుండిగల్, ఫతే నగర్ పాఠశాలల నుండి 200 మంది విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, లంగ్‌జంప్, హైజంప్ క్రీడల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు డిసెంబర్ 12,13వ తేదీల్లో భాగ్యనగర్ విభాగ్ స్థాయి పోటీలలో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, వెంకన్న, విజయ్,స్కూల్ జిల్లా ఉపాధ్యక్షులు ధూళిపాల కాశీ విశ్వనాథం, కార్యదర్శి భగంత్‌చారి, పాఠశాల ప్రధానాచార్యులు రాధిక, కమిటీ సభ్యులు సత్యనారాయణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు

ప్రజాపక్షం/చర్లపల్లి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలంగాన సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణి అన్నారు.కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిరక్షణలో భాగంగా శనివారం చర్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీతో పాటు పది కాలనీల్లో కాలనీవాసులతో కలసి బస్తీబాట నిర్వహించారు. చీఫ్ ఇంజనీర్ కామేష్, హబ్సిగూడ విద్యుత్ సూపరిండెంటెంట్ ఆఫ్ ఇంజనీర్ వెంకన్నతో కలసి విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిరక్షేందుకు 24 గంటల పాటు తమ సిబ్బంది పనిచేస్తూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైనిక్‌పూరి డివిజన్ డిఇ అన్వర్‌పాషా, చర్లపల్లి డిఇ రాందాస్, ఎఇ బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి రెండవ విడుత నమినేషన్లు

ప్రజాపక్షం/వికారాబాద్ : నేటి నుండి రెండవ విడుత నమినేషన్లు మొదలవుతాయని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్, మర్పల్లి, మోమిన్‌పేట్, కోట్‌పల్లి, బంట్వారం, నవాబ్‌పేట్, వికారాబాద్ లో రెండవ విడుత నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఏడు మండలల్లో అన్ని ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. ఉదయం 10.30నుండి సాయత్రం 5గంటలకు వరకు స్వీకరించడం జరుగుతుందని, ఎన్నికలపై ఎలాంటి సందేహలు ఉన్న నివృత్తి చేసుకోవడానికి 84162 35291 హైల్ప్ లైన్ అందుబాటులో ఉంటుందని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాద్యతతో పని చేయాలని వారికీ సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదేశించారు.

## ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



ప్రజాపక్షం/శామీర్‌పేట:ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఎస్ కె అంజా మ్ కోటేబర్వ్ (21) గత కొంతకాలంగా అలియాబాద్ చౌరస్తా వద్ద ఉన్న డైమండ్ కేఫ్ హోటల్‌లో కుక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని ముగించుకుని విశ్రాంతి కోసం మజీద్‌పూర్‌లోని బావర్చి హోటల్లోని లేబర్ రూమ్‌లోకి వెళ్లాడు. కాగా శుక్రవారం సాయంత్రమైన హోటల్లో పనికి రాలేదని ఫోన్ చేసిన స్పందించకపోవడంతో తోటి పనివారు హోటల్ వద్ద ఉన్న రూమ్‌కు వెళ్లి పిలిచారు. ఎంత పిలిచిన ఫలితం లేకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా అంజామ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మేడ్చల్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.




## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధన తొలగించాలి : టియుటిఎఫ్

ప్రజాపక్షం/నవాబుపేట్ : సర్వీస్ లో ఉన్న టీచర్లకు టెట్(టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్) తప్పనిసరి చేస్తూ ఇటీవల ప్రభుత్వం తెచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ రెడ్డి, బి.సుదర్శన్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నవాబ్ పేట్ మండలంలో సంఘ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించి మండలంలోని పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు చించల్ పేట్, అక్నాపూర్, నారెగూడ, గంగ్యాడ, ఎల్లకొండ, లింగంపల్లి, పుల్ మామిడి, నవాబుపేట్ బడులను సందర్శించి ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టెట్ ఏర్పాటుకు (2011) ముందే నియామకమైన ఉపాధ్యాయులకు, అంతకుముందు లేని కొత్తగా ఏర్పాటు అయిన టెట్ పరీక్ష రాయమనడం విడ్డూరమైనదని ఉపాధ్యాయ లోకం, సమాజం విస్తూ పోయేలా ఉందని కావున సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష మినహాయింపు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పాత సమస్యలు తీరక పోగా ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని పిర్సీ రిపోర్ట్ వెంటనే తెప్పించి అమలు చేయాలని, సీపీఎస్, 317 ఉపాధ్యాయులకు సరైన న్యాయం చేయాలని ,హెల్త్ కార్డ్స్ వంటి ఉపాధ్యాయుల ప్రాథమిక సమస్యలను ప్రజా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు దేవయ్య,జిల్లా బాధ్యులు వీరయ్య, అనిల్ కుమార్, ప్రదీప్ కుమార్,అంజయ్య, సుధాకర్ గౌడ్, గోపాల్, నవాబుపేట్ మండల అధ్యక్ష కార్యదర్శులు మహిపాల్, జనార్ధన్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం

ప్రజాపక్షం/మల్కాజిగిరి : మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్‌గూడ ప్రాంతంలోని ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారం లభించింది. విద్యార్థులు గత కొద్ది కాలంగా ఎదుర్కొంటున్న నీటి సమస్య గురించి తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు జలమండలి జనరల్ మేనేజర్ సునీల్‌ను కల్సి సమస్య పరిష్కరించాలంటూ సూచించిన మేరకు ఆ విభాగ లైన్ ఇనస్పెక్టర్ సంజీవ్,వర్క్ ఇనస్పెక్టర్ మహేందర్‌లు పాఠశాలకు వెళ్లి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో పాటు పాఠశాల సమీపంలో విద్యార్థుల రాకపోకల దృష్ట్యా రహదారిపై స్పీడ్ బ్రేకర్లను సైతం ఏర్పాటు చేసారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గ, కాంగ్రెస్ శ్రేణులు మంద భాస్కర్,జాన్వీ,రాములు,పాషా,స్వామి, పుష్ప,జిహెచ్ఎంసి డిఈ మహేష్, ఏఈ మధురిమ తదదితరులు పాళశాలను సందర్శించిన వారిలో ఉన్నారు.








## ప్రభుత్వ పరమైన ఫలాలు పొందడం మీహక్కు

పౌరహక్కుల దినోత్సవంలో తాల్క రాములు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్: ప్రభుత్వ పరమైన ఫలాలు పొందడం మీహక్కు సమాజంలో వివక్ష రోజురోజుకు కొత్త రూపు సంతరించుకుంటుందని విజిలెన్స్ కమిటీ మెంబర్ తాల్క రాములు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని అంకుషాపూర్ గ్రామంలోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవిన్యూ అధికారి ఆర్ఐ కావ్యరెడ్డి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ కావ్యరెడ్డి మాట్లాడుతూ చదువు లేక ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన లేక ఎన్నో ప్రభుత్వ పథకాలకు ఎస్సీ, ఎస్టీ ప్రజలు దూరమవుతున్నారని భరత రాజ్యాంగం నందు పొందుపరచిన పథకాలు పొందడం కూడా మీ హక్కుగా భావించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి ధన్య నాయక్,జీపీవో శ్రావణ్,విఆర్ఏ మేడబోయిన బాలరాజు,జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పోటాపోటీగా నామినేషన్లు

ముగిసిన మొదటి విడత నామినేషన్ల పర్వం



ప్రజాపక్షం/తాండూరు: గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల పర్వానికి గడువు ముగిసింది. తాండూరు నియోజకవర్గం లోని తాండూరు, యాలాల, పెద్దేముల్, బషీరాబాద్ మండలాలకు గాను మొదటి విడత కింద సర్పంచ్, వార్డుల సభ్యుల ఎన్నికలకు గాను ఈ నెల 27 నుండి 29వరకు పంతాయతీల వారీగా భారీగా నామినేషన్‌లను ఆయా సెక్టర్‌లో రిటర్నింగ్ అధికారులు స్వీకరించారు. నామినేషన్ల దాఖలుకు శనివారం చివరి రోజు కావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద భారీగా అభ్యర్థులు బారులు తీరారు. సాయంత్ర 5గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ల్ కేంద్రాల వద్ద బారులు తిరిన అభ్యర్థులకు మాత్రమే నామినేషన్ల పత్రాలు దాఖాలుకు అవకాశం కల్పించారు. ఆ సమయం దాటిన వారికి లోపలికి అనుమ తించమని అధికారులు వెల్లడించారు. నామినేషన్ దాఖలుకు చివరి రోజు కావడంతో శనివారం రాత్రి 8గంటల వరకు నామినేషన్ల పత్రాలను స్వీకరించారు. రిజ్వర్డు గ్రామ పంచాయతీ స్థానాలకు మినహా జనరల్ కేటాగిరికి కేటాయించిన సర్పంచ్ స్థానాలకు భారీగా నామినేషన్లను దాఖాలు చేశారు. అభ్యర్థులకు నచ్చచెప్పడానికి గ్రామాలలోని ప్రధాన పార్టీల నేతలు తీవ్రంగా కృషి చేసిన ఫలించ లేదు. దీంతో ఒకే పార్టీకి చెందిన పలువు అభ్యర్థులు ఆయా గ్రామాలలో సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచ్ స్థానాలకు నామినేషన్ల పర్వం ముగియడంతో గ్రామాలలో అప్పుడే బుజ్జగింపుల పర్వం ప్రారంభమైంది. నామినేషన్ల విత్ డ్రా కోసం పైరవీలు, భారీగా నజరానాలు అందించడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు పావులు కదుపుతున్నా రు. మరో పక్క పెద్దేముల్ మండల పరిధి కందనెల్లి తాండ నుండి సర్పంచ్ అభ్యర్థిగా రమావత్ శాంత తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. రమావత్ శాంతకు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తన మద్దతు ప్రకటించారు.

## మెజార్టీ స్థానాలు హస్తగతం

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు నియోజకవర్గంలో మెజార్టీ సర్పంచ్ స్థానాలు హస్తగతం అవ్వడం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా శనివారం తాండూరు, పెద్దేముల్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామం నుండి సర్పంచ్ అభ్యర్థిగా జనార్దన్ రెడ్డి, సంగెంకలాన్ గ్రామం భాగ్యల, కొత్లాపూర్ గ్రామం నుండి పటోళ్ల లతల నామినేషన్ల కార్యక్రమం లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



పాల్గొనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలే అభ్యర్థులకు ప్రచార అస్త్రాలని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికే మేజార్టీ స్థానాలు ఏకగ్రీవం అయినట్లు పేర్కొన్నారు. ఏక గ్రీవమైన గ్రామ పంచాయతీల అభివృద్ధి రూ.10 నుండి 20ల క్షలవరకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మెజార్టీ గ్రామాలలో ప్రతిపక్షాలకు అభ్యర్థులు లేక పోటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్యనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, డిసిసి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.




## బానయ్యకు సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల నివాళులు

ప్రజాపక్షం/దమ్మాయిగూడ: సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్(ఎఐటియూసి)వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సిటిజన్ నాయకులు బుపెల్లి బానయ్య సంతాప సభలో పలుపురు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సభ్యులు హజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బానయ్య మరణం రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటిజన్లకు తీరని లోటని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు రాంచందర్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందర్ వేణు మాధవ్, జివి రాజిరెడ్డి, ఉమాకర్, విజయ్‌బాబు, నర్సింగ్ రావు, జయంత్‌కుమార్, రాజనర్సు, లక్ష్మి నారాయణ, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉన్నంత కాలం 'కెసిఆర్' పదాన్ని ఎవరూ తుడిచివేయలేరు

### బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ :** తెలంగాణ ఉన్నంత కాలం కెసిఆర్ అనే పదాన్ని ఎవరూ తుడిచివెయ్యలేరని బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షాదివస్ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కెసిఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే కఠిన దీక్ష చేయడం వలన ఈరోజు తెలంగాణ రాష్ట్ర సిద్ధించిందని పాలకుల దయా దక్షిణాల మీద తెంగాణ రాలేదని కెసిఆర్ పోరాటల ఫలితంగానే రాష్ట్రం సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రమేష్, మాజీ సర్పంచులు మాజీ కౌన్సిర్, పార్టీ నాయకులు ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు అకౌంట్ల బుక్కులు డిసెంబర్ 5వరకు ఇవ్వవచ్చు : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలంలోని గ్రామాలలో నామినేషన్లు స్వీకరించబడతాయని ఎంపిడిఒ వెంకయ్యగౌడ్ తెలిపారు. శనివారం ఎంపిపి సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు కొత్తవి తెరిచి డిసెంబర్ 5వరకు ఇవ్వవచ్చని చెప్పారు. పోస్ట్ ఆఫీస్, గ్రామీణ కోఆపరేటివ్ బ్యాంకుల్లో కూడా పోటీ చేసే అభ్యర్థులు ఖాతాలు తెరవవచ్చని తెలిపారు. కుల ధ్రువీకరణపత్రం నేడు తహసిల్ ఆఫీసులో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ సురేందర్, సిఐ శ్రీనివాస్‌గౌడ్, ఎంపిఓ గిరిరాజు, సూపరిండెంట్ గోపాలకృష్ణ, ఆర్వో, ఎఆర్ఒ, గ్రామపంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### జిల్లా అదనపు జడ్జి స్వాతిరెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులు విద్యతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని షాద్‌నగర్ 16వ జిల్లా అదనపు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ స్వాతిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో డిల్లీ వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వార్షికోత్సవానికి హాజరై నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు జడ్జి స్వాతిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వాతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందన్నారు. విద్యతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు రక్షణ చట్టం, బాల్య వివాహాల చట్టం, సీనియర్ సిటిజన్ చట్టాలపై న్యాయ అవగాహన పెంచుకోవాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా నేర్చుకుంటే విద్యార్థుల భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈడెన్‌ప్లాజా-యువైసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఈడెన్‌ప్లాజా యువైసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి రోడ్లపై నిద్రిస్తున్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రోడ్లపై నిద్రిస్తున్న యాచకులే కాకుండా నిరుపేదలకు సైతం దుప్పట్లు పంపిణీ చేసేందుకు ఈ ఫౌండేషన్ సిద్దంగా ఉన్నట్లు వివరించారు. రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతూ చలికి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న వారికి దుప్పట్లు అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్ముందు ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువైసి ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సోహైల్, కోశాధికారి అబ్దుల్ ముతలిబ్ జామి, ఉపాధ్యక్షుడు అక్రమ్, వంశీ, ఈడెన్ ప్లాజా నిర్వాహకులు జైద్ అబ్దుల్లా, కైసర్‌సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తి దీక్షా దివస్




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** దీక్షా దివస్ సందర్భంగా శంకర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలు మండల, మున్సిపాలిటీ బిఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాను శనివారం ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 29 తేదీ తెలంగాణ చరిత్రలో ఒక చారిత్రాత్మక దినమన్నారు. ఉద్యమ సారథి, మన నాయకులు మాజీ సి ఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ చచ్చుడు అనే నినాదంతో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్న రోజు నవంబర్ 29 అని అన్నారు. ఈ దీక్ష తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక మలుపుగా నిలిచిందని గుర్తు చేశారు. దీక్షా దివస్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన రోజు అని అన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు జి. గోవర్ధన్ రెడ్డి, శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, మాజీ ఎంపి పి డి. గోవర్ధన్ రెడ్డి, శంకర్ పల్లి మాజీ సర్పంచ్ బి సొల్ల శ్రీధర్ శంకర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు నాయక్,, మండల బి ఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మన్నె లింగం ముదిరాజ్, మహారాజ్ పేట్ గ్రామ మాజీ సర్పంచ్ దోసాడ నరసింహారెడ్డి, మాజీ ఎంపి టి సి దయాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, పార్శి బాలకృష్ణ, జొన్నాడ మోహన్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలతోనే అభివృద్ధి

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** స్థానిక సంస్థల ఎన్నికలతోనే పాలకవర్గం ఏర్పడి గ్రామ పంచాయతీలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నందిగామ మండలం మామిడిపల్లి, మొదళ్ళగూడ, శ్రీనివాసులగూడ గ్రామ పంచాయతీల్లో అభ్యర్థులకు నామినేషన్ పత్రాలను అందించారు. ముందుగా ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో మూడు గ్రామాల సర్పంచ్ అభ్యర్థులతోపాటు వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్సీ చేతుల మీదుగా అభ్యర్థులకు అంధించారు. అక్కడి నుండి ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకొని తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి అంధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంచాయతీల ఎన్నికలు నిర్వహిస్తుండటం సంతోషమన్నారు. మూడు గ్రామ పంచాయతీలలో తాను ప్రతిపాధించిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రవీందర్, సింగిల్ విండో డైరెక్టర్ యాదగిరిరెడ్డి, చంద్రారెడ్డి, ఉడుత సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, నేతలు పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రకాష్, రాజు, క్రాంతిలు పాల్గొన్నారు.

# 'కెబిఆర్'లో ఆటోమేటెడ్ స్మార్ట్ కార్ పార్కింగ్ ప్రారంభం

### ప్రారంభించిన గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జిహెచ్‌ఎంసి మరో ముందడుగు వేసింది. కెబిఆర్ పార్క్ వద్ద ఆటోమేటెడ్ స్మార్ట్ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సౌకర్యాన్ని శనివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి, స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్‌లతో కలిసి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రపంచంలో వేగంగా పెరుగుతున్న మెట్రో నగరాల్లో ఒకటిగా నిలుస్తోందని, నగర సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. వాటిలో భాగంగానే ఆధునిక మల్టీ లెవెల్ రోటరీ పార్కింగ్ వ్యవస్థను జిహెచ్‌ఎంసి అనుమతించిందన్నారు. నవ నిర్మాణ్ అసోసియేట్స్ కేవలం ఆరు నెలల్లోనే ఈ నిర్మాణం పూర్తి చేయడం ప్రశంసనీయం అని మేయర్ అభినందించారు. తక్కువ స్థలంలో ఎక్కువ కార్లు పార్క్ చేసుకునే ఈ సౌకర్యం వాహనదారులకు, పాదచారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. నగరంలోని పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ కేంద్రాలు వంటి రద్దీ ప్రదేశాల్లో ఇలాంటి మరిన్ని పార్కింగ్ స్థలాలు పిపిపి మోడ్‌లో నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఎంపి అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలత కూడా ఈ పార్కింగ్ సౌకర్యం నగరానికి ఎంతో అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

### సమస్యల పరిష్కారానికి మేయర్ బస్తీ బాట

క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్న లక్ష్యంతో మేయర్ విజయలక్ష్మి శనివారం బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఉదయ నగర్, రోడ్ నెంబర్ 13, ప్రేమ్ నగర్, శ్రీరామ్ నగర్, సింగడి కుంట ప్రాంతాల్లో ఆమె అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్న మేయర్, పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రూ.8కోట్ల వ్యయంతో చేపట్టబోయే సిసి రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. పనులను వెంటనే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆమె సూచించారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

### జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ వేణుగోపాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి అభివృద్ధి, పురోగతిలో ఉద్యోగుల సేవలు కీలకమని అదనపు కమిషనర్ కె. వేణుగోపాల్ అన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో పదవీవిరమణ పొందిన 11 మంది అధికారులు, ఉద్యోగులను శాలువా కప్పి, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. పదవీవిరమణ ప్రయోజనాలకు సంబంధించిన పత్రాలను అందచేశారు. నగర అభివృద్ధికి వారందరూ చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. వారి కట్టుబాటు, అనుభవం ముందుకు నడిపించేందుకు కీలకంగా నిలిచిందన్నారు.




# నగర వ్యాప్తంగా రోడ్డు సేఫ్టీ డ్రైవ్ వేగవంతం





### 21,511 గుంతల మరమ్మతులు పూర్తి చేసిన బల్దియా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో ట్రాఫిక్ జామ్‌లు తగ్గించడం, పౌరుల ప్రయాణం సజావుగా సాగేందుకు జిహెచ్‌ఎంసి రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌ను ముమ్మరం చేసింది. కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ నేరుగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 28 వరకు నగరంలో మొత్తం 22,797 గుంతలు గుర్తించగా, వాటిలో 21,511 గుంతలు పూడ్చివేయడం పూర్తి చేశామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 1,019 క్యాచ్ పిట్స్ రిపేర్లు, 494 కవర్ రీప్లేస్‌మెంట్‌లు, 13 సెంట్రల్ మీడియన్ మరమ్మత్తులు కూడా పూర్తి చేశామన్నారు. జోన్‌ల వారిగా గుంతల పూడ్చివేత వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్.బి. నగర్ జోన్ – 3,828, చార్మినార్ జోన్ – 2,885, ఖైరతాబాద్ జోన్ – 3,785, శేరిలింగంపల్లి జోన్ – 2,656, కూకట్‌పల్లి జోన్ – 3,217, సికింద్రాబాద్ జోన్ – 5,140, మొత్తం 21,511 గుంతలకు మరమ్మతులు పూర్తి చేశారు. నగరంలో రోడ్ల మరమ్మత్తులు, ప్యాచ్ వర్క్, క్యాచ్ పిట్ రిపేర్లు నిరంతరంగా కొనసాగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

# పొరపాట్లు జరగకుండా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

### కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ లో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం వైల్కుంట తాండలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను వివిధ శాఖల చెందిన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కందుకూర్ మండలం వైల్కుంట తాండలో డిసెంబర్ 8,9వ తేదీలలో గ్లోబల్ సమ్మిట్ కు వివిధ ప్రాంతాల,దేశాల నుండి డెలిగేట్స్ వస్తున్న సందర్భంగా విమానాశ్రయం నుండి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతం వరకు రోడ్లు పరిశుభ్రంగా ఉండాలని, గ్లోబల్ సమ్మిట్ నిర్వహించే ప్రాంతంలో పారిశుద్ధం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అధికారి తమ విధులను బాధ్యతతో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. .రోడ్లపై ఎక్కడ ఎలాంటి చెత్త, గుంతలు లేకుండా, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, కందుకూర్ ఆర్‌డిఒ జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌అండ్‌బి అధికారులు, నేషనల్ హైవే అధికారులు, సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్విట్చెకో నుంచి 'సస్టైనబిలిటీ ఆన్ వీల్స్' వాహనం ప్రదర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాజిక, పర్యావరణ రంగాలలో సరికొత్త ఆవిష్కరణలకు చిరునామాగా నిలుస్తున్న స్విట్చెకో సంస్థ, 'సస్టైనబిలిటీ ఆన్ వీల్స్' అనే వినూత్న వాహనాన్ని స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (ఎస్‌పిసిబి) అధికారుల ముందు విజయవంతంగా ప్రదర్శించింది. స్విట్చెకో వ్యవస్థాపకుడు అక్షయ్ దేశ్‌పాండే, సహస్థాపకులు నాగరాజ్ యాదవ్, శ్రీనివాస మూర్తి, దిలీప్, అశుతోష్ ఇతర సపోర్ట్ టీమ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వెనుకబడిన భీమారం గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ప్రజలందరు సహకరించి అవకాశం ఇవ్వాలని భీమారం సర్పంచ్ అభ్యర్థి జోష్న రాఘవేందర్ గౌడ్ కోరారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం సర్పంచ్ అభ్యర్థిగా జోష్న రాఘవేందర్‌గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి జోష్న మాట్లాడుతూ పేద ప్రజలు పెట్టుకున్న కలలను నిజం చేసేందుకు శక్తివంచన లేకుండా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి..అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే నామినేషన్ వేసినట్లు వివరించారు.

# ఉత్సాహంగా దివ్యాంగుల ఆటల పోటీలు

### ప్రారంభించిన జిల్లా మహిళా, శిశు,వికాలంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీలత

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ఇంచార్జ్ సంక్షేమ శాఖ అధికారి ఎల్.శ్రీలత కార్యక్రమానికి హాజరై పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందజేశారు. చెస్, క్యారం, రన్నింగ్, షార్ట్ పుట్, జావలిన్ త్రో వంటి పోటీల్లో విభాగాల వారీగా అంధులు, బధిరులు, శారీరక, మానసిక దివ్యాంగులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి సంక్షేమ అధికారి శ్రీలత మాట్లాడుతూ దివ్యాంగుల మానసిక వికాసానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. దివ్యాంగులు సకలాంగులతో సమానంగా తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించడానికి ఇది మంచి అవకాశమన్నారు. హాజరైన సుమారు 600మంది దివ్యాంగులు వివిధ అంశాలలో, వారి మానసిక స్థైర్యానికి మరియు ధైర్యానికి పోటీలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. వచ్చేనెల మూడవ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయిలోని వివిధ దివ్యాంగుల సంఘాల వారు, వసతిగృహాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ సూపర్‌వైజర్లు, సంక్షేమ శాఖ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిపిఆర్ఒ వెంకటేశంకు ఘనసన్మానం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సి.వెంకటేశంకు ఘనసన్మానం చేశారు. శనివారం ఐడిఓసిలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో టిజిఓస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి, సంగీత, రంగారెడ్డి జిల్లా టిజిఓస్ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి పిసి వెంకటేశం 38 సంవత్సరాల సర్వీస్‌ను విజయవంతంగా పూర్తి చేసుకొని పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా జిల్లా ఐడిఓసిలోని మీటింగ్ హాల్‌లో ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా టీజీవోస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి, టిజిఓస్ ఉపాధ్యక్షులు నూతనకంటి వెంకట్, అలివేలు, శాంతి శ్రీ, రేవతి, రాకేష్, సైదమ్మ, లక్ష్మణ్ స్వామి, మసూద్ అలీ, లక్ష్మణ్ గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.








# ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి

### రంగారెడ్డి జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది తప్పక ఉంటుందని రంగారెడ్డి జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సి.ప్రభాకర్ అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పంచాయతీ శాఖ అధికారి కార్యాలయంలో 4వ తరగతి ఉద్యోగిగా పని చేస్తు పదవీ విరమణ పొందుతున్న ఎన్.అశోక్ కుమార్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా సమితి తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని, వృత్తిలో ఉన్నప్పుడు చేసిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయన్నారు. శేష జీవితాన్ని సుఖమయంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం సంఘం జిల్లా నాయకులు రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# నేడే తొలి వన్డే..



వన్డేల్లో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పంత్.. హింట్స్ ఇచ్చిన కెప్టెన్ కె.ఎల్.రాహుల్

భారత–దక్షిణాఫ్రికా మధ్య నేటి నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానున్నది. రాంచీ వేదికగా నేడు (ఆదివారం) తొలి మ్యాచ్ జరుగనున్నది. మధ్యాహ్నం 1.30 గంటలకు జెఎస్‌సిఎ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్‌లో మ్యాచ్ మొదలు కానున్నది. ఈ మ్యాచ్‌లో స్టార్ వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్‌కు తుది జట్టులో స్థానంపై కెప్టెన్ కేఎల్ రాహుల్ స్పష్టతనిచ్చాడు. పంత్ జట్టులో వికెట్ కీపర్‌గా మాత్రమే కాకుండా స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఆడే సామర్థ్యం ఉదని వ్యాఖ్యానించాడు. ఆగస్టు 2024లో శ్రీలంక పర్యటన తర్వాత పంత్ వన్డేలు ఆడలేదు. దాంతో పంత్‌కు తుది జట్టులో చోటుపై అనిశ్చితి కొనసాగుతుంది. పంత్ జట్టుకు విలువైన ఆటగాడని రాహుల్ ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో తెలిపాడు. 'రిషబ్ గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉండాలని వచ్చింది. కానీ, అతను చాలాకాలం జట్టుతో ఉన్నాడు. అతను ఏం చేయగలడో అందరికీ తెలుసు. కొన్నిసార్లు ఆటగాళ్లు జట్టులోకి వచ్చే అవకాశం వేచి ఉండాల్సి ఉంటుంది' అని పేర్కొన్నాడు. పంత్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉంటే, వికెట్ కీపింగ్ చేస్తాడని.. ఆ సమయంలో తాను కేవలం ఫీల్డింగ్ మాత్రమే చేస్తానని రాహుల్ చెప్పుకొచ్చాడు. రిషబ్ కేవలం కీపర్ మాత్రమే కాదని.. అతనో గొప్ప బ్యాట్స్‌మెన్ అంటూ చెప్పాడు. దాదాపు రెండేళ్ల తర్వాత మళ్లీ వన్డే జట్టులోకి వచ్చిన రుతురాజ్ గైక్వాడ్‌పై సైతం రాహుల్ ప్రశంసలు కురిపించాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్‌తో పాటు రుతురాజ్ ఓపెనింగ్ పోటీపడుతున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికా ఏతో జరిగిన మ్యాచ్‌లో రాణించాడు. గైక్వాడ్ ఓ క్లాస్ ప్లేయర్ అని.. తనకు అవకాశం లభించిన ప్రతిసారీ తనను తాను నిరూపించుకున్నాడని తెలిపాడు. దురదృష్టవశాత్తు భారత టాప్‌ఆర్డర్ చాలా బలంగా ఉండని.. స్థిరపడటంతో చాలామంది ఆటగాళ్లకు చోటు దక్కలేదని రాహుల్ తెలిపాడు. తాజాగా ప్లేయర్లు గాయాల బారినపడటంతో అతనికి మళ్లీ ఆడే అవకాశం దక్కిందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడని ఆశిస్తున్నట్లు చెప్పాడు. అతని నైపుణ్యంపై ఎలాంటి సందేహం లేదని.. అతనికి సరైన అవకాశం అవసరమని చెప్పుకొచ్చాడు. ఇదిలా ఉండగా.. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టుల్లో ఘోర పరాజయం పాలైంది. టెస్ట్ సిరీస్‌ను 0-2 తేడాతో ఓడిపోయింది. తాజాగా వన్డేల్లోనైనా రాణించి పరువు కాపాడుకోవాలని యోచిస్తుంది.

**భారత జట్టు :** కేఎల్ రాహుల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్ ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్.

**దక్షిణాఫ్రికా జట్టు :** టెంబా బావుమా (కెప్టెన్), ఐడెన్ మార్క్రామ్, డెవాల్డ్ బ్రెవిస్, నాండ్రే బర్గర్, క్వింటన్ డి కాక్, మార్కో జాన్సెన్, టోనీ డి జోర్జి, రూబిన్ హెర్మన్, ఒట్నీల్ బార్ట్‌మన్, కార్బిన్ బాష్, మాథ్యూ బ్రీట్జ్కే, కేశవ్ మహారాజ్, లుంగి ఆర్ ఎన్గిడి, రియాన్ రికెల్టన్, ప్రేనెలన్ సుబ్రాయెన్.

## ఫైనల్లో శ్రీకాంత్.. తన్వీకి చుక్కెదురు



ప్రతిష్ఠాత్మక సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్‌లో కిడాంబి శ్రీకాంత్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో భారత్‌కే చెందిన మిథున్ మంజునాథన్‌ను ఓడించి టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఈ టోర్నీలో సంచలన విజయాలతో వార్తల్లో నిలిచిన యువ షట్లర్ తన్వీ శర్మకు మాత్రం చుక్కెదురైంది. మరో భారత అమ్మాయి ఉన్నాటి హుడా సైతం సెమీఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. సయ్యద్ మోడీ ఇంటర్నేషన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ జోరు కొనసాగుతోంది. తొలి రౌండ్ నుంచి చెలరేగి ఆడుతున్న అతడు.. సెమీస్‌లోనూ విజృంభించగా మితున్ మంజునాథన్ చేతులెత్తేశాడు. తొలి సెట్ 21–15తో గెలుపొందిన శ్రీకాంత్‌కు మితున్ గట్టిపోటీనిస్తూ రెండో సెట్ కైవసం చేసుకున్నాడు. కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో మాత్రం మాజీ ఛాంపియన్ ధాటికి మితున్ నిలువలేకపోయాడు. 21–13తో చివరి సెట్ గెలుపొందిన శ్రీకాంత్ టైటిల్ పోరులో తనకంటే తక్కువ ర్యాంకర్ జేసన్ గునవాన్‌ను ఢీకొట్టనున్నాడు. ఈ టోర్నీలో నమ్మశక్యంకాని ఆటతో ప్రత్యర్థులకు చెక్ పెట్టిన తన్వీ శర్మ సెమీస్‌లో తడబడింది. క్వార్టర్స్‌లో సిన్ యాన్ హ్యాపీని ఓడించిన తను హీనా హాకేచి చేతిలో 17–21, 16–21తో ఓటమి పాలైంది. అతికష్టమ్మీద సెమీస్ బెర్తు సాధించిన ఉన్నాటి.. 15–20, 10–21తో టర్కీ షట్లర్ నెలిషాన్ అర్న్ చేతిలో కంగుతిన్నది. అంతకంటే ముందు జరిగిన మహిళల డబుల్స్ సెమీస్‌లో భారత ద్వయం త్రీసా జాలీ, గాయత్రీ గోపిచంద్ అదరగొట్టింది. మలేషియా జంట ఓంగ్ గ్జిన్ యీ, కర్మెన్ టింగ్‌ను 21–11, 21–15తో మట్టికరిపించింది.

## కెనడాపై గోల్స్ వర్షం..

### తొమ్మిదోసారి ఫైనల్లో టీమిండియా!



మలేషియా వేదికగా జరుగుతున్న సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో ఆదరగొడుతున్న భారత హాకీ జట్టు ఫైనల్ చేరింది. లీగ్ దశ నుంచి గోల్స్ వర్షంతో ప్రత్యర్థులకు చెక్ పెడుతూ వచ్చిన టీమిండియా కెనడాను భారీ తేడాతో చిత్తు చేసింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో డిఫెండర్లు, ఫార్వర్డ్స్ సమిష్టిగా రాణించగా 14–3తో ప్రత్యర్థిని ఓడించి రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. ఇప్పటికే ఐదుసార్లు విజేతగా నిలిచిన టీమిండియా.. ట్రోఫీ కోసం ఆదివారం బెల్జియంతో తలపడనుంది. ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో భారత జట్టు 14–3తో కెనడాను చిత్తు చిత్తుగా ఓడించింది. శనివారం ఆట ఆరంభమైన నాలుగో నిమిషంలోనే నీలకంఠ శర్మ గోల్ అందించాడు. కాసేపటికే రాజేందర్ సింగ్ గోల్ సాధించాడు. 2–0తో టీమిండియా ఆధిక్యంలో ఉండగా.. 11వ నిమిషంలో కెనడా ప్లేయర్ బ్రెండన్ గురాలిక్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. అయితే.. ప్రత్యర్థికి షాకిస్తూ ఫార్వర్డ్ ఆటగాళ్లు జుగురాజ్ సింగ్, అమిత్ రోహిదాస్‌లు తలొక గోల్ చేయగా తొలి అర్ధభాగంలో భారత్ 4–1తో ఆధిక్యం కనబరిచింది. రెండో క్వార్టర్స్‌లోనూ టీమిండియా ఆటగాళ్లు జోరు చూపించారు. మూడో అర్ధ భాగంలో కెనడా మరో గోల్ చేసినా అప్పటికే భారత్ 9–2తో ముందంజలో ఉంది. 56వ నిమిషంలో సంజయ్, 57, 59 నిమిషాల్లో అభిషేక్ రెండు గోల్స్‌తో మెరిశాడు. దాంతో.. 14–3తో కెనడాను మట్టికరిపించిన భారత్ ఫైనల్లో అడుగుపెట్టింది. లీగ్ దశలో బెల్జియం చేతిలో కంగుతిన్న హర్మన్‌ప్రీత్ సింగ్ సేన ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో ఉంది. 1985, 1991, 1995, 2009, 2010లో ఛాంపియన్‌గా కప్‌ను అందుకున్న భారత్.. 2008, 2016, 2019 ఎడిషన్లలో మాత్రం రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

# ఫోకస్




## 'మ్యూలెన్‌లోవ్' హ్యాట్రిక్

మన దేశంలో, మహిళలకు అనుకూలమైన టాప్ 100 కంపెనీల జాబితాలో మ్యూలెన్‌లోవ్ లింటాస్ గ్రూప్ ఇండియా వరుసగా మూడోసారి చోటు దక్కించుకొని, హ్యాట్రిక్ నమోదు చేసింది. అవ్‌తార్ అండ్ సెరమౌంట్ ప్రకటించిన జాబితాలో మ్యూలెన్‌లోవ్‌కు స్థానం లభించడం అనేది లింగ వైవిధ్యం, మహిళల నాయకత్వం, సమాన అవకాశాలు, ఇన్‌క్లూజన్‌పై కంపెనీ చేస్తున్న కృషిని ప్రతిబింబిస్తుంది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఈ సంస్థలో 47 శాతం మంది మహిళలే. జెండర్–న్యూట్రల్ పేరెంటల్ లీవ్ పాలసీ, క్రెచ్ సౌకర్యాలు, హైబ్రిడ్ వర్క్ ఆప్షన్స్, వెల్–బీయింగ్ ప్రోగ్రామ్స్, విద్యా స్కాలర్‌షిప్స్ వంటి సపోర్టివ్ విధానాలు ఈ విజయంలో కీలకం. నియామకాలు, నిలుపుదల, నాయకత్వ అవకాశాలు, వర్క్–లైఫ్ బ్యాలెన్స్ వంటి అంశాలపై కంపెనీలను పరిశీలిన తర్వాత, మెరుగైన ఫలితాలను రాబట్టిన కంపెనీలను ఈ జాబితాలో చేరుస్తారు.



### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 85,706.67 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 85,382.02 పాయింట్లు. లాభం 324.64 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్‌ఎస్‌ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 26,202.95 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 26,109.45 పాయింట్లు. లాభం 92.9 పాయింట్లు)

### బులియన్ మార్కెట్లు

ఈ వారం కూడా బంగారం ధరలు పెరిగాయి. గ్రాము బంగారం 24 క్యారెట్లు రూ. 12,584 నుంచి రూ. 12,982కు, అదే విధంగా 22 క్యారెట్లు రూ. 11,535 నుంచి రూ. 11,900క, 18 క్యారెట్లు రూ. 9,438 నుంచి రూ.9,737లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి నెలకొని ఉన్న నేపథ్యంలో మదుపరులు రక్షణాత్మక పెట్టుబడులకు బంగారాన్ని ఎంచుకుంటున్నారు. అదే సమయంలో మత పరమైన విశ్వాసాలు, పండుగ సీజన్ బంగారం ధర పెరగడానికి కారణమవుతున్నాయి. మరికొంతకాలం ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



## చైనా దూకుడు..

అమెరికా వివాదాస్పద నిర్ణయాలు, అర్థం లేని విధానాలతో సమస్యలను కొనితెచ్చుకుంటుండగా, అన్ని విభాగాల్లోనూ అగ్రరాజ్యానికి గట్టిపోటీనిస్తున్న చైనా దూకుడును పెంచింది. అధికారికంగా ఇంకా వెలువడనప్పటికీ, రాబోయే పంచవర్ష ప్రణాళిక చైనాను అధునాతన సాంకేతికత, పరిశ్రమ, రక్షణ రంగాల్లో మరింత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంపై దృష్టి పెట్టినట్టు సమాచారం. అమెరికా–చైనా సంబంధాలు ఉద్రిక్తతల నడుమ సాగుతున్న సమయంలో, ఇటీవల ఈ రెండు దేశాలు తీసుకున్న నిర్ణయాలు అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీస్తున్నాయి. అక్టోబర్ 30న బుసాన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య వాణిజ్య వివాదాలపై తాత్కాలిక ఒప్పందం కుదిరినా, దీర్ఘకాలిక సంబంధాలపై స్పష్టత ఇంకా లేదు. తీసుకున్న నిర్ణయాలు అమలుపై ఎలాంటి ప్రకటన లేదు. కాగా, ఇదే సమయంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ బీజింగ్‌లో నిర్వహించిన నాలుగవ ప్లీనమ్‌లో తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ శక్తిసమీకరణల భవిష్యత్తును ప్రభావితం చేసేలా ఉన్నాయి. ఈ సమావేశంలో సిద్ధమైన 15వ పంచవర్ష ప్రణాళిక చైనాను మరింత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడం ఖాయమని అంటున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా పరిస్థితి మరింత గందరగోళంగా మారుతున్నది. చైనా ఇక చౌక ఉత్పత్తుల కేంద్రం కాకుండా, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు (ఎఐ), రోబోటిక్స్ వంటి రంగాల్లో ప్రపంచ నాయకత్వాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. సాంకేతిక స్వావలంబన'ను దేశ భవిష్యత్తుకు ప్రధాన బలంగా పరిగణిస్తూ, పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) పెట్టుబడులను భారీగా పెంచేందుకు ఈ ప్రణాళిక దోహదపడనుంది. ప్రణాళికలో అమెరికా పేరు లేకపోయినా, జిన్‌పింగ్ చేసిన వ్యాఖ్యలు స్పష్టంగా అమెరికాను లక్ష్యంగా చేసిన వ్యూహాన్ని సూచిస్తున్నాయి. అంతర్జాతీయ పోటీ తీవ్రతరమవుతోందని, చైనా ఎవరిపైనా ఆధారపడదని ఆయన స్పష్టం చేశారు. ఎఐ, 5జి, సౌరశక్తి, బ్యాటరీలు, బుల్లెట్ రైళ్లు, డ్రోన్‌లు వంటి రంగాల్లో చైనా అమెరికాకు ప్రత్యక్ష సవాల్ విసురుతోంది. అమెరికాలో శాస్త్రీయ పరిశోధనలపై నిధుల కోతలు, వీసా పరిమితులు పెరుగుతున్న నేపథ్యంలో, చైనా కొత్తగా ప్రవేశపెట్టిన 'కె' వీసా ద్వారా విదేశీ శాస్త్రవేత్తలను ఆకర్షిస్తున్నది. గ్లోబల్ టాలెంట్‌ను చైనా వైపు మళ్లించే ఈ ప్రయత్నం, సాంకేతిక ఆధిపత్య పోటీలో కీలకంగా మారనుంది. అమెరికాలో పెరుగుతున్న అంతర్గత రాజకీయ విభేదాలు, అంతర్జాతీయ సంస్థలపై మద్దతు తగ్గిపోవడం, సాంకేతిక రంగంలో పెట్టుబడులు తగ్గడం వంటి పరిస్థితులను చైనా వ్యూహాత్మక అవకాశాలుగా మార్చుకోవాలనుకుంటోంది. ఆగ్నేయాసియాలో పోర్టులు, రైళ్లు, ఎలక్ట్రికల్ వాహనాల ఫ్యాక్టరీలు, సౌరశక్తి ప్రాజెక్టులతో చైనా తన ప్రభావాన్ని వేగంగా విస్తరిస్తోంది. బలమైన ప్రణాళికలు, ప్రభుత్వ వ్యూహాత్మక దిశ, దేశీయ ఐక్యత వంటి లక్షణాలు చైనాను అమెరికాకు ప్రధాన పోటీదారుగా నిలబెడుతున్నాయి. ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తున్నాయి. వాణిజ్య, వ్యాపార రంగాల్లో చైనాను అగ్రగామిగా నిలిపేందుకు నూతన పంచవర్ష ప్రణాళికలోని అంశాలు దోహదం చేస్తాయని అంటున్నారు.

## రాఘవాపురం సర్పంచ్‌గా కోటమ్మ

### రెండోసారి సిపిఐ అభ్యర్థి ఏకగ్రీవం



**ప్రజాపక్షం/చింతకాని :** ఖమ్మం జిల్లా రాఘవాపురం గ్రామ సర్పంచ్‌గా సిపిఐ అభ్యర్థిని కాంపల్లి కోటమ్మ ఎన్నిక ఏకగ్రీవం అయింది. సర్పంచ్ ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో గ్రామంలో ఎస్సీ మహిళ కాంపల్లి కోటమ్మ ఒక్కరే ఉండటంతో సిపిఐ అభ్యర్థిని ఎన్నిక లాంచనమైంది. శనివారం కోటమ్మ సర్పంచ్ అభ్యర్థిగా ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. గ్రామంలో ఎనిమిది వార్డులకుగాను సిపిఐ అభ్యర్థులు 1వవార్డు సింగారపు నాగమ్మ, 3వ వార్డు కు మేడా రాజేశ్వరి, 4వ వార్డుకు కాంపల్లి రమేష్, 5వ వార్డుకు అబ్బూరి మహేష్, 6వ వార్డుకు వడ్లమాని రాంబాబు, 7 వవార్డుకు వడ్డె నిరోష ఒక్కొక్కరుగా నామినేషన్ దాఖలు చేయడంతో వీరి ఎన్నిక కూడా ఏకగ్రీవం కానుంది. సర్పంచ్ అభ్యర్థి కోటమ్మను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అభినంధించారు. రాఘవాపురం గత సర్పంచ్ ఎన్నికల్లో కూడా సిపిఐ అభ్యర్థి కొండపర్తి గోవిందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొల్లి గోవిందరావు, దొబ్బల వెంగళరావు, సింగారపు సత్యనారాయణ, అబ్బూరి మహేష్, కొల్లి రవి, కొండపర్తి బాలాజీ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యునిస్టులతోనే గ్రామాల్లో అభివృద్ధి

### సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల



**ప్రజాపక్షం/చింతకాని :** కమ్యూనిస్టులతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చింతకాని మండలంలో నామినేషన్ చివరిరోజు రాఘవాపురం, చిన్నమండవ గ్రామాల సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాల్లో జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ చిన్నమండవ గ్రామసర్పంచ్‌గా పర్చా రామచంద్రరావును గెలిపించి గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రజలను కోరారు కార్యక్రమంలో సిపిఐ రాఘవాపురం సర్పంచ్ అభ్యర్థి కాంపల్లి కోటమ్మ, నాయకులు కొల్లి గోవిందరావు, దొబ్బల వెంగళరావు, సింగారపు సత్యనారాయణ, కొండపర్తి బాలాజీ, కొల్లి రవి, అబ్బూరి మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## చెల్పూరు సర్పంచ్ బరిలో సిపిఐ అభ్యర్థి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా దోర్నాల లలిత నామినేషన్ దాఖలు చేశారు. శనివారం మొదటి దశ నిర్వహించే ఎన్నికలకు చివరి రోజు కావడంతో సిపిఐ నాయకులు చెల్పూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్‌గా అదే విధంగా 9, 10, 11 వార్డ్ మెంబర్లు గా నామినేషన్లు వేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటే విధంగా అధిక సర్పంచులు, వార్డు మెంబర్లను గెలిపించుకునేందుకు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుజపల్లి సుధాకర్ రెడ్డి, సిపిఐ నాయకులు మోటపలుకుల రమేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజు సతీష్, మాతంగి రామచందర్, వేముల శ్రీకాంత్, తాళ్ల పోషం ప్రేమ్ రమేష్ సముద్రాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ ఎన్నికల్లో సమష్టి కృషితో

## అధిక స్థానాలు కైవసం చేసుకుందాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా సమష్టి కృషితో అధిక స్థానాలు కైవసం చేసుకోవడానికి సిపిఐ శ్రేణులు సమాయత్తం కావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం ముఖ్యకార్యకర్తలతో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలో సిట్టింగ్ స్థానాలను పదిలం చేసుకోవడంతో పాటు మరిన్ని స్థానాలు గెలుపొందేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి, విజయానికి ప్రతీ కార్యకర్త ప్రజాక్షేత్రంలో పనిచేయాలని కోరారు. ప్రతీ స్థానం నుంచి పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేవిధంగా చూడాలన్నారు. నామినేషన్ల అనంతరం ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, సంక్షేమ పథకాలపై వివరించి ఓట్లు అడగాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఇతర పార్టీలతో సర్దుబాటు, పొత్తులపై చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, బలమున్న చోటా పోటీ చేసేందుకు సిద్ధం కావాలని కూనంనేని తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, జి వీరస్వామి, భూక్యా ధస్రు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా పోటీ : ప్రసాద్

**ప్రజాపక్షం/ములకలపల్లి:** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయితీలలో కలిసికట్టుగా పోటీ చేయనున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య,మాస్‌లైన పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూపా భాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ పేదవారికి అండా, దండగా ఒక్క ఎర్ర జెండా మాత్రమేనని, మండల వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి కిషోర్, ముదిగొండ రాంబాబు, పోతుగంటి లక్ష్మణ్, కోర్స రామకృష్ణ, గౌరి నాగేశ్వరరావు, రవికుమార్, రావుజా, పి వెంకటేశ్వర్లు, మధు, అమల, నారాటి రమేష్, సిహెచ్ వెంకటేశ్వర్లు, సాయి, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధికి సిపిఐని ఆదరించాలి



### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి పిలుపు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** గ్రామాభివృద్ధికి సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆధరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కోరారు. మహబూబాద్ మండలంలోని ముడుపుగల్, దామ్య తండ గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా అయోధ్య ముడుపుగల్ దామ్య తండా వార్డులకు శనివారం సిపిఐ బలపర్చిన అభ్యర్థులు నామినేషన్ వేశారు. అనంతరం ముడుపుగల్‌లో ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ కార్యక్రమానికి విజయసారథి హాజరై మాట్లాడుతూ ముడుపుగల్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా తండా సందీప్, దామ్య తండా సర్పంచ్‌గా బానోత్ లింగ్య నాయక్‌లను గెలిపించాలని ప్రజలను కోరారు. ముడుపుగల్ అయోధ్య ధామ్య తండా తండా వార్డు మెంబర్లుగా సిపిఐ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధి రెడ్డి, వార్డుల అభ్యర్థులు తేజావత్ వినయ్, పొలగాని అరుణ్, తండా శ్రీనాథ్, బర్ల స్వరూప వీరన్న, బానోత్ సుమన్, కట్లోజు పాండురంగాచారి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి , వరిపల్లి వెంకన్న, మేక వీరన్న, ఎండి ఫాతిమ, జలగం ప్రవీణ్, తండ మల్లయ్య, పోలగాని శ్రీనివాస్, శ్యామ్, తేజ శ్రీనివాస్, తండ సతీష్, శేఖర్, తేజావత్ విజయ్, గురుస్వామి, పీర్నాక అప్పయ్య, మంద శంకర్, ముదుసు రాణి, సరిత పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగులుగా

## సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు

### సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్ డిమాండ్




**ప్రజాపక్షం/నర్సంపేట :** సివిల్ సప్లై హమాలీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలో సంఘం అధ్యక్షుడు బక్కెర కిషోర్ ఆధ్వర్యంలో హమాలీ కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మునీశ్వర్ మాట్లాడుతూ హమాలీ కార్మికులకు క్వింటాల్‌కు 45 రూపాయలు ఇవ్వాలని కోరారు. ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాదాలు జరిగినట్లయితే కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, నూతన గోదాములు నిర్మించి పనిభద్రత కలిగించాలని, గుర్తింపు కార్డులు అందించాలని, పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఇల్లందుల సాంబయ్య, బక్కెర కిషోర్, తుప్పది వీరస్వామి, బయటి ఐలయ్య, కావడి మల్లయ్య, తుప్పది కుమార్, రాయరాకుల సతీష్, దేవుళ్ల పెళ్లి అనిల్, ముద్ర బోయిన మహేందర్, కొలువుల సాంబయ్య, గండ మాలయాక స్వామి, చిలువేరుబాబు పాల్గొన్నారు.

## సిపిఐలో చేరిన మీరాసాహెబ్



**ప్రజాపక్షం/బోనకల్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు కోరారు. మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో షేక్ మీరాసాహెబ్ సిపిఐలో చేరారు. వారికి తోట రామాంజనేయులు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ముష్టికుంట్ల గ్రామంలో ఐదో వార్డు సిపిఐ అభ్యర్థిగా షేక్ మీరాసాహెబ్ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యంగాల ఆనందరావు, ఆకెన పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కర్‌రావు, బోయనపల్లి బసవయ్య పాల్గొన్నారు.

### వార్డుల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు

**భద్రాచలం :** సిపిఐ బలపరిచిన అభ్యర్థులు 5వ వార్డుకు జెట్టి రమాదేవి, 16వ వార్డుకు పితాని హెబ్సిబా, 19వ వార్డులో ఇర్పా మహేష్ నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ, మీసాల భాస్కర్‌రావు, కిలారు కొండబాబు, కంభంమెట్టు శ్రీనివాస్, గుంజా రామారావు,సాధనపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.







# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఆసుపత్రిని ప్రారంభించిన సినీ నటుడు అలీ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో శనివారం ప్రముఖ కమెడియన్ సినీ నటుడు అలీ సందడి చేశారు. జడ్చ ర్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఆసుపత్రిని ప్రారంభించడానికి ప్రముఖ కమెడియన్ సినీ హీరో అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆసుపత్రి యజమాన్యంతో కలిసి ఆసుపత్రిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నటుడు అలీ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా జడ్చర్ల పట్టణానికి తాను రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. జడ్చర్ల పట్టణంలో ఆసుపత్రి ప్రారంభించడానికి అలీ వచ్చారన్న విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు, అభిమానులు, నూతన ఆసుపత్రి వద్దకు చేరుకుని అలీతో సెల్ఫీ దిగడానికి ఎగబడ్డారు. దీంతో పోలీసులు అలీకి రక్షణ కల్పించి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టారు.

## నామినేషన్ స్వీకరణ క్లస్టర్ జిపిలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** గ్రామపంచాయితీ ఎన్నికల తొలి విడత నామినేషన్‌లు దాఖలకు నేడు చివరి తేది కావడంతో అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో నామినేషన్‌లు దాఖలు చేశారు. శనివారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం పరిధిలో ఫతేపూర్ క్లస్టర్ జి.పి.లో నామినేషన్ల స్వీకరణ ను కలెక్టర్ పరిశీలించారు. ఫతేపూర్ క్లస్టర్1 నందు ఫతేపూర్, భవాని తండా, లాల్యానాయక్ తండా, తువ్వగడ్డ తండా, సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయనున్నారు. రిటర్నింగ్ అధికారులను నామినేషన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నవాబ్‌పేట్ మండలంలో గ్రామపంచాయితీ కార్యాలయంలో క్లస్టర్5 నందు నవాబ్‌పేట్, పల్లెగడ్డ, దాయపంతులపల్లి, యన్మన్‌గండ్ల సర్పంచు, వార్డు సభ్యుల స్థానాల అభ్యర్థులు నామినేషన్ల స్వీకరణ ను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలోకి గుంపులుగా రాకుండా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారితో పాటు సహాయక రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ సామాగ్రిని, స్ట్రాంగ్ రూమ్ పరిశీలించారు.

## పోలింగ్ మెటీరియల్ సక్రమంగా చేరేందుకు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** పోలింగ్ మెటీరియల్ అన్ని గ్రామ పంచాయతీలకు సక్రమంగా చేరేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా అల్లిపూర్ గ్రామం మహబూబ్‌నగర్ రూరల్ మండలం గ్రామం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో కలిసి నామినేషన్ల ప్రక్రియను పరిశీలించడం జరిగింది. అక్కడ ఉన్న సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే మహ్మదాబాద్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీలో నామినేషన్ వేసే విధానాన్ని పరిశీలించడం జరిగింది. అదేవిధంగా మహమ్మదాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో నిల్వ ఉంచిన ఎన్నికల మెటీరియల్‌ని పరిశీలించి వాటిని గ్రామపంచాయతీ ఎన్నికలు ఎక్కడైతే జరుగుతున్నాయో అని ఎలక్షన్ కేంద్రాలకు విడివిడిగా 82 ఐటమ్స్ ని ప్యాక్ చేసే విధానాన్ని వారికి సూచనలు ఇస్తూ జాగ్రత్తగా పంపించగలరని ఎంపీడీవోకు తాసిల్దార్ మహ్మదాబాద్ కు సూచనలు ఇవ్వడం జరిగింది.

## నామినేషన్ల వద్ద బందోబస్తు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన : కోస్గి సిఐ



**ప్రజాపక్షం/ కొత్తపల్లి/ మద్దూర్ :** నామినేషన్‌ల కేంద్రాలను కొత్తపల్లి , దోరేపల్లి. పల్లెగడ్డ తాండ,నిడ్జింత శనివారం రోజు కోస్గీ సిఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్‌కుమార్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బందోబస్తు ,ప్రాథమిక సౌకర్యాలు అయిన త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు,ప్రహరి గోడలు మొత్తంగా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ,శాంతియతంగా సాగేందుకు పోలిసులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద హెడ్ కానిస్టేబుల్స్ ,కానిస్టేబుళ్ళకు క్లియర్ ఇన్స్‌స్ట్రక్షన్స్ ఇచ్చి ఎలాంటి అనవసర గుంపులు, ఉద్రిక్తలు చోటుచేసుకోకుండా పహారా బలోపేతం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణారావు, సెక్రెటరి వెంకటేష్, పోలిసులు. తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా దివ్యాంగుల ఆటల పోటీలు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు & ట్రాన్స్ జెండర్ల సాధికారత సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినర దివ్యాంగుల క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.జీ. ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎనివాస్ రెడ్డి మాట్లాడుతూ. దివ్యాంగులకు ఉల్లాసం, ఆత్మస్థైర్యం కల్పించడం కోసమే ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా స్థాయిలో నైపుణ్యం చూపాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రతిభ చూపిన వారిని హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జిల్లా తరపున పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దివ్యాంగులు ఉత్సాహంగా ఈ క్రీడల్లో పాల్గొని తమలోని క్రీడా నైపుణ్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గన్న సీడీపీవో జయ మాట్లాడుతూ. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ సహకారంతో ఈ క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వికలాంగులు ఐకమత్యంతో ఆనందంగా పోటీలలో పాల్గొనాలని కోరారు. గెలిచినా.ఓడినా అందరూ సమానమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.ఆర్.ఓ సాయి, డిడబ్ల్యుఓ సిబ్బంది, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్ గౌడ్, అజీజ్ ఖాన్, కాశప్ప, రాధా, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, బిజెపి లోపకారి ఒప్పందంతోనే

# 42% రిజర్వేషన్లకు బ్రేక్

- గ్రామాల అభివృద్ధి కోసమే పంచాయతీ ఎన్నికలు
- బిసి రిజర్వేషన్ సాధించడమే కాంగ్రెస్ లక్ష్యం
- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలో వెనుకబడిన బిసి కులాలకు రాజకీయాలలో 42% రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బిసి కమిషన్ ద్వారా తీసుకొచ్చిన జిఒను బిఆర్ఎస్, బిజెపి లోపాకారి ఒప్పందంతోనే కోర్టు బ్రేక్ వేసిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ ఆరోపించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో బిసి కమిషన్ ద్వారా సమగ్ర కుల సర్వే చేసి, అసెంబ్లీలో చర్చించి, అన్ని పార్టీల ఆమోదం తోనే గవర్నర్‌కు పంపినట్లు గుర్తు చేశారు. బిసిలను రాజకీయంగా అడ్డుకునే కుట్రలో భాగంగానే బిఆర్ఎస్, బిజెపి పార్టీలు లోపకారి ఒప్పందం చేసుకుని కోర్టులో కేసు వేయించి బ్రేక్ వేసినట్లు వారు వెల్లడించారు. ఈ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు 2019లో 22.78 శాతంగా ఉంటే 2025లో 21.39 శాతంగా రిజర్వేషన్లు ఉన్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో ఎక్కువ, గ్రామపంచాయితీలు మున్సిపాలిటీలో కలవడం, కొత్తగా 223 గ్రామ పంచాయితీలు ఏర్పడడంతో 0.50% తగ్గితే, జగిత్యాల, హనుమకొండ జిల్లాలో 27% పైగా బిసిలకు లబ్ది చేరిన విషయం ప్రతిపక్ష పార్టీలకు తెలియదా అని వారు ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికలు మొదలుకొని మొన్న జరిగిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎనికల వరకు ఓటమితో కృంగిపోతున్న కెటిఆర్ బిసిలకు 17 శాతం ఇచ్చారని ఏ రకంగా అబద్దాల చెబుతారో ఈ రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ముందుగా టిఆర్ఎస్ పార్టీ నాయకులు వాళ్ల ఆస్తుల పంచాయతీ, పార్టీలో కుంపట్లు సరి చేసుకున్న తర్వాత రాష్ట్ర ప్రజల బాగోగుల గురించి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ఈ రాష్ట్రంలో గ్రామపంచాయితీల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వమిచ్చే నిధులపై ఆధారపడి ఉంటుందని అందుకోసమే సర్పంచ్ ఎనికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈర కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం బిజెపి ప్రభుత్వం మెడలు వంచైనా సరే 42 శాతం రిజర్వేషన్లు సాధించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, అందుకు అందర్నీ కలుపుకొని పోరాటం చేస్తామని తెలిపారు. గ్రామపంచాయితీ అభివృద్ధి చెందాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులకు ఓ ట్లు వేయాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అ ధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపిన జహీర్ జిల్లా పా ర్టీ అధ్యక్షుడి నియామకం కోసం జాతీయ పార్టీ నియమించిన పరిశీలకులు ఆశావాహుల నుండి 14 దరఖాస్తులు తీసుకున్నారని తెలిపారు. ఢిల్లీకి పంపిన 3 పేర్లలో నా పేరు చేర్చినందుకు ప్రత్యేకంగా అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త గా అధ్యక్షుడిగా ఎన్నికైన సంజీవ్ ముదిరాజ్ తో కలిసి పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా మా ర్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మధుసూదన్ రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్ నిర్వహణ



**ప్రజాపక్షం/జడ్చర్ల :** బూర్గుల రామకృష్ణ కళాశాలలో అకడమిక్ ఆడిట్ కళాశాల విద్యా కమిషనరేట్ ఆదేశాల మేరకు బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షిక అకడమిక్ ఆడిట్ ను నిర్వహించారు. ఈ ఆడిట్ కు కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ శర్వాణి, యం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.సురేష్ ఆడిట్ అధికారులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జీ. సుకన్య సాదరంగా ఆహ్వానించారు. తర్వాత తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి అక్కడ మొక్కలను నారు. తర్వాత కళాశాలలో వివిధ విభాగాలకు సందర్శించి, ముఖ్యంగా లైఫ్ సైన్స్ ఫిజికల్ సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ వంటి 16 విభాగాల అధ్యాపకుల వెబ్ లింక్ ద్వారా కమిషనరేట్ కు సమర్పించిన భౌతిక రికార్డులను పరిశీలించి రిపోర్ట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య సమర్పించారు. తర్వాత ఆడిట్ అధికారులు జి.సుకన్య అధ్యాపకులతో ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించి, వారి పరితనాన్ని, ఉత్తమ ఫలితాలు సాధించారని కొనియాడారు. ప్రతి అధ్యాపకులు పరిశోధన పత్రాలు, పుస్తకాలు రచించాలని సూచించారు. భవిష్యత్తులో ఎ++ గ్రేడ్ సాధించేటట్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఐ.క్యూ, ఏ.సి.కో ఆర్డినేటర్ డాక్టర్ మాధూరి, అకడమిక్ కో ఆర్డినేటర్ రాఘవేంద్ర రెడ్డి, కంట్రోలర్ డాక్టర్ సులేమాన్ అధ్యాపకులు నర్సింలు నరసింహ రావు, వేణు, సతీశ్ రెడ్డి, పుష్పలత, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

## మల్లాయిపల్లి వాసికి డాక్టరేట్



**ప్రజాపక్షం/పానుగల్ :** వనపర్తి జిల్లా పానుగల్ మండలం మల్లాయపల్లి గ్రామానికి చెందిన చింతకుంట కిరణ్ కుమార్‌కు గ్లోబ ల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ (జి హెచ్‌ఆర్‌టి) డాక్టరేట్ ప్రధానం చేసింది. శనివారం హైదరాబాదులోని ఎఫ్‌టిసిసిఐ ఇంటర్నేషనల్ బిజినెస్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన నేషనల్ అవార్డ్స్ కార్యక్రమంలో జిహెచ్‌ఆర్‌టి చైర్మన్ డాక్టర్ హెచ్‌ఆర్ రెహమాన్ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్, సోషల్ వర్క్ విభాగంలో కిరణ్ కుమార్‌కు ఈ అవార్డును ప్రధానం చేశారు. శ్రీలంకకు చెందిన సోషల్ వర్కర్‌తో పాటు భారతదేశంలోని ఎనిమిది రాష్ట్రాలకు చెందిన మొత్తం 35 మంది వివిధ రంగాలలో సుదీర్ఘ సేవలు అందించిన వారికి ఈ అవార్డు లు ప్రధానం చేసినట్లు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపా రు. 25 సంవత్సరాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలందిస్తూ వివిధ రంగాలలో విద్యార్థులను ప్రోత్సాహిస్తూ బాలసాహిత్యంలో విశేష కృషి చేయడమే కా కుండా అనే క సామాజిక కార్యక్రమాలలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు తె లంగాణలో విస్తృతంగా పర్యటించి సామాజిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొన్నారని కొనియాడా రు. రచయితగా, కవిగా, వక్తగా, మోటివేటర్‌గా విద్యారంగంలో కిరణ్ కుమార్ అం దించిన సేవలను తెలియజేశారు. ప్రఖ్యాత గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు. కిరణ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ వచ్చిన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఊర్కొండ మండలంలోని గుడిగానిపల్లి గ్రామానికిచెందిన భీమని అంజమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీసర్పంచ్ , కాంగ్రెస్‌మండలపార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ ధ్యాపనిఖిల్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులద్వారా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో మృతురాలిభర్త భీమని జంగయ్య, కుమారుడు ఆంజనేయులు, కుమార్తె భవిత, మాజీసర్పంచులు రజితకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'నారాయణపేట జిల్లా గడ్డమీద దద్దరిల్లిన దీక్షా దివస్'



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** నారాయణపేట జిల్లా కేంద్రం సింగారం చౌరస్తా బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన దీక్షా దివస్ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్ మోహన్‌రెడ్డి, కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి, జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ నవంబర్ 29, 2009 ఇది యావత్తు తెలంగాణ ప్రజలకు ఎంతో సుపరిచితమైన రోజు కెసిఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అని గర్జించి కెసిఆర్ అమరణ నిరాహర దీక్ష చేపట్టిన చారిత్రాత్మకమైన రోజు, 14 ఏళ్ల సుదీర్ఘమైన మలిదశ ఉద్యమం సాకారమైన రోజు చావును సైతం లెక్క చేయకుండా కెసిఆర్ అమరణ నిరాహార దీక్ష చేపట్టడం ఫలితంగా, ఎంతో మంది విద్యార్థుల బలిదానాలు కారణంగా, కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు వంట వార్పు, రైల్ రోకో, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె వంటి మరెన్నో ఉద్యమాలు చేయడం కారణంగా చేసేది ఏమిలేక అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో దిగివచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసింది. 2004 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేస్తామని అప్పటి టిఆర్ఎస్ ప్రస్తుత బిఆర్ఎస్ పార్టీలు పొత్తు పెట్టుకుని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేయడం వల్లనే 2004 నుంచి 2014 వరకు వందల మంది విద్యార్థులు, ఎంతో మంది ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చింది. తొలిదశలో ఎంతో మంది పోరాడినా, మలిదశ ఉద్యమం చేపట్టి చావును సైతం లెక్క చేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడమే కాకుండా, పదేళ్ల పాటు దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన కెసిఆర్ యావత్తు నాలుగున్నర కోట్ల మంది ప్రజానికానికి యావత్తు నాలుగున్నర కోట్ల మంది ప్రజానికానికి తెలుసు అలాంటి మహనీయుడైన కెసిఆర్‌ని ప్రతినిత్యం పూజించినా తప్పు లేదు.

మళ్లి ఒక్కసారి ఆనాటి ఉ ద్యమ జ్ఞాపకాలను నెమరువేసుకోవాల్సిన అవస రం నెలకొంది. తదుపరి ఉద్యమ నాయకులను శాలువ, పూలమాలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మండల, గ్రామ కమిటీ సభ్యులు, యువ నాయకులు, సోషల్ మీడియా నాయకులు, ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమాల త్యాగాల ఫలితమే తెలంగాణ : మర్రిజనార్దన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణరాష్ట్ర సాధనలో ఉద్యమాలు, త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణరాష్ట్రం సిద్ధించిందని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ చౌరస్తాలోని జిల్లాపార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన దీక్షదివస్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ తెచ్చుడో కెసిఆర్ చచ్చుడో అనేనినాదంతో 2009 నవంబర్ 29న కెసిఆర్ 11రోజులపాటు అమరణ నిరాహారదీక్షకు పూనుకుంటే అప్పటికేంద్రంలోని కాంగ్రెస్‌ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రసాధనకు శ్రీకారం చుట్టిందన్నారు. కెసిఆర్ చేపట్టిన అమరణ నిరాహారదీక్షకు ఎన్నో అడ్డంకులు ఆటంకాలు సృష్టించడానికి ఆంధ్రపాలకులు చేసిన కుట్రలు అన్ని ఇన్నికావని వాటన్నింటిని చేధించుకొని తెలంగాణరాష్ట్రం సాధించడమే లక్ష్యంగా తన ప్రాణాలను ఫణంగాపెట్టి కెసిఆర్ దీక్షకు పూనుకున్నారన్నారు. ఎందరో విద్యార్థులు యువకులు ప్రాణత్యాగాలు చేయడం జరిగిందని ఉద్యమకారుల త్యాగాల ఫలితమే ప్రత్యేక తెలంగాణరాష్ట్రం అన్నారు. మలిదశ ఉద్యమానికి ఉద్యమ నాయకుడిగా ముందుకుసాగిన కెసిఆర్ తెలంగాణరాష్ట్రసాధన ద్వారా చిరకాల ఆకాంక్షను నెరవేర్చారన్నారు. దీక్షాదివ స్ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి ,బిఆర్ఎస్ పార్టీ నాయకు లు ఎడ్మసత్యం, తులసిరామ్‌నాయక్, అర్థంరవి, ప్ర దీప్, నర్సింహ్మాగౌడ్, వేణు గోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డిలతో పాటు నాయకులు, కార్యకర్తలు , మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సిఎం సొంతూరులో సర్పంచ్ ఏకగ్రీవం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** డిసెంబర్ 11న జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలో భాగంగా ఈనెల 27వ తేదినుండి 29వతేదివరకు నామినేషన్ స్వీకరణ ఉండటంతో శనివారం నామినేషన్‌పర్వం ముగియడంతో వంగూరు మం డలపరిధిలోని సిఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో సర్పంచ్‌కు ఒకే నామినేషన్‌రావడంతో సర్పంచ్‌తోపాటు పదివార్డుమెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండారెడ్డిపల్లి సర్పంచ్‌స్థానం ఎస్‌సి రిజర్వుడుకావడంతో గ్రామస్తులుకలిసి సంప్రదింపుల నడుమ మల్లేపాకుల వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటయ్య సిఎంకు క్లాస్‌మేట్, సన్నిహితుడుకావడంతో అతని ఎన్నికతో గ్రామప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

## స్టేజ్ -1 రిటర్నింగ్ అధికారుల వెడెక్స్ శిక్షణ కార్యక్రమం



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నిర్వహణలో భాగంగా స్టేజ్ 1 రిటర్నింగ్ అధికారులవెడెక్స్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం మహబూబ్ నగర్ కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 30 నుండి డిసెంబర్ 2 వరకు జరగనున్న నామినేషన్ ప్రక్రియను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి సిద్ధంగా ఉండాలని సూచించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో ఎన్నికల మార్గదర్శకాలు, పారదర్శకత, నిజాయితీ అత్యంత ప్రాధాన్యతగల అంశాలు కావున ప్రతి ఒక్కరూ అవి కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు, మాస్టర్ ట్రైనర్లుకు నామినేషన్ స్వీకరణ, పరిశీలన, పత్రాల ధృవీకరణ వంటి విధానాలను వివరించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం:

**డిసెంబర్ 3 : నామినేషన్ పత్రాల పరిశీలన**

**డిసెంబర్ 6 :** ఉపసంహరణ అనంతరం తుది అభ్యర్థుల జాబితా విడుదల శిక్షణ కార్యక్రమంలో జడ్ పి సిఈఓ వెంకట్ రెడ్డి, ట్రైనీ డి.పి.ఓ నిఖిలశ్రీ, డిఈఓ ప్రవీణ్ కుమార్ తో పాటు మాస్టర్ ట్రైనర్లు బాలు యాదవ్ బైకాని, శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, సాయిబాబా, పాండు రంగ పాల్గొన్నారు.

## బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరిస్తూ నారాయణపేట జిల్లా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బజరంగ్దళ్ తెలంగాణ ప్రాంత సంయోజక్ శివరాములు, బిజెపి సీనియర్ నాగురావు నామాజీ, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదాన శిబిరం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసిన వారం అవుతామన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. రక్తదాన శిబిరంలో భాగంగా 60 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు మురళి భట్టడ్, కార్యదర్శి ప్రవీణ్, వడ్ల శ్రావణ్ విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన




**ప్రజాపక్షం/వీపనగండ్ల :** అంతర్జాతీయ మహిళ హింస వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని గోవర్ధనగిరిలో జిల్లా మహిళా సాధికారత మిషన్ శక్తి ఆధ్వర్యంలో చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ మిషన్ శక్తి అధికారి సలోమ మాట్లాడుతూ మహిళలు తమపై జరిగే హింసలను చట్టపరంగా ఎదుర్కొవాలని సూచించారు. రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు ఉచిత న్యాయ సహాయాన్ని పొందే హక్కు కలిగి ఉన్నారని సూచించారు. మహిళా చట్టాలైన గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిర్మూలన చట్టం మరియు ఫోక్సో యాక్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సరిత, కానిస్టేబుల్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త, సైనికుడిగా పనిచేయాలి



**ప్రజాపక్షం/ మక్తల్ :** బిజెపి రాష్ట్ర నాయకులు బి. కొండయ్య. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి బిజెపి కార్యకర్త పనిచేయాలి అని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణంలోని ఎఆర్ఎం ఫంక్షన్ హాల్‌లో బిజెపి మక్తల్ మండల మాజీ అధక్షులు లక్ష్మ ణ్ అధ్యక్షతన నిర్వహించిన వివిధ గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్పంచ్ , వార్డు స భ్యులు స్థానానికి పోటీ చేయ్యాలని తెలిపారు. ప్రతి కార్యకర్త, సైనికుడిగా పనిచేసి బిజెపి అభ్యర్థి గెలుపు కోసం కృషి చెయ్యాలని అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు మంజూరు అవుతాయని ఈ విషయా న్ని ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. సర్పంచ్, వార్డు సభ్యులు స్థానలలో బిజెపి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో గెలుపొందాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సోమశేఖర్ గౌడ్, కల్లూరి నాగప్ప, ప్రతాప్ రెడ్డి, చిట్యాల లక్ష్మ ణ్, కుర్వ హనుమంతు, నారాయణ, మజ్జిగ సురేష్, ఉశేనప్ప, వన్నవాడ శ్రీకాంత్, సత్య శ్రీను, అశోక్ గౌడ్, శ్రీనివాసులు, తిమ్మప్ప, కుర్వ లింగం, బ్యాటిరి రాజు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/చింతపల్లి :** విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య దేవరకొండ డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ( ఏఐఎస్ఎఫ్ ) శంశొద్దిన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో శనివారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి, తదనంతరం కమిటీలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దేవరకొండ డివిజన్ సెక్రటరీ వట్టేపు శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టల్లో ఉండే విద్యార్థిని, విద్యార్థులకు చలి దుప్పట్లు సకాలంలో అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు భాను, కమిటీ సభ్యులు ఎం సింధు, కే హారిక, ఎన్ అఖిల్, సింధుజ, మహేశ్వరి, అక్షయ, జువేరియా, చందన, గీత, మేఘన, ఫాతిమ, అఖిల్, వంశీ, గౌతమ్, విగ్నేష్, అన్వేష్, హరిప్రసాద్, శివ పాల్గొన్నారు.



## ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకారం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ కోరారు. శనివారం మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్లకు సంబంధించి మండల పరిధిలోని కుంచమర్తి, జాజిరెడ్డిగూడెం గ్రామాలలో ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు గొడవలకు, విభేదాలకు పోకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఎన్నికలు వచ్చిపోతుంటాయి గ్రామాలలో ఉండాల్సినవి ప్రజలు కావున ప్రజలు అందరూ కలిసి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించకుండా ఉండడానికి పాత నేరస్తులను గతంలో సమస్యలు సృష్టించిన వారిని రూ. 5 లక్షల పూచికత్తుకు బైండోవర్ చేస్తున్నామన్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 5 లక్షల జరిమానా తప్పని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. అంతకుముందు నామినేషన్లు వేసే వారితో మాట్లాడి ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానిక ఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఎంపికి వినతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా రేషన్ డీలర్ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ పార్లమెంటు సభ్యులు కె.రఘువీర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి,జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా17200 మందికి పైగా రేషన్ డీలర్లు పనిచేస్తున్నారని ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను రేషన్ కార్డు దారులకు పంపిణీ చేస్తూ ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్నామని తెలిపారు. గోదాముల నుండి రేషన్ షాపులకు వచ్చే సరుకులు సరైన తూ కాలు లేకుండా ఇవ్వడం వల్ల రేషన్ డీలర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం వచ్చే సరుకులకు హమాలీ ప్రభుత్వమే భరించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రభుత్వంలో రేషన్ డీలర్లకు 5000 గౌరవ వేతనం ప్రతి కింటకు 3 వందల చొప్పున కమిషన్ ఇస్తామని ఇప్పటివరకు నెరవేర్చలేదని వాటిని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ,రాజా రమేష్, బొల్లా వేణుగోపాలరావు, యాదయ్య పాల్గొన్నారు.

## జిల్లా పోలీసుశాఖ హెల్త్ క్యాంపు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎంవీఆర్ గార్డెన్స్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించగా జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ప్రారంభించి మాట్లాడారు. హైద్రాబాద్‌లోని అపోలో మెడికవర్ తదితర ఆసుపత్రుల సహకారంతో పోలీసు కుటుంబసభ్యులందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ డివిజన్‌ల వ్యాప్తంగా సుమారు 1500 మంది పోలీసు కుటుంబీకులు ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో పాల్గొనడం జరిగిందన్నారు. మరిన్ని ఆరోగ్య పరీక్షలు అవసరం ఉన్న వారికి హైద్రాబాద్‌లో చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. పోలీసులు వారి కుటుంబసభ్యులు ఈ హెల్త్ క్యాంపులో పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగభూషణరావు, వెంకటనర్సయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దీక్ష దివస్ అంటేనే చరిత్ర

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం /భువనగిరిరూరల్ :** దీక్ష దివస్ అంటేనే చరిత్ర అని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ దీక్ష దివస్ కార్యక్రమంలో మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్ష దివస్ అంటేనే చరిత్ర 29 నవంబర్ 2009 మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్‌తోనే చరిత్ర మలుపు తిప్పిన రోజు అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం మన ఉద్యమ నేత చావో రేవో అంటూ సమర శంకరం పూరించిన సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిషోర్, బూడిద బిక్షమయ్య గౌడ్, గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్ రెడ్డి పాల్గొనారు.

# అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ప్రీ మెట్రిక్ ,పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు

స్కాలర్‌షిప్‌లు పొందే విద్యార్థుల సంఖ్యను పెంచాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ప్రీ మెట్రిక్ ,పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ ల విషయమై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో స్కాలర్షిప్‌లు పొందే విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకుగాను తక్షణమే ఎంఇఒలు హెడ్మాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని, హెడ్మాస్టర్లు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి స్కాలర్‌షిప్‌ల విషయాన్ని తెలియజేసి తక్షణమే సమావేశాలు నిర్వహించాలని చెప్పా రు. వారం రోజుల్లో ఉపకార వేతనాల దరఖాస్తుల అప్ లోడింగ్‌లో పురోగతి కనిపించాలని ఆదేశించారు. గ్రామాలలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు, హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలని ఆదేశించారు. ఎంఇఒల సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఎంఈఓ లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, సాంఘిక సంక్షేమ డిడి శశికళ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్,ఎల్ డి ఎం శ్రామిక్ హాజరయ్యారు.

**నామినేషన్ల పరిశీలన సమయంలోపు పత్రాలు సమర్పించాలి**

అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించని పక్షంలో నామినేషన్ల పరిశీలన సమయం వరకు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.శుక్రవారం ఆమె తిప్పర్తి మండలంలో తిప్పర్తి ,మామిడాల, పజ్జురు గ్రామ పంచాయతీలలో మొదటి విడత నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇప్పటి వరకు వచ్చిన నామినేషన్లు, అభ్యర్థులకు సమస్యలు ఎదురైతే హెల్ప్ డెస్క్ ద్వారా సూచిస్తున్న వివరాలు,తదితరాలను అడిగి తెలుసుకున్నారు.నామినేషన్ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఒక అభ్యర్థి ఎన్ని సెట్లు నామినేషన్ వేస్తున్నారో వాటిని భద్రపరచాలని, అభ్యర్థులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాలన్నారు. వచ్చిన నామినేషన్లన్నిటిని టీ పోల్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. రిజర్వేషన్ ఉన్న అభ్యర్థులు నామినేషన్ సమయంలో కుల ధ్రువీకరణపత్రాలు సమర్పించ లేకపోతే డిక్లరేషన్ ఫామ్ లో గెజిటెడ్ సంతకంతో సమర్పించి, కరెంట్ అకౌంట్ లేనట్లైతే పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్ ఇచ్చి నామినేషన్ల పరిశీలన లోపు ధ్రువీకరణ,బ్యాంక్ అకౌంట్ పత్రాలును అందజేయాలని చెప్పారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాసరావు,తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుధాకర్,ఆర్ఐ ధ్రువ అర్జున, కృష్ణ తదితరులు, ఉన్నారు. ప్రజావాణి రద్దు : గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.డిసెంబర్ 17 వరకు గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని అప్పటివరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని, అందువలన జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.



## ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార శాఖ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తారని సమాచార శాఖ సహాయ సంచాలకు యు. వెంకటేశ్వర్లు అన్నారు.సమాచార శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందుతున్న జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చిట్టిమల్ల శ్రీనివాస్ పదవీ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ సమాచార శాఖలో చిత్ర ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్యం కల్పించిన సమయం నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమల్లోకి వచ్చిన ప్రస్తుత కాలము వరకు వివిధ దశలలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించి తన వంతు కృషిచేసిన సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ను అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సూర్యపేట జిల్లా ఉపకార నిర్వాహక సమాచార ఇంజనీరు మల్లేశం, మల్టీజోన్ 2 సూపరింటెండెంట్ ఖాజా మోహియుద్దిన్, విశ్రాంత డిపిఆర్ఓ పివి రావు తదితరులు మాట్లాడారు.

# గడువు లోపు వచ్చిన వారందరికీ అవకాశం

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపురం గ్రామ పంచాయతీలో నామినేషన్ ప్రక్రియను శనివారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం మొదటి విడతలో చివరి రోజున సాయత్రం 5 గంటల వరకు నామినేషన్ వేయడానికి వచ్చిన వారి అందరి నామినేషన్లు స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేసారు. జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలి

**ప్రజాపక్షం/యాదాద్రి :** సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే రెండవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాలకు సంబంధించిన 150 గ్రామపంచాయతీలు, 1332 వార్డులకు జరిగే రెండవ విడత నామినేషన్ ప్రక్రియకి సంబందించి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నారన్నారని తెలిపారు. నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటుమూసి వేయాలని, నామినేషన్ కేంద్రంలో రద్దీ లేకుండా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి త్వరగా పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించరని తెలిపారు.

## ముగిసిన మొదటి విడత నామినేషన్ల స్వీకరణ పక్రియ

రాత్రి వరకు లైన్‌లో నిలుచున్న అభ్యర్థులు


అభ్యర్థులకు తలనొప్పిగా మారిన కరెంట్ అకౌంట్ నిబంధన

నేటి నుండి రెండవ విడత నామినేషన్స్ ప్రారంభం

**ప్రజాపక్షం/నల్లగొండ :** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 27 నుంచి ప్రారంభమై శనివారం వరకు మూడురోజుల పాటు కొనసాగింది. జిల్లాలో నల్లగొండ, చండూరు డివిజన్ లో సర్పంచ్ ల, వార్డ్ మెంబర్ల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. మెదటి రోజు నామినేషన్ దాఖలు చేయడంలో నామమాత్రం జరగగా రెండో రోజు గురువారం అష్టం ఉండడంతో నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థులు అంతగా చొరవ చూపలేదు అయితే శనివారం చివరి రోజు కావడంతో సర్పంచ్, వార్డ్ నెంబర్లు అభ్యర్థులు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడానికి నామినేషన్ క్లస్టర్ కార్యాలయానికి చేరుకున్నారు.మొదటి విడత 14 మండలాలలోని 117 క్లస్టర్లలో 318 గ్రామపంచాయతీలకు 318సర్పంచ్, 2870వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించారు. రాజకీయ పార్టీల నుంచి సర్పంచ్ అభ్యర్థులు పోటాపుటిగా తమ నామినేషన్లలో దాఖలు చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఇద్దరు చొప్పున రెబల్స్ నామినేషన్ వేశారు. అదేవిధంగా ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా పోటీపడి నామినేషన్ వేశారు. దీనితో ఉదయం నుంచి రాత్రి వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. అయితే సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎన్నికల ఖర్చులు చేయడానికి నూతన కరెంట్ అకౌంటు నామినేషన్ పత్రాలు ద్వారా జతచేయాలని నిబంధన ఉండడంతో అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. అభ్యర్థులు అందరూ తమ తమ పాత బ్యాంకు అకౌంట్ తో నామినేషన్‌లు దాఖలు చేశారు. అయితే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించని పక్షంలో నామినేషన్ల పరిశీలన సమయం వరకు సమర్పించవచ్చని కుల ధ్రువీకరణపత్రాలు సమర్పించ లేకపోతే డిక్లరేషన్ ఫామ్‌లో గెజిటెడ్ సంతకంతో సమర్పించి, కరెంట్ అకౌంట్ లేనట్లైతే పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్ ఇచ్చి నామినేషన్ల పరిశీలనలోపు ధ్రువీకరణ, బ్యాంక్ అకౌంట్ పత్రాలును అందజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు.

**నేటి నుండి రెండవ విడత ప్రారంభం**

పంచాయతీ ఎన్నిక పర్వం కొనసాగుతుంది మొదటి విడత ఎన్ని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియడంతో రెండవ విడత 10మండలాలలోని 252 గ్రామపంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఈనెల 30నుండి డిసెంబర్ 2వరకు మూడు రోజులపాటు కొనసాగుతుంది.



# క్రిస్టియన్ మినిస్ట్రీస్ సౌజన్యంతో వీల్‌చైర్ల పంపిణీ




**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిసెస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కవనెంట్ చర్చిలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ వీల్ చైర్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని లబ్ధిదారుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఈ గవర్నర్ రేపాల మదన్మోహన్ మాట్లాడుతూ ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గత సంవత్సరం 30 వీల్ చైర్ లను పంపిణీ చేయగా ఈ ఏడాది 22 వీల్ చైర్ లను పంపిణీ చేయడం జరిగిందని, మరో రెండు మూడు నెలల్లో మరో 40 వీల్ చైర్ లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు సాల్మన్, కార్యక్రమ నిర్వహణకు కృషిచేసిన లయన్స్ క్లబ్ శక్తి న్యూ వాయిసెస్ జోన్ చైర్పర్సన్ పసలపూడి ఝాన్సీరాణి లకు అభినందనలు తెలిపారు. నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలనే భావనతో అమెరికాలో ఉన్న సాల్మన్ తో మాట్లాడి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవ కార్యక్ర మాలు చేపట్టడానికి ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కెవి ప్రసాద్,సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సతీష్ కుమార్ కోడె, పుట్ట వెంకన్న,బిషప్ సమర్పన్ కుమార్, సెక్రెటరీ మాధవి,ట్రెజరర్ కరుణ,విజయ,తబిత,ప్రీతి పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన అక్రమ సంబంధం



**ప్రజాపక్షం/చింతపల్లి :** ఓ వ్యక్తి మహిళతో అక్రమ సంబంధాన్ని పెట్టుకొని హత్య చేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాలెం తండాకు చెందిన సభావట్ జ్యోతి ( 38) సభావట్ రాజు అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. రాజు, జ్యోతి ఈ నెల 25వ తేదీన సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో వ్యవసాయ పొలం వద్ద ఇరువురు గొడవపడ్డారని ఎస్సై తెలిపారు. ఈ క్రమంలో మాట మాట పెరిగి రాజు జ్యోతిని బండరాయితో తల పై బలంగా కొట్టడంతో జ్యోతి అక్కడికక్కడే మృతి చెందింది. ఎవరికి అనుమానం రాకుండా జ్యోతి మృతదేహాన్ని రాజు పక్కనే ఉన్న ఓ బావిలో పడేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో జ్యోతి భర్త శ్రీను ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగించిన పోలీసులు శనివారం తండా సమీపంలో ఉన్న బావిలో జ్యోతి మృతదేహాన్ని గుర్తించి బయటికి తీశారు. మృతురాలి భర్త శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్‌రావు, నాంపల్లి సిఐ రాజు, కొండమల్లేపల్లి సిఐ నవీన్ పరిశీలించారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మహిళా మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

# ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వకుండా విధులు

ఎన్నికల సాధారణ పరిశీలకులు

ఐఎఎస్ అధికారి రవి నాయక్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఏలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు విధులు నిర్వర్తించాలని గ్రామ పంచాయితీ ఎన్నికల సాధారణ పరిశీలకులు, ఐఎఎస్ అధికారి రవి నాయక్ అన్నారు. సూర్యాపేట జిల్లాకు సాధారణ పరిశీలకులుగా నియమితులైన ఆయన శనివారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా వ్యయ పరిశీలకులు హుస్సేన్‌తో కలిసి గ్రామ పంచాయితీ ఎన్నికలపై ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి ఎక్స్పెండిచర్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ రవి నాయక్ మాట్లాడుతూ ఎస్ఎస్‌టి, ఎఫ్ఎఫ్‌టి విధులు కేటాయించిన సిబ్బంది ఎన్నికల కమీషన్ రూల్స్ పాటిస్తూ బాధ్యతాయుతంగా ఖచ్చితమైన సమాచారాన్ని మాత్రమే ఇవ్వాలన్నారు. సహాయక వ్యయ పరిశీలకులు ఎన్నికల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఏ రోజు నివేధికలు ఆ రోజే పంపించాలని నివేధికలు తప్పులు లేకుండా ఖచ్చితంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల నివేదికల సమర్పణ ఎన్నికల విధుల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల కమీషన్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అధికారులు సర్పంచ్ వార్డు సభ్యులుగా పోటీ చేయు అభ్యర్థులు ఏదైనా నగదు, ఆర్టికల్స్, లిక్కర్స్ తరలిస్తే అట్టి ఖర్చులను వారి ఖాతాలో జమ చేయాలన్నారు. ప్రతి ఏఈఓ ఏ రోజు నివేదిక ఆరోజు సాయంత్రం ఐదు గంటలకల్లా నోడల్ ఆఫీసర్‌కి సమర్పించాలని సూచించారు. వీడియో సర్వేలైన్స్ సిబ్బంది వీడియో ఫుటేజ్ ఎంపిడిఓకు సమర్పించి అట్టి ఫుటేజిని కంప్యూటర్ హార్డ్ డిస్క్, పెన్‌డ్రైవ్‌లో సేవ్ చేసుకోవాలని తెలిపారు. గ్రామాలలో లిక్కర్ తరలించే అభ్యర్థులను గుర్తించి అట్టి లిక్కర్‌ను సీజ్ చేసి అభ్యర్థి ఖాతాలో జమ చేసి అభ్యర్థి వ్యయంకంటే ఎక్కువగా ఖర్చు చేసినచో అట్టి అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల విధులు బాధ్యతాయుతంగా సక్రమంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చి విజయవంతంగా ఎన్నికలు పూర్తి చేయాలని కోరారు. వ్యయ పరిశీలకులు బి హుస్సేన్ మాట్లాడుతూ ఏఈఓలు వారికి కేటాయించిన మండలాలలోకి వెళ్లి ఎంపిడిఓలతో కలిసి వారికి కేటాయించిన గ్రామ పంచాయితీలను తనిఖీ చేసి ఎటువంటి నగదు, వస్తువులు, లిక్కర్, పేపర్ పాంప్లెట్లు దొరికిన వాటిని సీజ్ చేసి అభ్యర్థి ఖాతాలో జమ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిసిఓ ప్రవీణ్ కుమార్, జిల్లా ఫారెస్ట్ అధికారి సతీష్, జోనల్ ఆఫీసర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

# రీల్



## డిసెంబర్ 12న 'దేవగుడి' విడుదల

పుష్యమి ఫిలిం మేకర్స్ పతాకంపై బెల్లం రామకృష్ణారెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం దేవగుడి. ఈ చిత్రం డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ తిరుపతి, గొల్లపల్లిలోని సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ గ్రూప్ ఆఫ్ ఇన్ స్టిట్యూట్‌లో విద్యార్థుల సమక్షంలో చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ కార్యక్రమంలో సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎర్రపురెడ్డి ఆనంద్ రెడ్డి, టీ.వి.మురళీనాథ్ రెడ్డి, కళాశాల ఏదో స్వామినాథ్, రాయలసీమ విద్యాసంస్థల అధినేతలు ఎర్రపురెడ్డి కొండా రెడ్డి ఎర్రపురెడ్డి విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయని చిత్ర ఈ సినిమాలో పాడిన పాటను సైతం కళాశాలలో ప్రదర్శించారు. హీరో కావాలని ఎన్నో ఏళ్ల పాటు కష్టపడ్డానని, ప్రేక్షకులందరూ తనను ఆశీర్వదించాలని హీరో అభినవ శౌర్య కోరారు. ఇంజనీరింగ్ విద్యార్థుల కేరింతల నడుమ హీరోయిన్ అనుశ్రీ సినిమాలో కొన్ని డైలాగులు చెప్పింది. దర్శక, నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 19 విడుదల కానుందని అన్నారు. సినిమా విడుదలకు రెండు రోజుల ముందు గానే తిరుపతిలో ప్రివ్యూ షో వేస్తున్నట్లు ప్రకటించారు బెల్లం రామ కృష్ణారెడ్డి. సినిమాలో ఓ పాటకు హీరో, హీరోయిన్లు స్టెప్పులు వేసి అలరించారు.



## హిందీలో డబ్బింగ్ నేనే చెప్పాను

### 'అఖండ- 2' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నందమూరి బాలకృష్ణ

బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా 'అఖండ–2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. 'అఖండ–2: తాండవం' 2డీ, 3డీ రెండు ఫార్మాట్లలో డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఘనంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. ఈ రుద్ర తాండవ విన్యాసం నాలో ఆవేశమై, ఆ త్రినేత్రుడి వీక్షణ దృష్టి నాలో నిక్షిప్తమై, ఆయన త్రిశూలం నా ఆయుధానికి శక్తి శూలమై.. ఎలా ఉండబోతుందో నా పాత్ర మీరు తెరపై చూస్తారు. బోయపాటి నేను ఏదైనా సినిమా చేయాలనుకుంటే మూడే నిమిషాలు మాట్లాడుకుంటాం. ఆ మహా యజ్ఞంలోకి దిగిపోతాం. నేను పాదరసం లాంటివాడిని ఎందులోకి వెళ్తే ఆకారం సంతరించుకుంటాను. నా బాట సూటిగా ఉంటుంది నా మాట ముక్కుసూటిగా ఉంటుంది. మొన్న ఉత్తరప్రదేశ్‌కి వెళ్ళాము సిఎం యోగి ఆదిత్యనాథ్ ట్రైలర్ చూశారు. దీంతో పాటు ఇంకొంత కంటెంట్ కూడా చూశారు. సనాతనం ధర్మం శక్తి గౌరవం పరాక్రమాన్ని ఈ సినిమాలో ఎంతో అద్భుతంగా చూపించారని అభినందించారు. సనాతన ధర్మం మనదే భారతదేశానికి మూలాలు. ఆనాడు చత్రపతి శివాజీ సైన్యంలో కూడా అఘోరాలు ఉండేవారు. గొప్ప పోరాటం చేసేవారు. నా సినిమా ఉగాది పచ్చడి లాంటిది అన్ని రసాలు ఉండాలి. ఈ సినిమాని జార్జియాలో చాలా చలి ప్రదేశాల్లో ఎలా ఎన్నో అద్భుతమైన లొకేషన్స్‌లో షూట్ చేశాం. ఈ సినిమాకి హిందీలో డబ్బింగ్ కూడా నేనే చెప్పాను అన్నారు. డైరెక్టర్ బోయపాటి శ్రీను మాట్లాడుతూ ఇందులో మా చిన్నబ్బాయి ఒక క్యారెక్టర్ చేశాడు తనకి మీ అందరి బ్లెస్సింగ్స్ కావాలి. అఖండ ప్రజల్లోకి బాగా చొచ్చుకుని వెళ్లింది. తాండవం చేస్తే నిజంగా పరమేశ్వరుడే కనిపించాలి అనుకుని ఈ సినిమా ప్రారంభించాం. అఖండ–2 డిసెంబర్ 5న రిలీజ్ అవుతుందన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ.. ఈ డ్రీమ్‌కి సపోర్ట్ చేసిన ప్రొడ్యూసర్స్ 14 రీల్స్, దూకుడు సినిమా నుంచి నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను. అఖండ కంటే అఖండ–2 మూడింతలు ఎక్కువ ఉంటుంది. బాలయ్యతో బ్యాక్ టు బ్యాక్ ఐదు సినిమాలకు పని చేయడం ఎంతో అదృష్టం ఉంటే గాని జరగదు అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత గోపి ఆచంట, హీరోయిన్ సంయుక్త, ఆది పినిశెట్టి , హర్షాలి, పూర్ణ, మురళీమోహన్, కబీర్, రామ్ లక్ష్మ ణ్, గంగాధరశాస్త్రి, కాసర్ల శ్యామ్, కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

## 'ఫూలే' ట్రైలర్ విడుదల

సమాజంలో అసమానతలు తొలగి పోవాలి. మహిళలు చదువుకోవాలి అని నినదించిన మహాత్మ జ్యోతిబా ఫూలే జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన సినిమా 'ఫూలే' హిందీలో విడుదలై సూపర్ హిట్ అయిన ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు పొన్నం రవిచంద్ర ఈ సినిమాను తెలుగులో అనువాదం చేసి విడుదల చేస్తున్నారు. జ్యోతిబా ఫూలే వర్ధంతి సందర్భంగా ప్రసాద్ ల్యాబ్‌లో తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ తెలుగు



వర్షన్‌కు ఎంఎం శ్రీలేఖ సంగీతం అందించారు. రెండు పాటలతో పాటు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సహా ప్రభుత్వ సలహా దారు కె.కేశవరావు, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంత రావు, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, గాయని విమలక్క, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు. సుపద క్రియేషన్స్ బ్యానర్‌పై డా.పొన్నం రవిచంద్ర నిర్మించిన 'ఫూలే' సినిమాకు అనంత నారాయణ్ మహదేవన్ దర్శకత్వం వహించారు.



## కింగ్‌లా ఫీల్ అవుతున్నా : ఉపేంద్ర

'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సక్సెస్ మీట్ హీరో ఉపేంద్ర మాట్లాడుతూ.. ఈ కథ విన్నప్పుడే థ్రిల్ అయిపోయాను. ఎమోషనల్‌గా అద్భుతంగా అనిపించింది. కానీ టైటిల్ ఆంధ్ర కింగ్ అని చెప్పినప్పుడు కాస్త టెన్షన్ అనిపించింది. నేను ఎలా ఆంధ్ర కింగ్ అవుతాను అనిపించింది. కానీ ఇప్పుడు అనిపిస్తుంది. ఇక్కడ ఉన్న వాళ్ళందరూ కూడా ఆంధ్ర కింగ్స్. నేను కింగ్ లాగా ఫీల్ అవుతున్నాను అంటే అది మీ గొప్పతనం. అంత పెద్ద మనసు మీది. నేను గత 25 ఏళ్లుగా ఎప్పుడు ఇక్కడికి వచ్చినా ఇది నా ప్లేస్ అనిపిస్తుంది. మైత్రి మూవీ మేకర్స్‌లో ఫస్ట్ టైం వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. ఇది ఒక మంచి అవకాశంగా భావిస్తున్నాను. డైరెక్టర్ మహేష్ అద్భుతమైన సినిమా తీశారు. హీరో ఫ్యాన్ మధ్య వున్న డివైన్ ఎమోషన్‌ని అద్భుతంగా చూపించారు. నా ఫ్యాన్ సాగర్(రామ్) మహాలక్ష్మి (భాగ్యశ్రీ) అమెరికాలో సినిమా ప్రమోట్ చేస్తున్నారు. ఇప్పుడు కూడా ఫ్యాన్‌ని అక్కడ పెట్టారు సినిమాకి ఇంత అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ఆడియన్స్ కి థాంక్యూ అని చెప్పారు. ఈ మీట్‌లో డైరెక్టర్ మహేష్ బాబు పి, నిర్మాత రవిశంకర్, ఎస్కేఎన్, మ్యూజిక్ డైరెక్టర్ వివేక్ మర్విన్ పాల్గొన్నారు.

## ఆహా ఓటిటిలో 'ప్రేమిస్తున్నా' స్ట్రీమింగ్

వరలక్ష్మి పప్పుల ప్రజెన్స్‌లో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లుగా నటించారు. ప్రేమిస్తున్నా సినిమా నవంబర్ 7న థియేటర్స్‌లో విడుదలై మంచి మౌత్ టాక్‌ను సొంతం చేసుకుంది. థియేటర్స్‌లో మిస్ అయిన ఆడియన్స్ ఈ సినిమాను ఆహా ఓటిటిలో చూడవచ్చు.





## 'డిస్కవర్ ఆంధ్ర' గ్లింప్స్ రిలీజ్




పవన్ కళ్యాణ్ సహకారంతో నవదీప్ పల్లపోలి, సాయి దుర్గ తేజ్ సారథ్యంలో శ్రీకాంత్ మన్నెపురి 'డిస్కవర్ ఆంధ్ర' డాక్యుమెంటరీని తెరకెక్కించారు. ఈ ప్రాజెక్ట్‌ను పడాల సురేందర్ రెడ్డి, శ్రావ్య కూనం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్, గ్లింప్స్ లాంఛ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ 2020లో నాకు ఈ వైల్ లైఫ్ గురించి ఎక్కువగా ఆలోచనలు వచ్చాయి. అందుకే 'గ్రీన్ పాస్' అనే ఎన్జీవోని నా స్నేహితుడితో కలిసి ప్రారంభించాను. బీచ్ క్లీన్ చేయడం, కోస్టల్ ఏరియాలోని జీవుల్ని, పక్షుల్ని రక్షించే ప్రయత్నం చేస్తున్నాం. మన కల్చర్, మన నేచర్‌ను మనమే కాపాడుకోవాలి. నవదీప్ మాట్లాడుతూ శ్రీకాంత్ 2014లో ఈ వైల్ లైఫ్ జర్నీని ప్రారంభించారు. 72 నిమిషాల నిడివితో అద్భుతమైన డాక్యుమెంటరీని శ్రీకాంత్ చూపించబోతోన్నారు. 'మన రాష్ట్రంలో ఇన్ని అద్భుతాలు ఉన్నాయా? అని డాక్యుమెంటరీ చూసిన తరువాత అందరూ ఆశ్చర్యపోతారు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ మన్నెపూరి పాల్గొన్నారు.

## 'పెద్ది' పోరాట సన్నివేశాల చిత్రీకరణ

బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చేస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్‌కు, 'చికిరి' పాటకు వచ్చిన అద్భుతమైన స్పందన గురించి అందరికీ తెలిసిందే. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మాత.. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మకంగా సమర్పిస్తున్న 'పెద్ది'ని భారీ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం 'పెద్ది' బృందం రామ్ చరణ్, ఇతర ఫైటర్లతో పాటు కీలకమైన, హైఇంటెన్సిటీ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తోంది. ఈ షూటింగ్‌లో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కూడా పాల్గొంటున్నారు. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా భారీ సెట్‌ను నిర్మించారు. అక్కడ ఈ భారీ యాక్షన్ బ్లాక్‌కు సంబంధించిన చిత్రీకరణ జరుగుతోంది. 'పెద్ది' చిత్రాన్ని మార్చి 27, 2026న గ్రాండ్‌గా పాన్‌ఇండియా వైడ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నారు.





## ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేడు బర్డ్ వాకింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఆదివారం బర్డ్ వాక్ నిర్వహిస్తున్నట్లు ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. ఉదయం 6 గంటల నుండి 9.30 గంటల వరకు ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో జరిగే 'బర్డ్ వాక్' కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారు పక్షుల జాతులను గుర్తించడం, పక్షులు ఏ రకమైన వాతావరణంలో, ఏ రకమైన వృక్షాలలో గూళ్ళు కడతాయి అనేది తెలుసుకోవచ్చు, పక్షుల ఆహారపు అలవాట్ల గురించి, పక్షులు ఎలా ఎగురుతాయి, మరియు వాటి సామాజిక ప్రవర్తనలు ఎలా ఉంటాయో ఇక్కడి పక్షి నిపుణులు నేచురలిస్ట్ లు వచ్చిన వారికి పక్షులను చూపిస్తూ క్షుణ్ణంగా వివరిస్తారని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్ తెలిపారు.ఉదయం బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ వంటి కార్యక్రమాలు ఉంటాయి, పాల్గొనే వారికి సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం మరియు ఉదయం బ్రేక్ ఫాస్ట్ కూడా అందిస్తామని ఆయన తెలిపారు.

## శభాష్ ఫైర్ ఆఫీసర్..

### కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర



ప్రజాపక్షం/హైదరాబాద్: ములుగు జిల్లా అగ్నిమాపక శాఖ ఫైర్ ఆఫీసర్ ఎ.నాగరాజు కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 4,250 కిలోమీటర్ల సైక్లింగ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా నాగరాజును ఫైర్ సర్వీసెస్ డిజి విక్రం సింగ్ మాన్ సత్కరించారు. నవంబర్ ఒకటిన ప్రారంభించిన ఈ యాత్ర ఈ నెల 16వ తేదీన పూర్తి చేశారు. ఈ సైక్లింగ్ రైడ్‌ను ఫిట్ ఇండియా మూవ్‌మెంట్‌లో భాగంగా, యూత్ అండ్ స్పోర్ట్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేర్ టు గేర్ సంస్థ నిర్వహించింది. భారత మాజీ హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి 150వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భారతదేశం నలుమూలల నుండి అందిన 3,000 పైగా దరఖాస్తుల్లోంచి మొత్తం 150 మంది మాత్రమే ఈ రైడ్‌కు ఎంపికయ్యారు. ఆసియాలో అత్యంత కఠినమైన సైక్లింగ్ ఎక్స్‌పెడిషన్స్‌లో ఇది ఒకటి. మొత్తం రైడ్ జమ్మూ, కాశ్మీర్, హర్యానా, పంజాబ్, న్యూఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మీదుగా సాగింది. ప్రతి రోజు 250 నుంచి 325 కిలోమీటర్లు సైక్లింగ్ చేశేవారని నాగరాజు తెలిపారు. ఇకపై లండన్–ఎడిన్‌బర్గ్–లండన్ సైక్లింగ్ ఎక్స్‌పెడిషన్, పారిస్ పిబిపి సైక్లింగ్ రైడ్‌లో పాల్గొనే లక్ష్యంతో ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఐరన్ మాన్ పోటీలో పాల్గొని గెలవడం కూడా తన లక్ష్యమని నాగరాజు మీడియాకు తెలిపారు.

## భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

### సిబిసి రాజ్యాంగ దినోత్సవ ఫోటో ఎగ్జిబిషన్‌లో జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ప్రాథమిక హక్కులు భారత ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువు అని, పౌరులు తమ ప్రాథమిక విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఈ హక్కులు అర్థవంతంగా ఉంటాయని హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి అన్నారు. కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ ఫోటో ఎగ్జిబిషన్‌ను జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి శనివారం సందర్శించారు. రాజ్యాంగ దినోత్సవం, వందేమాతరం 150 సమాచార ప్యానెల్లను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. విద్యార్థులకు రాజ్యాంగ ఇతివృత్తాలను ఆకర్షణీయంగా, సమాచారం అందించే విధంగా ప్రదర్శించడానికి చేసిన ప్రయత్నాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అనుకూలతే దాని గొప్ప బలం అన్నారు. సాంకేతికత, న్యాయం అందించడం, పరిపాలన, సంక్షేమం సహా అభివృద్ధి చెందుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా దానిని మార్చుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. భారత్ ఇప్పుడు దాని శాస్త్రీయ, ఆర్థిక విజయాల కోసం మాత్రమే కాకుండా సహనం, బలమైన కుటుంబ వ్యవస్థలు, యోగా వంటి సామాజిక విలువల కోసం కూడా ప్రపంచ గౌరవాన్ని పొందుతోందని ఆయన చెప్పారు. ప్రతి పౌరుడినీ సమానంగా చూడాలని, సోదర భావంతో పనిచేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబిసి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, కెఎంఈఎస్ కార్యదర్శి ఎ.వి.సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి బి.శ్రీధర్ రెడ్డి, కెఎంసిఎల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది తదితర ప్రముఖులు పాల్గొన్నారు.




## రుణ హత్యలు..

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడో ఒకచోట ఇచ్చిన డేటా చోరీకి గురై రుణ సంస్థల చేతికి చిక్కుతోంది. అనుమతి లేకుండానే ఫోన్లకు మెసేజ్లు, కాల్స్ చేస్తూ రుణాల ఎర వేస్తున్నారు. డిజిటల్ భద్రతపై ఎన్ని చట్టాలు ఉన్నా, క్షేత్రస్థాయిలో అవి నిరర్థకమని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

**చార్జీల పేరుతో దోపిడీ**

రుణం మంజూరు చేసే సమయంలోనే ఈ సంస్థలు మోసానికి తెరలేపుతున్నాయి. ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్, డాక్యుమెంటేషన్ చార్జీల పేరుతో దాదాపు 7 నుండి 8 శాతం మొత్తాన్ని ముందే కోత విధిస్తున్నాయి. అంటే లక్ష రూపాయల రుణం తీసుకుంటే చేతికి వచ్చేది 92 వేలే. కానీ వడ్డీ మాత్రం పూర్తి లక్షకు కట్టాలి. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం వడ్డీ రేట్లు, చార్జీలు పారదర్శకంగా ఉండాలి. కానీ ఈ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. అధిక వడ్డీలు వసూలు చేయడం చట్టరీత్యా నేరం అయినప్పటికీ, ప్రైవేట్ సంస్థలు ఇవి పాటించడం లేదు.

**వసూళ్ల పేరుతో వేధింపుల పర్వం**

రుణం తీసుకున్న వ్యక్తి అనివార్య కారణాల వల్ల సకాలంలో చెల్లించలేకపోతే, ఆ సంస్థలు ప్రదర్శించే పైశాచికత్వం సభ్యసమాజం తలదించుకునేలా ఉంటోంది. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం ఋణ వసూలుకు నిర్దిష్ట పద్ధతులు ఉన్నాయి. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే సంప్రదించాలి. కానీ రికవరీ ఏజెంట్లు అర్ధరాత్రి ఫోన్లు చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం, మార్ఫింగ్ ఫోటోలతో బెదిరించడం పరిపాటిగా మారింది. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యుల ముందు పరువు తీయడం, ఇరుగు పొరుగు వారికి చెప్పి అవమానించడం వంటి చర్యలు చట్టవిరుద్ధం. రుణ గ్రహీతను మానసికంగా కృంగదీసి ప్రాణాలు తీసుకునేలా చేయడం లాంటి చర్యలకు దిగుతుంది. ఇది ముమ్మాటికీ నేరమే.

**పెరుగుతున్న ఆత్మహత్యలు**

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) తాజా గణాంకాల ప్రకారం దేశంలో జరుగుతున్న ఆత్మహత్యల్లో 5 శాతానికి పైగా అప్పుల బాధల వల్లనే జరుగుతున్నాయి. గత రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో వందలాది మంది యువకులు, చిరుద్యోగులు ఈ లోన్ యాప్ల వేధింపులు తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడ్డారు. పరువు పోతుందన్న భయంతో కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకున్న ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్‌బిఐ కఠిన చర్యలు తీసుకోవాలి. అక్రమ రుణ యాప్లను నిషేధించడంతో పాటు, డేటా చౌర్యంపై ఉక్కుపాదం మోపాలి. వేధింపులకు పాల్పడే రికవరీ ఏజెంట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రజలు కూడా అనధికారిక యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

### చట్టం ఏం చెబుతోంది..

రుణం ఎగవేత సివిల్ వివాదం మాత్రమే. దీనికి ఆస్తుల జప్తు లేదా చట్టపరమైన నోటీసులు ఇవ్వడం వంటి మార్గాలు మాత్రమే అనుసరించాలి. కానీ ప్రైవేట్ గుండాలను పంపి భౌతిక దాడులకు దిగడం, వేధించడం చట్టం అంగీకరించదు. సదరు సంస్థలు చట్టపరంగా కోర్టును ఆశ్రయించాలి తప్ప, సొంత చట్టాలను అమలు చేయకూడదు. ఇలా చేస్తే బాధితులు పోలీసులను, లేదా కోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చు.

– బందల రవీందర్ అడ్వకేట్ మంచిర్యాల

## వణికిన తమిళనాడు

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. తమిళనాడులోని కావేరి డెల్టా జిల్లాలైన తంజావూర్, తిరువరూర్, నాగపట్టణం, మైలాదుతురైలకు రెడ్ అలెర్ట్ జారీచేసింది. తుత్తుకుడిలో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి.

**ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బలగాలు**

సముద్రంలో అలలు పెద్దఎత్తున ఎగిసిపడుతుండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. నాగపట్టణంలోనూ చేపల వేటకు వెళ్లే ఓడలు, పడవలు ఒడ్డుకే పరిమితమయ్యాయి. రామేశ్వరం వద్ద సముద్రం కల్లోలంగా మారడంతో ధనుష్కోటికి వెళ్లకుండా పర్యటకులను నిలిపివేశారు. పుదుకొట్టైలో భారీవర్షానికి రిజర్వాయర్‌లోకి వరద ప్రవాహం పెరగటం వల్ల నీటికి దిగువకు వదులుతున్నారు. దీంతో జనని నగర్, కలిముత్తులో కాలనీల్లోకి వరదచేరింది. ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉండటంతో అరక్కోణంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలను మోహరించారు. తంజావూరులో కూడా 30మందితో కూడిన బృందాన్ని సిద్ధంగా ఉంచారు.

**విమానాల సర్వీసులు రద్దు**

దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ విభాగం హెచ్చరికతో తమిళనాడు సిఎం ఎం.కె స్టాలిన్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలని తరలించాలని ఆదేశించారు. మరోవైపు ఈ తుపాను కారణంగా పలు జిల్లాల్లో 54 విమానాలు రద్దు చేసినట్లు చెన్నై విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా చెన్నై నుంచి తూత్తుకుడి, మధురై, తిరుచ్చికి వెళ్లే 16 విమానాలను రద్దు చేశారు. అదేవిధంగా, తూత్తుకుడి, తిరుచ్చి, మధురై నుండి చెన్నైకి వెళ్లే 16 విమానాలను కూడా రద్దు చేశారు. అదనంగా, మధురై, తిరుచ్చి, పుదుచ్చేరి నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లే 22 విమానాలను నిలిపివేశారు. తపాను కారణంగా కడలూర్ జిల్లాలో లక్ష మందికి సరిపడ ఆహారం, ఆశ్రయం కల్పించడానికి తమిళనాడు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయం మంత్రి ఎంఆర్‌కె పన్నీర్ సెల్వం తెలిపారు.

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల 239 ప్రభావితమయ్యే ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 925 మంది గర్భిణీలకు సకాలంలో వైద్య సాయం అందేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గాలులు కారణంగా పడిపోయిన చెట్లను వెంటనే తొలగించడానికి సన్నాహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## శ్రీలంకలో అత్యవసర పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు చెందిన 2,00,000 మంది పైగా ప్రజలు ఈ ప్రకృతివైపరీత్యాల బారినపడ్డారు. ఈ పరిస్థితులపట్ల భారతదేశం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. శ్రీలంకకు 21 టన్నుల సహాయ సామాగ్రిని పంపింది. అవసరమైతే మరింత సహాయం పంపుతామని కూడా శ్రీలంక ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసింది. భారత వైమానికదళం సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ, ప్రకృతి వైపరీత్యాలతో శ్రీలంక తీవ్ర నష్టానికి గురైందని, సహాయ కార్యక్రమాల కింద ఆపరేషన్ సాగర్ బంధు కార్యక్రమం చేపట్టి వారికి సహాయ సామాగ్రి అందజేశామని తెలిపింది. 80 మంది ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా వెళుబ్బూరు. ఎనిమిది టన్నుల పరికాలను, నిత్యావసర ఆహారాన్ని ఇతర కీలక సరఫరాలను శ్రీలంక ప్రభుత్వానికి అందజేశారు. కాగా శ్రీలంకలో పరిస్థితులపై దేశాధ్యక్షుడు దిస్సనాయకే అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. వైద్యులు, కార్మిక సంఘాలకు లేఖలు రాశారు. దేశంలో పరిస్థితులను అర్థం చేసుకోవాలని, అత్యవసర పరిస్థితి విధించడానికి కారణాలు గ్రహించి సహకరించాలని ఆయన ఆ లేఖలో కోరారు. శరవేగంగా సైన్యాన్ని, పోలీసులు, సహాయాన్ని మోహరించడానికి అత్యవసర పరిస్థితులు కావాలన్నారు. దిత్వా తుఫాను ప్రభావం వల్ల భారీ వరదలు సంభవించాయి. అపారమైన నష్టం వాటిల్లింది. దిత్వా తుఫాను ప్రభావం దేశంపై కొద్దిరోజులపాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

**ఇండోనేసియాలో 279కి పెరిగిన మృతులు**

ఇండోనేసియాలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మృతులసంఖ్య 279కి పెరిగింది. ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఇంకా 174 మంది జాడ తెలియరాలేదు. శనివారం సహాయ బృందాలు మరిన్ని ప్రాంతాలకు వెళ్ళి కొండచరియలు పడిన ప్రాంతాల్లో బురద,మట్టి, రాళ్ళను తొలగించి మృతదేహాలను వెలికితీసే పనులు ప్రారంభించాయి. ఉత్తర సుమత్ర రాష్ట్రంతో దేశానికి సంబంధాలు తెగిపోయాయి. రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. సమాచార వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. ఉత్తర సుమత్రలో శనివారం 31 మృతదేహాలను శిథిలాల నుండి వెలికితీశారు. దాదాపు 3,500 కంటే ఎక్కువమంది పోలీసులను గాలింపు చర్యల నిమిత్తం మోహరించారు. ఇంకా 174 మంది జాడ తెలియడంలేదు. 28,400మంది ప్రజలను తాత్కాలిక శిబిరాలకు తరలించి సహాయం అందిస్తున్నారు.

**థాయ్‌లాండ్‌లో 162కు పెరిగిన మృతులసంఖ్య**

ప్రకృతి వైపరీత్యాల కారణంగా థాయ్‌లాండ్‌లో మరణించినవారిసంఖ్య 162కు పెరిగింది. బాధిత కుటుంబాలకు, మరణించినవారి కుటుంబాలకు సహాయం అందజేస్తామని థాయ్‌లాండ్ ప్రధానమంత్రి అనుతిన్ ఛార్న్విరాకుల్ ప్రకటించారు. దాదాపు 10.40 లక్షల మంది నివాసితులు, 30.80లక్షలమంది ప్రజలు భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయారు. మొత్తం 12 రాష్ట్రాలలో వర్షాలు, వరదు బీభత్సం సృష్టించాయి. ప్రభుత్వ ప్రతినిధి సిరిపోంగ్ అంగ్‌కరసలకుల్‌కైత్ మాట్లాడుతూ, ఎనిమిది రాష్ట్రాలలో వరదలవల్ల 162 మంది మరణించారని ధృవీకరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com